www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

పిల్లలపై 'నెస్లే' వివక్ష!

యూరప్‌లో యాడెడ్ సుగర్స్ లేకుండా పిల్లల ఆహారం

దక్షిణాసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో అమ్మే ఉత్పత్తుల్లో మాత్రం కృత్రిమ తీపి పదార్థాలు జోడింపు

భారత్‌లో అమ్మే సెరిలాక్‌లో సర్వింగ్‌కు 2.7గ్రా. చక్కెర

స్విట్జర్లాండ్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ తాజా నివేదిక

ఐదేళ్లుగా యాడెడ్ సుగర్స్‌ను 30 శాతం తగ్గించామన్న నెస్లే ఇండియా

12

శుక్రవారం | 19-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 20 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం, తిథి: ఏకాదశి రా. 8.05 తదుపరి ద్వాదశి; నక్షత్రం: మఖ ఉ. 10.57 తదుపరి పుబ్బ; వర్జ్యం: రా.7.59-9.47, దుర్ముహూర్తం: ఉ.9.29-9.19, మ.12.39-1.29, అమృతఘడియలు: ఉ.8.15-10.03, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 5.59; సూర్యాస్తమయం: 6.28 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పదేళ్లలో దేశానికి ఏం చేశారు?

బీజేపీకి ఎందుకు ఓటేయాలి

400 సీట్లు గెలుస్తామనుకోవడం భ్రమే.. దక్షిణాదిలోని 130 స్థానాల్లో ఆ పార్టీకి 15 దాటవు

కేసీఆర్ కూడా అసెంబ్లీ ఎన్నికల్లో వంద సీట్లు గెలుస్తామని చెప్పారు.. కేరళలో మీడియాతో సీఎం రేవంత్



కేరళలోని తుంబాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల్లోని 130 లోక్‌సభ స్థానాల్లో బీజేపీకి అతికష్టమ్మీద 12-15 స్థానాలు మాత్రమే వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మిగతా స్థానాలన్నీ ఇండియా కూటమి పార్టీలే కైవసం చేసుకోబోతున్నాయని పేర్కొన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో దేశానికి ఏం ఒరగబెట్టిందని ప్రజలు ఆ పార్టీకి ఓటు వేస్తారని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువుల ధరలు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగాయని, నిరుద్యోగం గరిష్ఠ స్థాయికి చేరిందని, రైతుల సమస్యలు పెరిగిపోయాయని తెలిపారు. ముఖ్యంగా గత పదేళ్లలో ప్రధాని మోదీ.. దేశాన్ని రూ.130 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని

మిగతా 13వ పేజీలో...

నామినేషన్ నుంచే అభ్యర్థులకు తోడుగా..

13

- నేటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం
- నేడు మహబూబ్‌నగర్, మహబూబాబాద్‌కు
- కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్‌కు హాజరు
- ఎన్నికల ప్రచార జాతర సభల్లో ప్రసంగం
- 20న మెదక్‌కు, 21న భువనగిరి సభకు
- కర్ణాటకలోనూ ప్రచారం చేయనున్న రేవంత్

మంత్రి తుమ్మలపై దాడికి కుట్ర..!

అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే పథకం

నేలకొండపల్లి మామిడి తోటలో వ్యూహరచన

ఖమ్మం మార్కెట్ వద్ద స్కెచ్.. అమలుకు రెక్కీ

పరిస్థితులు అనుకూలించక వెనుకడుగు

తాజాగా వెలుగులోకి వచ్చిన కుట్ర కోణం

ఓ మాజీ అధికారి, మరో వైద్యుడి ప్రమేయంపై అనుమానాలు



హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై దాడికి భారీ కుట్ర జరిగిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఈ కుట్రకు సంబంధించి కూపీ లాగుతూ.. ప్రధాన నిందితులను గుర్తించే దిశలో చర్యలు తీసుకుంటున్నారు. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తుమ్మల నాగేశ్వరరావు బీఆర్‌ఎస్‌ను వీడి.. కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖమ్మం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన తుమ్మల.. బీఆర్‌ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌పై 50 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో విజయం సాధించిన విషయం తెలిసిందే..! అయితే.. ఎన్నికల సమయంలో తుమ్మలపై దాడికి ఓ మాజీ అధికారి, మరో వైద్యుడు కలిసి కుట్ర పన్నారని పోలీసులు గుర్తించారు. తొలుత నేలకొండపల్లిలోని సదరు వైద్యుడికి చెందిన మామిడి తోటలో తమ పథకానికి వ్యూహరచన చేసినట్లు సమాచారం. ఇందుకోసం స్థానికంగా తమకు అనుకూలంగా పనిచేస్తున్న

మిగతా 14వ పేజీలో...



ఎంపీ అభ్యర్థులు, పార్టీ ముఖ్యనేతలతో తెలంగాణ భవన్‌లో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న కేసీఆర్

టచ్‌లో 20 మంది

కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తెస్తానంటే ఇప్పుడే వద్దన్నా

ఎన్నికల తర్వాత రాజకీయాల్లో మార్పులు

బీజేపీ, కాంగ్రెస్ కొట్లాటతో రాజకీయ అనిశ్చితి

త్వరలో ఉద్యమకాలంనాటి కేసీఆర్‌ను చూస్తారు

ఢిల్లీ మద్యం కుంభకోణం ఉత్తదే.. కక్ష సాధింపు

బీఎల్ సంతోష్‌ను అరెస్టు చేయాలని ప్రయత్నించాం

దానికి మోదీ కక్షకట్టి కవితను అరెస్టు చేయించారు

పటిష్ఠ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్నే కూల్చాలని చూశారు

65 సీట్లతో ఉన్న కాంగ్రెస్ సర్కారును కూల్చరా?

బీజేపీలోకి రేవంత్ వెళ్లకపోవచ్చు.. ఒకవేళ వెళ్లినా ఆయన వెంట ఎమ్మెల్యేలు వెళ్లకపోవచ్చు: కేసీఆర్

అభ్యర్థులకు బీఫారాలు.. రూ.95 లక్షల చెక్కులు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో ఎటువంటి మార్పులైనా చోటుచేసుకోవచ్చని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కొట్లాటతో రాజకీయ అనిశ్చితి నెలకొంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారని అన్నారు. దీనిని తట్టుకొని రాష్ట్రం అస్థిరతకు లోను కాకుండా ఉండాలంటే బీఆర్‌ఎస్ బలంగా ఉండాలని ఆకాంక్షించారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కొందరు.. ఆ పార్టీ తీరు నచ్చక తిరిగి వస్తామని అడుగుతున్నారని, వారిని తిరిగి తీసుకునే ఆలోచన లేదని

మిగతా 2వ పేజీలో...

ప్రతిపక్షాలు జేబులో లేదా జైల్లో ఉండాలి

2

మోదీ తీరు ఇదే.. ఆయనదంతా విద్వేషమే.. మేం గెలవనున్న మొదటి స్థానం సికింద్రాబాద్

పద్మారావుకు భయపడి కిషన్‌రెడ్డి సీటు మారే యత్నం.. హామీలు నెరవేర్చలేకే సీఎం ఆరోపణలు

లంకె బిందెల కోసం తిరిగేది దొంగలే.. బీజేపీని ఎదుర్కొనే సత్తా బీఆర్‌ఎస్‌కే ఉంది: కేటీఆర్

తొలిరోజు జాతర!

మొత్తం 48 నామినేషన్లు దాఖలు చేసిన 42 మంది అభ్యర్థులు

బీజేపీ నుంచి ఈటల, రఘునందన్, డీకే అరుణ, భరత్ ప్రసాద్

కాంగ్రెస్ నుంచి మల్లు రవి, నీలం మధు, సురేష్ షెట్కార్

నామినేషన్ పత్రాలు, అఫిడవిట్ నింపేటప్పుడు జాగ్రత్త: సీఈవో



నామినేషన్ వేస్తున్న డీకే అరుణ

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికలకు తొలిరోజే నామినేషన్ల జాతర సాగింది. లోక్‌సభ ఎన్నికలకు గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవ్వగా తొలిరోజే మొత్తం 48 దాఖలయ్యాయి. ప్రధాన రాజకీయ పార్టీలతోపాటు వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు భారీ ర్యాలీలు, కోలాహలం మధ్య తమ నామినేషన్లను సమర్పించారు. బీజేపీ నుంచి మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్ ఒక సెట్ వేయగా, ఆయన భార్య జమున కూడా మరో సెట్ నామినేషన్‌ను ఎన్నికల అధికారికి అందించారు. ఈటల వెంట కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్ పురి, కిషన్ రెడ్డి

మిగతా 13వ పేజీలో...

తెలంగాణకు కేంద్రం ఇచ్చింది..

రీజనల్ రింగ్‌రోడ్ అభివృద్ధికి రూ.26 వేల కోట్లు

ఎంఎంటీఎస్ ఫేజ్-2 పనులకు రాష్ట్ర ప్రభుత్వం డబ్బులివ్వకుంటే కేంద్ర నిధులతో పూర్తిచేశాం

అభివృద్ధి పనులకు స్థలాలు కూడా ఇవ్వలేదు

కేంద్రమంత్రిగా నాకివ్వాల్సిన గౌరవం ఇవ్వలేదు

అప్పటి సీఎం కేసీఆర్ అనరాని మాటలన్నారు

రాష్ట్ర అభివృద్ధిపై నేను నిర్వహించే సమీక్షలకు ఉన్నతాధికారులు హాజరయ్యేవారు కాదు

కేసీఆర్‌కు 40 లేఖలు రాసినా స్పందించలేదు

గత ప్రభుత్వం నుంచి సహకారం లభించలేదు

'రిపోర్ట్ టు ద పీపుల్' ప్రజెంటేషన్‌లో కిషన్‌రెడ్డి

10 లక్షల కోట్లు!



ఈటల నివాసం వద్ద సభలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలపై 40 సార్లు లేఖలు రాసినా స్పందన లేదని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆశించిన సహకారం లభించలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర సర్కారు సహకారం లేకున్నా సికింద్రాబాద్ నియోజకవర్గానికి, తెలంగాణ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశానని ఆయన పేర్కొన్నారు. కేంద్ర మంత్రికి ఇచ్చే గౌరవం కూడా రాష్ట్ర ప్రభుత్వం తనకు ఇవ్వలేదని.. అభివృద్ధిపై తాను సమీక్షలు జరిపితే జీహెచ్ఎంసీ, కలెక్టరేట్ నుంచి ఉన్నతాధికారులు హాజరయ్యేవారు కారని వాపోయారు. వందల సంఖ్యలో వినతి పత్రాలిస్తే.. కనీసం వాటిని అందుకున్నామని కూడా తెలియజేయలేదని ధ్వజమెత్తారు. గురువారం హైదరాబాద్‌లోని

మిగతా 13వ పేజీలో...

ఫాదరే.. గాడ్‌ఫాదర్

నాన్న.. గెలిపిస్తాడా?

పార్లమెంటు ఎన్నికల బరిలో సీనియర్ రాజకీయ నేతల వారసులు

వరంగల్‌లో కడియం కావ్య గెలుపుకోసం కడియం శ్రీహరి ఆరాటం

పెద్దపల్లిలో గడ్డం వంశీ ఎన్నికల బాధ్యతల్లో.. ఎమ్మెల్యే వివేక్ బిజీబిజీ

నల్లగొండలో జానారెడ్డి బ్రాండ్‌తో బరిలో కుందూరు రఘువీర్ రెడ్డి

14

నాగర్‌కర్నూల్‌లో పోతుగంటి రాములు వారసుడిగా భరత్ ప్రసాద్

శిల్పాశెట్టి దంపతుల ఆస్తుల అటాచ్

బిట్‌కాయిన్స్ మోసం కేసులో ఈడీ చర్యలు

అటాచ్ అయిన ఆస్తుల విలువ రూ.98 కోట్లు

12

తొలి అంకం నేడే

దేశవ్యాప్తంగా 102 సీట్లలో పోలింగ్

12

సిక్కిం, అరుణాచల్‌లోని 92 అసెంబ్లీ స్థానాలకు సైతం

ఏడు దశల ఎన్నికలకు గాను ఈ విడతలోనే అత్యధిక సీట్లు

బరిలో 1,625మంది అభ్యర్థులు.. మహిళలు 134 మంది

1.87 లక్షల పోలింగ్ కేంద్రాలు, విధుల్లో 18 లక్షలమంది

బాధ్యతగా ఓటు వేయాలి: సీఈసీ రాజీవ్‌కుమార్

39 నియోజకవర్గాలు.. మూడు కూటములు

తమిళనాట 950 మంది అభ్యర్థులు.. 6.23 కోట్ల ఓటర్లు

డీఎంకే, బీజేపీ నేతృత్వ కూటముల మధ్యే హోరాహోరీ?

టార్గెట్ 100!.. లోక్‌సభలో బలం మూడంకెలకు చేరాలి

కాంగ్రెస్ సంకల్పం?.. కర్ణాటక, తెలంగాణల్లో ఎక్కువ సీట్లు

హిందీ బెల్టులో మరో 15-20 స్థానాలపై కన్ను

మిత్రులు 140 సీట్లు సాధిస్తే బీజేపీకి అత్తెసరు మెజార్టీయే!

2029 నాటికి ఓడించే చాన్స్.. ఏఐసీసీ పెద్దల అంచనా



ట్రాకర్ పెట్టి.. వెంటాడి.. కిడ్నాప్ చేసి

35 ఎకరాల రిజిస్ట్రేషన్

చితకబాది.. డాక్యుమెంట్లపై సంతకాలు

గాయాలతో వచ్చినా పట్టించుకోని తహసీల్దార్

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలో దారుణం

ఆరుగురు దుండగులకు బేడీలు

సహకరించిన ఏసీపీ చాంద్‌పాషా, తహసీల్దార్ వెంకటరంగారెడ్డి

2

కొట్టేసిన భూముల విలువ రూ.30 కోట్లు..!

కిడ్నాప్ స్కెచ్ వెనక.. గత సర్కారులో కీలక నేత



కోదాడలో జరిగిన నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల ప్రచార ప్రారంభ సభలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

ఆంధ్రప్రదేశ్ సీఎస్, డీజీపీ ఔట్!?

10

మరో ఆరుగురు ఐఏఎస్, ఐపీఎస్‌లూ.. రంగం సిద్ధం చేసిన ఈసీ

నేడో, రేపో బదిలీ ఉత్తర్వులు జారీ!?.. జగన్ సేవలో సీఎస్ జవహర్ రెడ్డి

షెడ్యూలు తర్వాతా మారని తీరు.. ఈసీ ఆదేశాలు బేఖాతరు

వెంకట్రామి రెడ్డి సస్పెన్షన్‌పై నాన్చుడు.. రాజేశ్వర్ రెడ్డిపై ఎనలేని ప్రేమ

నిష్పాక్షికంగా వ్యవహరించలేరని ఈసీ అంచనా

పేరుకే డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి.. జిల్లా ఎస్పీలపై ఆయనకు పట్టు నిల్

ప్రధాని సభలో భద్రతా వైఫల్యం.. ఎన్నికలు సరిగా జరపలేరనే అభిప్రాయం

మళ్లీ పట్టాలపైకి ఎస్ఎల్‌బీసీ

- నిధుల్లేక 19 నెలలుగా నిలిచిన పనులు
- ఇటీవలే రూ.50 కోట్లు విడుదల
- వచ్చే నెల నుంచి టన్నెల్ తవ్వకాలు


హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ ప్రాజెక్టు పనులను వచ్చే నెల నుంచి పట్టాల మీదికి ఎక్కించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఔట్‌లెట్ వైపు ఉన్న టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)లో బేరింగులు పాడైపోవడంతో వాటి మరమ్మతులతోపాటు ఇన్‌లెట్ వైపు తవ్వకాల పనులకు రూ.50 కోట్లు విడుదల చేయాలని నిర్మాణ సంస్థ కోరిన మేరకు ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ఈ నేపథ్యంలోనే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. 19 నెలలుగా బిల్లులు పెండింగులో ఉండటంతో ఎస్ఎల్‌బీసీ పనులు నిలిచిపోయాయి. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టులపై సమీక్ష జరిపి, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులకు ప్రాధాన్యత ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు పనులకు అవరోధాలు ఏమున్నాయో గుర్తించి, వాటి పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులతో కమిటీని నియమించారు. ఆ కమిటీ సమీక్ష జరిపి ప్రాజెక్టు నిర్మాణ వ్యయం అంచనాలను రూ.3,150 కోట్ల నుంచి రూ.4,468 కోట్లకు పెంచాలని, ఇన్‌లెట్ నుంచి లీకేజీలు, ఔట్‌లెట్ వైపు గట్టి రాయి ఉండటంతో.. దీనిపై భూగర్భ శాస్త్రవేత్తల సహకారం తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. ఔట్‌లెట్ వైపు ఉన్న టీబీఎం బేరింగుల కోసం తొలుత రూ.50 కోట్లను విడుదల చేస్తే.. అక్టోబరు కల్లా మరమ్మతులు పూర్తిచేసుకొని, టీబీఎం సిద్ధమవుతుందని పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వం రూ.50 కోట్లను ఇటీవల విడుదల చేయటంతో ఔట్‌లెట్ టీబీఎంకు మరమ్మతులతోపాటు ఇన్‌లెట్ (శ్రీశైలం) వైపు తవ్వకాలు జరపటానికి మార్గం సుగమమైంది. కాగా, అక్టోబరు నుంచి ఇన్‌లెట్ (శ్రీశైలం), ఔట్‌లెట్ (మన్నెవారిపల్లి-అచ్చంపేట) వైపుల నుంచి ఏకకాలంలో టన్నెల్‌ను తవ్వే ప్రక్రియను చేపడతామని నిర్మాణ సంస్థ ప్రభుత్వానికి హామీ ఇచ్చింది.



ఇక రెండువైపులా డీ వాటరింగ్‌తో పాటు ఇతరత్రా అవసరాల కోసం వినియోగించుకున్న కరెంటుకు నిర్మాణ సంస్థ దక్షిణ డిస్కమ్ (టీఎస్ ఎస్పీడీసీఎల్)కు రూ.63.50 కోట్ల బకాయి ఉందని గుర్తించారు. కరెంట్ బిల్లుల కోసం అవసరమైన నిధులను కూడా త్వరలో విడుదల చేయడానికి ప్రభుత్వం అంగీకారం తెలిపింది. సవరించిన ప్రాజెక్టు అంచనా వ్యయానికి కూడా ఆమోదం తెలిపే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను సొరంగం ద్వారా తరలించడానికి వీలుగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టును రూ.2,298 కోట్ల అంచనా వ్యయంతో 2005లో చేపట్టారు. అనంతరకాలంలో అంచనా వ్యయం మారుతూ వచ్చింది. ప్రాజెక్టులో భాగంగా మొత్తం 43.93 కి.మీ. టన్నెల్ తవ్వాల్సి ఉంది. ఇప్పటిదాకా 34.37 కి.మీ.ల మేర పూర్తయింది. మిగిలిన 9.56 కి.మీ.లు తవ్వితే గ్రావిటీతో నీటిని ఉమ్మడి నల్గొండ జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీటిని, 516 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీటిని అందించటానికి వీలవుతుంది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	45.2	25.6
రంగారెడ్డి	42.8	23.7
ఆదిలాబాద్	42.8	29.2
రామగుండం	42.4	26.4
నిజామాబాద్	42.2	27.9
ఖమ్మం	42.0	28.0
వరంగల్	41.0	26.5
హైదరాబాద్	40.0	27.0
సంగారెడ్డి	39.0	28.0

టచ్‌లో 20 మంది

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. "అధికారం ఉందని కాంగ్రెస్‌లోకి వెళ్తే అక్కడంతా బీజేపీ కథ నడుస్తోందని ఓ నాయకుడు నాతో వాపోయారు. 20 మంది ఎమ్మెల్యేలను తీసుకొని రావాలా సార్... అని ఓ సీనియర్ కీలక నేత నన్ను సంప్రదించారు. ఇప్పుడే వద్దని వారించాను" అని వెల్లడించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు, పార్టీ ముఖ్య నేతలతో గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అభ్యర్థులకు బీఫారాలు ఇవ్వడంతోపాటు ఒక్కో అభ్యర్థికి రూ.95 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. గట్టిగా పోరాడితే లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయి. రాష్ట్రంలో భవిష్యత్ బీఆర్ఎస్‌దే. త్వరలో ఉద్యమ కాలం నాటి కేసీఆర్‌ను రాష్ట్ర ప్రజలు చూస్తారు" అని అన్నారు. ఇప్పటి వరకు 8 లోక్‌సభ సీట్లలో గెలుస్తామని సర్వేలు చెబుతున్నాయని, మరో మూడు స్థానాల్లోనూ విజయావకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

మోదీ దుర్మార్గుడు

"ఢిల్లీ లిక్కర్ స్కామ్ అంతా ఉత్తదే. అందులో ఏమీ లేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చీల్చడానికి ప్రయత్నించిన బీఎల్ సంతోష్‌ను అరెస్ట్ చేయడానికి ప్రయత్నించడంతో మోదీ మనపై కక్ష కట్టారు. అందుకే అక్రమంగా లిక్కర్ కేసులో ఇరికించి కవితను అరెస్ట్ చేయించారు. ఇది కక్షసాధింపు చర్యే" అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కవిత అరెస్టుపై ఆయన స్పందించడం లేదంటూ రాజకీయ వర్గాల్లో దుమారం రేగుతున్న నేపథ్యంలో ఎట్టకేలకు కేసీఆర్ స్పందించారు. మోదీ దుర్మార్గుడని, విపక్ష నేతలపై కక్ష గట్టి అక్రమ కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. "ఎంఐఎంతో కలుపుకొని 111 సీట్లతో పటిష్ఠంగా ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నాలు బీజేపీ చేసింది. అలాంటిది 65 మందితో అత్తెసరు మెజార్టీతో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చకుండా వదులుతుందా? కాంగ్రెస్ ముక్త భారత్ నినాదంతో ముందుకెళుతున్న మోదీ కాంగ్రెస్ ప్రభుత్వాలను ఖతం చేస్తున్నారు. ఏవో కుయుక్తులు పన్ని ఇక్కడి సర్కారును కూలదోయకుండా ఉంటారా? అన్న అనుమానం సర్వత్రా వ్యాపిస్తోంది. బీజేపీతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముప్పు ఉంటుంది" అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి బీజేపీలోకి వెళ్లకపోవచ్చునని, ఒకవేళ వెళ్లినా.. ఆయన వెంట కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెళ్లే పరిస్థితి లేదని అన్నారు. అయినా.. బీజేపీ వదిలిపెట్టదని, ఎమ్మెల్యేలను చీల్చి.. ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం చేస్తుందని ఆయన జోస్యం చెప్పారు.


తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న కేసీఆర్

22 నుంచి బస్సు యాత్ర

రాష్ట్రవ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రజలను కలుసుకునేలా బస్సు యాత్ర చేస్తానని కేసీఆర్ చెప్పారు. ప్రచారంతోపాటు పంట నష్టపోయి అవస్థ పడుతున్న రైతన్నలను ఓదార్చేందుకు ఈనెల 22 నుంచి బస్సు యాత్ర చేపడతానని వెల్లడించారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని రెండు, మూడు అసెంబ్లీ ఏరియాల్లో రోడ్ షోలు ఉంటాయన్నారు. రోజుకు రెండు, మూడు రోడ్ షోలు ఉంటాయని, ఉదయం పంట పొలాలను పరిశీలించి.. రైతుల సమస్యలు తెలుసుకుని, సాయంత్రం రోడ్డు షోలు, కార్నర్ మీటింగ్‌లు చేపడతామని వివరించారు. వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లలో భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నామని చెప్పారు. మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోతే మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టే కూలిపోయిందని అబద్ధాలు, కట్టుకథలతో ప్రజలను ఇన్నాళ్లు మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కాఫర్ డ్యామ్ కట్టాలని నిర్ణయించటం బీఆర్ఎస్ సాధించిన విజయమన్నారు. కొందరు నేతలు పార్టీని వీడినంత మాత్రాన బీఆర్ఎస్‌కు నష్టం ఏమీ లేదని, భవిష్యత్‌లో బుల్లెట్లలాంటి యువ నాయకులను తీర్చిదిద్ది.. ఎమ్మెల్యేలుగా తీసుకొస్తామని అన్నారు. మళ్లీ వస్తామంటూ కడియం, దానం కాళ్లు పట్టుకున్నా తీసుకోబోమన్నారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ పెరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకునే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. రైతు సమస్యలపై బీఆర్ఎస్ చేపట్టిన పోస్టు కార్డు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని, ఒక్కో పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో లక్ష పోస్టుకార్డులు రాయాలని సూచించారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై నాలుగు నెలలకే విసిగి వేసారిపోయారని అన్నారు.

బీఆర్ఎస్ లీగల్ సెల్ ఖాతాకు 10 కోట్లు

రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం భయభ్రాంతులకు గురి చేస్తోందని, ఇటువంటి సంఘటనలను తిప్పి కొడదామని కేసీఆర్ అన్నారు. కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్‌పై పోరాడేందుకు లీగల్ సెల్‌ను పటిష్ఠం చేశామని, ఎంత ఖర్చుకైనా వెనకాడకుండా కార్యకర్తలకు కాపాడుకుంటామని, ఇందుకు గాను బీఆర్ఎస్ లీగల్ సెల్ అకౌంట్‌కు రూ.10 కోట్లు కేటాయించామని వెల్లడించారు. సమావేశంలో 17 మంది ఎంపీ అభ్యర్థులతోపాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, పార్టీ ముఖ్యులు పాల్గొన్నారు.

నదీజలాల మళ్లింపునకు బీజేపీ కుట్ర

తెలంగాణకు దక్కాల్సిన గోదావరి నది జలాలను ఇతర రాష్ట్రాలకు మళ్లించాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, బచావత్ ట్రైబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా ఇచ్చంపల్లి వద్ద ప్రాజెక్ట్ కట్టి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు నీళ్లు మళ్లించే ప్రయత్నం చేస్తోందని కేసీఆర్ ఆరోపించారు. ఎగువ రాష్ట్రాలకు కేటాయించిన నీళ్లు పోగా మిగిలిన నీరంతా దిగువ రాష్ట్రమైన తెలంగాణకు దక్కాలని బచావత్ ట్రైబ్యునల్ తీర్పులో స్పష్టం చేసిందని గుర్తు చేశారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఇది అసమర్థత కాదా? అని నిలదీశారు. బీజేపీని నిలదీయటానికి వంద కారణాలున్నాయని, తెలంగాణకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వాటన్నింటినీ ప్రజలకు వివరించేందుకు సోషల్ మీడియాను వినియోగించుకొని, ఆ పార్టీకి ఎందుకు ఓటు వేయాలన్న ప్రశ్నను లేవనెత్తాలన్నారు.

ఎక్సైజ్ బదిలీల్లో అక్రమాలపై మంత్రి జూపల్లి సీరియస్

- బదిలీల వివరాలు పంపాలని కమిషనర్‌కు ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో బదిలీల్లో జరిగిన అక్రమాలపై ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సీరియస్ అయ్యారు. బదిలీల సందర్భంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను ఎందుకు పాటించలేదని ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్‌ను ఆరా తీశారు. ఎందరు బదిలీ అయ్యారు, ఒక పార్లమెంటు నియోజకవర్గంలో మూడేళ్లకుపైగా పని చేస్తున్న ఎక్సైజ్ అధికారులను ఎందుకు బదిలీ చేయలేదని ప్రశ్నించారు. బదిలీలకు ఎందరు అర్హులు, ఎందరిని బదిలీ చేశారో- పూర్తి వివరాలు పంపాలని ఆదేశించారు. ఎక్సైజ్ బదిలీల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను పాటించలేదని 'ఫోరం ఫర్ డెమోక్రటిక్ తెలంగాణ' రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించిన వార్త గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దీంతో స్పందించిన మంత్రి జూపల్లి... కమిషనర్ నుంచి వివరాలు కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన బదిలీల వివరాలనూ పంపాలని చెప్పారు. ఎక్సైజ్ శాఖలో ఎలాంటి తప్పిదాలు జరగొద్దని, పొరపాటు చేస్తే ఎంతటివారైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మేడిగడ్డ దిగువభాగంలోనూ పరీక్షలు

- అన్ని బ్లాకుల్లో ఈఆర్‌టీ, జీపీఆర్ పరీక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు గల కారణాలను అన్వేషించడానికి వీలుగా బ్యారేజీ దిగువ భాగంలోనూ సాంకేతిక పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. బ్యారేజీల్లోని అన్ని బ్లాకుల్లో సాంకేతిక పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించిన విషయం విదితమే. 8 బ్లాకుల్లో ఈ బ్యారేజీ నిర్మించగా 6, 7 బ్లాకుల్లోని ఎగువ భాగంలో ఇప్పటికే ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్(ఈఆర్‌టీ), గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ టెక్నికల్(జీపీఆర్) టెస్టులు నిర్వహించి నివేదికలు జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీకి అందించారు. తాజాగా దిగువ భాగంతో పాటు ఇతర బ్లాకుల్లోని ఎగువ, దిగువ భాగాల్లోనూ ఈఆర్‌టీ, జీపీఆర్ పరీక్షలు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. రానున్న పది రోజుల్లో పరీక్షలు పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

పదేళ్లలో 11.48 కిమీల సొరంగం తవ్వాం

- ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు వివరణ

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్టును బీఆర్ఎస్ హయాంలో ప్రాధాన్యం లేని జాబితాలో చేర్చలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. తమ పార్టీ అధికారంలో ఉన్న గత పదేళ్లలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్(సొరంగం)ను 11.48 కిలోమీటర్ల మేర తవ్వడం జరిగిందని వివరణ ఇస్తూ గురువారం ఓ ప్రకటన చేశారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు కోసం 43.93 కిమీల మేర టన్నెల్ తవ్వాల్సి ఉండగా 2014 దాకా 22.89 కిమీలు మాత్రమే తవ్వారని హరీశ్ తెలిపారు. టన్నెల్ నిర్మాణంలో ఆధునిక పద్ధతులు ఉన్నప్పటికీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పాత పద్ధతిని ఎంచుకోవడం వల్లే సకాలంలో పనులు పూర్తి కాలేదని పేర్కొన్నారు. టన్నెల్ బోరింగ్ మిషన్ మరమ్మతులకు గురయ్యేదని, ఇందుకోసం విదేశాల నుంచి నిపుణులను తెప్పించాల్సిన పరిస్థితి ఉండేదని వివరించారు. అంతేకాక, శ్రీశైలంలో నిల్వలు పెరిగినప్పుడు ఈ టన్నెల్‌లోకి నీరు వచ్చి చేరుతుందని, ఆ నీటిని డీవాటరింగ్ చేసే క్రమంలో తవ్వకంలో జాప్యం జరిగిందని వివరించారు. నెలకు 300మీటర్లు కూడా తవ్వలేరనే విషయం తేటతెల్లమయిందని, నెలకు 200మీటర్లు తవ్వినా ఏడాదికి రెండున్నర కిలోమీటర్లు మాత్రమే తవ్వగలరని తెలిపారు.

తెలంగాణకు 8.6 టీఎంసీలు: కేఆర్ఎంబీ

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్‌లో నీటి మట్టం 500 అడుగులకు చేరేదాకా నీటిని తీసుకోవడానికి తెలుగు రాష్ట్రాలకు కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) అనుమతినిచ్చింది. ఈ నెల 12న బోర్డుకు చెందిన త్రిసభ్య కమిటీ(బోర్డు మెంబర్ కన్వీనర్ డీఎం రాయిపురే, తెలంగాణ ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్, ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి) సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. సాగర్‌లో ప్రస్తుతం 508 అడుగుల మేర నీటి మట్టం ఉంది. అక్కడి నుంచి 500 అడుగుల దాకా సుమారు 14.19 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని బోర్డు అంచనా వేసింది. అందులో నుంచి 5.5 టీఎంసీలు ఏపీ.. 8.6 టీఎంసీల నీటిని తెలంగాణ తీసుకెళ్లడానికి వీలు కల్పిస్తూ గురువారం ఉత్తర్వు ఇచ్చింది. వేసవిలో హైదరాబాద్‌తో పాటు దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో తాగునీటి అవసరాల కోసం తెలంగాణకు అధికంగా నీటిని కేటాయించారు. నీటి కేటాయింపులకు అనుగుణంగా సంబంధిత రాష్ట్రాల చీఫ్ ఇంజనీర్లు ఆ మేరకు నీటిని తీసుకెళ్లాలా..? లేదా..? అనే దానిపై సంయుక్త ప్రకటన విడుదల చేయాలని బోర్డు కోరింది.

అక్రమ కట్టడాల కూల్చివేతకు స్పెషల్ డ్రైవ్ పెట్టండి

- సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన చాడ వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలోని నాలాలు, చెరువుల మీద అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేసేందుకు స్పెషల్ డ్రైవ్ పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతూ సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి గురువారం లేఖ రాశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బడా రాజకీయ నాయకులు వేలాది చెరువులను, కాలువలను ఆక్రమించి విల్లాలు, అపార్ట్‌మెంట్లు నిర్మించారని పేర్కొన్నారు. ఈ నిర్మాణాల వల్ల మురుగు నీరు కాలనీల్లోకి వస్తుందని, ఇందుకు 2020లో వచ్చిన వరదలే నిదర్శనం అని గుర్తు చేశారు.

30 వరకు వివేకా హత్య ఊసెత్తవద్దు

- షర్మిల, సునీత, బాబు, లోకేశ్‌కు కడప కోర్టు ఆదేశం

కడప(రూరల్), ఏప్రిల్ 18: సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై ఈ నెల 30వ తేదీ వరకు బహిరంగంగా ప్రస్తావించరాదని రాష్ట్రంలోని ప్రతిపక్షాల నేతలను కడప జిల్లా కోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణ నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉండగా.. వివేకాను కడప ఎంపీ, వైసీపీ లోక్‌సభ అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డి చంపారంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, డాక్టర్ సునీత, టీడీపీ అధినేత చంద్రబాబు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఎం.రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) ఆరోపణలు చేస్తున్నారని.. వారి ప్రస్తావన లేకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వైసీపీ కడప జిల్లా అధ్యక్షుడు కొత్తమద్ది సురేశ్ బాబు 15వ తేదీన కోర్టులో పిటిషన్ (367/2024) దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కడప జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.శ్రీదేవి ఈ నెల 16న పైఉత్తర్వులు జారీచేశారు. వివేకా హత్య కేసులో సీఎం జగన్మోహన్ రెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డిపై ఈ నెల 30 వరకు ఎలాంటి ఆరోపణలు చేయవద్దని.. వారే గాక వారి పార్టీల శ్రేణులను, అభ్యర్థులను కూడా నియంత్రించాలని నిర్దేశించారు. వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో ఉన్న వివరాలను కూడా తొలగించాలని ఆదేశించారు. తదుపరి విచారణను 30వ తేదీకి వాయిదావేశారు.

ఆ 106 ఎకరాలు అటవీ శాఖవే

- భూపాలపల్లి జిల్లా కొంపల్లి భూ వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు
- 39 ఏళ్లుగా కొనసాగుతున్న కేసుకు ముగింపు

న్యూఢిల్లీ, హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దాదాపు నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న భూవివాదానికి సుప్రీంకోర్టు ముగింపు పలికింది. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కొంపల్లి గ్రామ శివారులో సర్వే నంబర్ 171లో ఉన్న 106.34 ఎకరాల భూమి రాష్ట్ర అటవీశాఖకే చెందుతుందని తీర్పు చెప్పింది. సదరు భూమి తనదేనని 1985లో వరంగల్ జిల్లా కోర్టులో మహ్మద్ అబ్దుల్ ఖాసిం పిటిషన్ దాఖలు చేశారు. 1994లో జిల్లా కోర్టు దానిని కొట్టివేసింది. అదే ఏడాది ఖాసిం హైకోర్టును ఆశ్రయించారు. 2018లో హైకోర్టు కూడా ఆ భూమి అటవీ శాఖ దేనని తీర్పు వెలువరించింది. హైకోర్టులో ఖాసిం రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. 2021 మార్చిలో హైకోర్టు తీర్పు ఇస్తూ- భూమి ఖాసింకే చెందుతుందని పేర్కొంది. దీనిని అటవీశాఖ మే 2021లో సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ ఎస్ వీఎన్ భట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. గురువారం జస్టిస్ ఎంఎం సుందరేష్ తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.

విపక్షాలు జేబులో.. లేదా జైల్లో ఉండాలి

ప్రధాని మోదీ తీరు ఇదే.. ఆయనదంతా విద్వేషం.. మేం గెలవనున్న మొదటి స్థానం సికింద్రాబాద్

- పద్మారావుకు భయపడి కిషన్‌రెడ్డి సీటు మారే యత్నం: కేటీఆర్

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): "దేశంలో విపక్షాలు ఉంటే నా జేబులో ఉండాలి లేదంటే జైలులో ఉండాలి అన్నట్లు ప్రధాని మోదీ తీరు ఉంది. గతంలో పండుగలకు నేతలు ఒకరి దగ్గరకు ఒకరు వెళ్లి శుభాకాంక్షలు తెలుపుకొనేవారు. మోదీ వచ్చాక విద్వేషాలు రెచ్చగొట్టి ఆ పరిస్థితి లేకుండా చేశారు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణకు రూపాయి ఇవ్వని బీజేపీని అణగదొక్కాలని పిలుపునిచ్చారు. వంద రోజుల్లో హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. అది చేతకాక స్కామ్‌లంటూ మాయమాటలు చెబుతున్నారని, ఫోన్ ట్యాపింగ్ పేరుతో రోజుకో లీక్ ఇచ్చి కాలం గడుపుతున్నారని ఆరోపించారు. ఆయన రాహుల్‌గాంధీ కోసం పనిచేస్తున్నారా? మోదీ కోసమా? అని ప్రశ్నించారు. "బీజేపీని ఓడించే శక్తి కాంగ్రెస్‌కు లేదు. అది బీఆర్ఎస్‌తోనే సాధ్యం. కేసీఆర్ కాళేశ్వరం లిఫ్ట్‌లను ప్రారంభిస్తే కిషన్‌రెడ్డి రైల్వే స్టేషన్ లిఫ్ట్ ప్రారంభించారు. తెలంగాణకు ఏం చేశారని అడిగితే.. చెప్పడానికి ఏమీ లేక జైశ్రీరాం అంటున్నారు" అని కేటీఆర్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తాము గెలవబోయే తొలి సీటు సికింద్రాబాద్ అని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ యూసుఫ్‌గూడలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ బూత్‌స్థాయి సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కేంద్ర మంత్రిగా ఐదేళ్లలో రాష్ట్రానికి రూపాయి కూడా తీసుకురాని కిషన్ రెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు భయపడి, వేరేచోట నుంచి పోటీ చేయాలని చూస్తున్నట్లు తెలిసిందన్నారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయని రేవంత్, అంబేడ్కర్ పేరుతో కేసీఆర్ నిర్మించిన సచివాలయంలో సిగ్గులేకుండా కూర్చున్నారని ధ్వజమెత్తారు. లంకె బిందెలు ఉన్నాయనుకున్నానని అన్నారని.. వాటి కోసం తిరిగేది దొంగలు కదా? అని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ వాళ్లు.. కల్యాణ లక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం ఇస్తామన్నారని, ప్రచారానికి వస్తే తులం బంగారం ఏదీ అని అడగాలని సూచించారు. దానం నాగేందర్ సీటు పోవడం ఖాయమని, ఉప ఎన్నిక ఖాయమని పేర్కొన్నారు.



జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

కిడ్నాప్ చేసి 35 ఎకరాల రిజిస్ట్రేషన్

- చితకబాది.. డాక్యుమెంట్లపై సంతకాలు
- రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలో దారుణం
- ఆ భూముల విలువ రూ.30 కోట్లు..!
- కిడ్నాప్ వెనక.. గత సర్కారులో కీలక నేత

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/శంకరపల్లి/ఆమన్‌గల్లు): గత ప్రభుత్వ హయాంలో కొందరు పోలీసులు గూండాలుగా వ్యవహరించిన ఉదంతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు.. ఓ హెల్త్‌కేర్ సంస్థ యజమాని నుంచి బలవంతంగా ఇతరుల పేరిట షేర్లను మార్పిడీ చేయించగా.. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలో ఓ ఏసీపీ, తహసీల్దార్ కిడ్నాపర్లకు సహకరించారు. ఓ వ్యక్తి నుంచి 35 ఎకరాల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారు. ప్రభుత్వం మారడంతో ధైర్యం తెచ్చుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. ఆరుగురు నిందితులకు బేడీలు వేయగా.. ఓ ఏసీపీ, తహసీల్దార్ అరెస్టుకు రంగం సిద్ధం చేశారు. ఈ తతంగం వెనక గత ప్రభుత్వంలోని కీలక నేత హస్తమున్నట్లు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంలోని చిల్కూరు గ్రామానికి చెందిన శ్రీనివాస రాజు.. 2003-14 మధ్య రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామంలోని సర్వే నంబర్లు 96, 104, 105, 106, 279, 281లో 70 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఎకరా రూ.80 లక్షల నుంచి రూ.కోటి ఉంది. దీంతో.. శ్రీనివాస్‌రాజుతో కలిసి వ్యాపారం చేసిన సూర్యనారాయణరాజు కన్ను ఆ భూములపై పడింది. వాటిని కొట్టేసేందుకు గత ప్రభుత్వంలో ఓ ముఖ్య నేత సహకారంతో శ్రీనివాస్‌రాజు కిడ్నాప్‌నకు కుట్రపన్నారు.



ఏసీపీ సహకారం.. ట్రాకర్ ఏర్పాటు

శ్రీనివాస్‌రాజును కిడ్నాప్ చేసి, డాక్యుమెంట్లపై సంతకాలు చేయించుకోవాలని సూర్యనారాయణరాజు కుట్రపన్నారు. రెక్కీలు వేశారు. శ్రీనివాస్‌రాజు సెల్‌ఫోన్ ఆధారంగా.. కదలికలను ట్రాక్ చేసేందుకు హైదరాబాద్ సీసీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏసీపీ చాంద్‌పాషా సహకారం తీసుకున్నారు. అయితే, సూర్యనారాయణ గ్యాంగ్ ఆ లోకేషన్‌కు చేరుకునేలోపు.. శ్రీనివాస్‌రాజు వెళ్లిపోయేవారు. ఏసీపీ సూచన మేరకు సూర్యనారాయణరాజు ఓ ట్రాకర్‌ను తెప్పించారు. దాన్ని శ్రీనివాస్‌రాజు కారుకు అమర్చారు. నవంబరు 15న శ్రీనివాస్‌రాజు కారు(టీఎస్10-ఎఫ్‌సీ6688)లో శంకర్‌పల్లి మండలం కొండకల్‌లో ఉన్న స్కూల్‌లో కుమారుడిని దింపి వస్తూ.. తండా సమీపంలో ఆగారు. ఫోన్‌లో తన భార్య సుశీలతో మాట్లాడుతుండగా.. సూర్యనారాయణరాజుకు చెందిన వ్యక్తులు కిడ్నాప్ చేసి.. తర్వాతి రోజు వరకు నిర్బంధించి, తీవ్రంగా గాయపరిచారు. నవంబరు 16న శ్రీనివాస్‌రాజుకు చెందిన 70 ఎకరాల్లో 35 ఎకరాలకు సంబంధించిన సేల్‌డీడ్‌లను రూపొందించారు. భర్త ఫోన్ స్విచ్ఛాఫ్ అవ్వడంతో సుశీల అనుమానంతో తనకు వరుసకు అన్నయ్య అయ్యే సుబ్బరాజుకు సమాచారం అందించారు. ఆయన డయల్-100కు ఫోన్ చేసి, ఆ తర్వాత మోకిల ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేశారు.

రిజిస్ట్రేషన్‌లో తహసీల్దార్ సహకారం..

కిడ్నాపర్లు గాయాలతో ఉన్న శ్రీనివాస్‌రాజును భూముల రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి నవంబరు 16న తలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఆ సమయంలో తహసీల్దార్ కట్టా వెంకటరంగారెడ్డి ఎన్నికల విధుల్లో భాగంగా కల్వకుర్తిలో ఉన్నారు. ఆ రోజున రిజిస్ట్రేషన్ కోసం 12 స్లాట్లు మాత్రమే బుక్ అయ్యాయి. సూర్యనారాయణరాజు పనికోసం ఆగమేఘాల మీద కార్యాలయానికి వచ్చిన తహసీల్దార్.. ఆ ఒక్క రిజిస్ట్రేషన్‌ను పూర్తిచేసి వెళ్లిపోయారు. రిజిస్ట్రేషన్ సమయంలో భూముల పాస్ పుస్తకం, విక్రేత పాన్, ఆధార్ కార్డులు తప్పనిసరిగా సమర్పించాలి. అవేమీ లేకుండానే శ్రీనివాస్‌రాజు భూమిని సూర్యనారాయణ రాజు, అతని అనుచరుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించడం గమనార్హం. శ్రీనివాస్‌రాజు గాయాలతో ఉన్నా.. ఏం జరిగిందనేది ప్రశ్నించకుండా, మిగతా నిందితులు సంతకాలు పెట్టాలని బలవంతపెడుతున్నా.. తహసీల్దార్ వెంకటరంగారెడ్డి తన పనికానిచ్చారు. దీనిపై తహసీల్దార్‌కు సూర్యనారాయణరాజు నుంచి రూ.10 లక్షలు ముట్టాయనే ఆరోపణలున్నాయి.

కీలక నేత.. దర్యాప్తు నిల్..!

ఈ కిడ్నాప్ పర్వం వెనక గత ప్రభుత్వానికి చెందిన ఓ కీలక నేత ఉండడంతో.. మోకిల పోలీసులు ఫిర్యాదుపై పెద్దగా స్పందించలేదనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వం మారడం.. గతంలో జరిగిన అక్రమాలను పోలీసులు సీరియస్‌గా తీసుకుంటుండడంతో శ్రీనివాస్‌రాజు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో మోకిల పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సూర్యనారాయణరాజు, రుద్రరాజు బలరామరాజు, తూమటి ఉపేందర్‌రెడ్డి, హరికృష్ణ కుమార్, నీలం లక్ష్మీనారాయణ, గోపిలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో నలుగురు సూర్యాపేటకు చెందిన వారు. ఎఫ్ఐఆర్‌లో ఏసీపీ చాంద్‌పాషాను ఏ1గా పేర్కొన్నారు ఏసీపీ హైకోర్టును ఆశ్రయించి, ముందస్తు బెయిల్ తెచ్చుకున్నట్లు తెలిసింది. ఆయన పరారీలో ఉన్నట్లు మోకిల పోలీసులు చెబుతున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన తహసీల్దార్ కట్టా వెంకటరంగారెడ్డిని విచారించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఆయనకు సీఆర్పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు అందజేశారు. త్వరలో తహసీల్దార్‌ను అరెస్టు చేయనున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ కీలక నేతను కూడా విచారించే అవకాశాలున్నాయి. రిమాండ్‌లో ఉన్న నిందితులను కస్టడీలోకి తీసుకుని, విచారిస్తే.. మరికొన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయని పోలీసులు భావిస్తున్నారు. కాగా.. తాను స్లాట్ బుకింగ్ మేరకే రిజిస్ట్రేషన్ చేశానని, కిడ్నాప్ విషయంలో తనకేమీ తెలియదని తహసీల్దార్ పేర్కొన్నారు.

రూ. 30 వేలిస్తే చోరీ మాఫీ!

» సీసీ కెమెరాలలో చోరీని గుర్తించి.. నిందితుల నుంచి లంచం డిమాండ్

» ఏసీబీకి చిక్కిన భద్రాచలం ఎస్ఐ, కానిస్టేబుల్



పట్టుబడ్డ భద్రాచలం ఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ శంకర్, సీసీ టెక్నీషియన్ నవీన్, పాల్వంచ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ వెంకటరమణి, ఉద్యోగి ప్రసన్న కుమార్

భద్రాచలం/పాల్వంచ, ఏప్రిల్ 18: ఓ చోరీ కేసులో నిందితుల నుంచి లంచం తీసుకుంటూ ఎస్ఐ, కానిస్టేబుల్, సీసీటెక్నీషియన్, మరో ఘటనలో ఎల్ఆర్ఎస్ కోసం లంచం తీసుకుంటూ టౌన్‌ప్లానింగ్ సూపర్ వైజర్ ఏసీబీకి పట్టుబడ్డారు. భద్రాచలంలో ఈనెల 12న పాత మార్కెట్ గోడౌన్‌లో మర్రి సాయితేజ, మరో ఇద్దరు విత్రులతో కలిసి నాలుగు చెక్కర బ్యాగులను దొంగతనం చేశాడు. స్టేషన్‌లో డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ శంకర్ గోడౌన్‌లోని సీసీ కెమెరాల్లో గమనించి ఎస్ఐ శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని చెక్కర బ్యాగులు, వారి ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం కానిస్టేబుల్ శంకర్ ముగ్గురు నిందితులను తలా రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాయితేజ ఈ విషయంపై ఖమ్మంలోని ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఈనెల 15న లంచం నగదు రూ.20 వేలకు తగ్గించాలని సాయితేజ పోలీసులను కోరగా, వారు అందుకు తిరస్కరించారు. దీంతో పథకం ప్రకారం సాయితేజ గురువారం రూ.20 వేలు కానిస్టేబుల్ శంకర్‌కు ఇచ్చాడు. వెంటనే ఆయన ఎస్ఐ శ్రీనివాస్‌కు ఫోన్ చేసి చెప్పగా.. సాయంత్రానికి మరో రూ.5 వేలు కచ్చితంగా ఇవ్వాలంటూ ఎస్ఐ వారిని ఆదేశించారు. అనంతరం కానిస్టేబుల్ వారికి ఆటోను అప్పగించి, సెల్‌ఫోన్లను కూడా ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ శంకరశెట్టి శంకర్, సీసీ కెమెరా టెక్నీషియన్ కర్నాటి నవీన్‌లను అరెస్టు చేశారు.

పట్టుబడ్డ పాల్వంచ టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్

భద్రాద్రి జిల్లాలోని పాల్వంచ పాల్వంచకు చెందిన కాంపెల్లి కనకేష్.. సర్వే నెంబర్ 817/41లోని తన 3 ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ కోసం మార్చిలో దరఖాస్తు చేసుకున్నాడు. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ లక్కిరెడ్డి వెంకటరమణి రూ.30 వేలు లంచం ఇవ్వాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రసన్నకుమార్ ద్వారా డిమాండ్ చేశారు. దీంతో కనకేష్ ఆమెతో బేరమాడి రూ.15 వేలు ఇవ్వడానికి ఒప్పందం చేసుకుని ఏసీబీని ఆశ్రయించాడు. గురువారం రూ.15 వేలు ఇస్తుండగా వెంకటరమణి, ప్రసన్నకుమార్‌లను ఏసీబీ అధికారులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

డిప్యూటీ తహసీల్దార్ అసభ్య చేష్టలు

» కొన్నాళ్లుగా వివాహితకు దురుద్దేశంతో కూడిన సైగలు

» చేయి పట్టుకున్న వైనం.. ప్రశ్నించిన భర్తపై దాడి

» సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ఘటన.. కేసు నమోదు

నారాయణఖేడ్, ఏప్రిల్ 18: తాను అద్దెకు ఉంటున్న భవనంలోని మరో పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న వివాహిత పట్ల ఓ ప్రభుత్వ అధికారి కొన్నాళ్లుగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. అతడిని ఆమె గట్టిగా హెచ్చరించినా బుద్ధి మార్చుకోకపోగా మరింత రెచ్చిపోయి అసభ్యకరంగా సైగలు చేశాడు. విషయాన్ని బాధితురాలు తన భర్తకు చెప్పడంతో వెళ్లి ప్రశ్నించగా ఆయనపై దాడి చేశాడు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ఆర్డీవో కార్యాలయం ఎన్నికల విభాగంలో పనిచేస్తున్న ఎస్.రాజు అనే డిప్యూటీ తహసీల్దార్‌దీ దుర్మార్గం. ఈ ఘటనపై గురువారం ఎస్సై విద్యాచరణ్ రెడ్డి వివరాలు వెల్లడించారు. డిప్యూటీ తహసీల్దార్ రాజు నారాయణఖేడ్‌లో ఓ భవనంలో అద్దెకు ఉంటున్నాడు. అదే ఇంట్లో కింది అంతస్తులో ఓ వివాహిత (31) తన కుటుంబంతో కలిసి ఉంటోంది. కొన్నాళ్లుగా రాజు, ఆమెను చూస్తూ అసభ్యకరంగా సైగలు చేస్తున్నాడు. ఒకసారి టిఫిన్ ప్లేట్ తిరిగిచ్చే నెపంతో నేరుగా ఇంటి లోపలికి రావడంతో అతడిని ఆమె గట్టిగా మందలించింది. బుధవారం రాత్రి 7 గంటలకు బాధితురాలు, దుస్తులు ఆరవేసేందుకు దాబాపైకి వెళ్లగా అక్కడే ఉన్న రాజు, ఆమెను ఉద్దేశించి అసభ్యకరంగా కామెంట్ చేశాడు. పైగా ఆమెను చూస్తూ ఫోన్‌తో వీడియో తీస్తున్నట్లు చేశాడు. అనుమానించిన ఆమె, ఫోన్ ఇవ్వాలని గద్దించగా ఫొటో గ్యాలరీ లాక్ తీయకుండా ఇచ్చాడు. ఆగ్రహించిన బాధితురాలు, ఫోన్‌ను భర్తకు ఇస్తానని హెచ్చరించడంతో మొబైల్‌ను లాక్కునే నెపంతో ఆమె చేయి పట్టుకున్నాడు. ఈ విషయాన్ని బాధితురాలు తన భర్తకు చెప్పింది. ఆయనొచ్చి ప్రశ్నించగా రాజు ఆయనపై దాడి చేశాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు డిప్యూటీ తహసీల్దార్ రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

భారతీయుల కోసం హెల్ప్‌లైన్ నంబర్లు

» ప్రారంభించిన దుబాయ్‌లోని భారతీయ కాన్సులేట్

దుబాయ్, ఏప్రిల్ 18: భారీ వర్షాలు యూఏఈని అతలాకుతలం చేసిన నేపథ్యంలో ఈ వర్షాల కారణంగా ప్రభావితమైన భారతీయుల సహాయార్థం దుబాయ్‌లోని భారతీయ రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులోకి తెచ్చింది. +971501205172, +971569950590, +971507347676, +971585754213 నంబర్లను సంప్రదించి భారతీయులు సహాయం కోరవచ్చని 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. వర్షాలతో చిక్కుకుపోయిన ప్రయాణికుల కోసం యూఏఈ అధికారులు, విమానయాన సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపింది. ఎయిర్‌లైన్స్ నుంచి అందే అప్‌డేట్స్‌ను ప్రయాణికులకు తెలియజేస్తున్నామని పేర్కొంది. సాధారణ పరిస్థితులు ఏర్పడే వరకు హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులో ఉంటాయని తెలిపింది. కాగా దుబాయ్‌లో కురిసిన భారీ వర్షం కారణంగా రోడ్లన్నీ జలమయమ్యాయి. అత్యంత బిజీగా ఉండే దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నీట మునిగింది. ఫలితంగా కొన్ని విమానాల సర్వీసులు రద్దయ్యే పరిస్థితి ఏర్పడింది.

అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్.. మృతుల పేర్లను వెల్లడించిన మావోయిస్టులు

చర్ల, ఏప్రిల్ 18: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా బినాగూడ అడవుల్లో.. అబూజ్‌మడ్ వద్ద ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన నక్సల్స్ పేర్లు, వారి వివరాలను మావోయిస్టు పార్టీ విడుదల చేసింది. వీరిలో నక్సల్స్ కీలక నేత శంకర్ భార్య ఆదిలాబాద్‌కు చెందిన రజిత అలియాస్ సుమన కూడా ఉన్నారు. రివల్యూషన్ ట్రైబల్ ఉమెన్స్ ఆర్గనైజేషన్ దండకారణ్య ప్రతినిధి రామ్కో పేరుతో గురువారం రాత్రి ఈ మేరకు మీడియాకు ఓ లేఖ అందింది. ఈ ఎన్‌కౌంటర్ మోసం కారణంగా జరిగిందని రామ్కో ఆ లేఖలో వెల్లడించారు. "పోలీసులు వెల్లడిస్తున్న పేర్ల కారణంగా మావోయిస్టుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అందుకే.. మీడియా ద్వారా మృతుల పేర్లను తెలియజేస్తున్నాం" అని పేర్కొన్నారు. చనిపోయినవారిలో జయశంకర్-భూపాలపల్లికి చెందిన శంకర్, సౌత్‌బస్తర్ కర్రిగూడేనికి చెందిన బద్రు, బస్తర్‌కు చెందిన అనిత, భూమి, కార్తీక్, అన్వేష్, జనీల, మడకం సంజీల్, శాతి, పింటో, బౌజనాథ్, జైనీ, ఇంద్రావతి ప్రాంతానికి చెందిన గీతా, షర్మిల, సునీల్, శీలా, దుర్గ, మాన్పూర్‌కు చెందిన వినోద్, రీటాతోపాటు.. రమేశ్(భైరంగడ్), బచ్చు(గంగలూరు), సురేఖ(గడ్చిరోలి), కవిత(సుందూర్), రజిత(ఆదిలాబాద్, శంకర్ భార్య), రోషన్(దర్భా డివిజన్), దేవల గంగలీర్(పిడియా), రాజు(ప్రకేలి) ఉన్నట్లు వివరించారు. మరో ఇద్దరు మృతులు ఎవరనేది ఇంకా తెలియాల్సి ఉందని ఆ లేఖలో పేర్కొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యానికి మూల్యం తప్పదు..!

మాజీ ఎమ్మెల్యే కుమారుడి రోడ్డు ప్రమాదం కేసులో ఇద్దరి సస్పెన్షన్

» మత్తులో విధులకు వచ్చిన ఇన్‌స్పెక్టర్‌పై వేటు

» గంజాయి కేసులో నిర్లక్ష్యం.. ఇద్దరు ఎస్సైలపై చర్యలు

» ఓ హెడ్‌కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్ సస్పెన్షన్



హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యానికి ఇకపై మూల్యం చెల్లించక తప్పదని పోలీసు శాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. గతంలో క్రమశిక్షణ చర్యల విషయంలో పెద్దగా చూసీచూడనట్లు వ్యవహరించినా.. కొంతకాలంగా పోలీసు శాఖకు మచ్చతెచ్చేలా సిబ్బంది ఎలాంటి చిన్న పొరపాటు చేసినా.. సీరియస్‌గా చర్యలు తీసుకుంటున్నారు. చట్టాన్ని అతిక్రమించిన పోలీసులను అరెస్టు కూడా చేస్తున్నారు. మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ గురువారం ఒక్కరోజే ఆరుగురు పోలీసులపై సస్పెన్షన్ వేటు వేశారు. వీరిలో నిజామాబాద్‌లో మద్యం సేవించి విధులకు హాజరైన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.రమేశ్, జగిత్యాల జిల్లా సారంగాపూర్ ఠాణాలో నమోదైన గంజాయి కేసులో అలసత్వం వహించిన ఎస్సైలు జి.మనోహర్‌రావు, ఎ.తిరుపతి, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుల్ టి.నరేందర్, బోధన్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ ఉన్నారు. పంజాగుట్ట ఠాణా పరిధిలో.. ప్రజాభవన్ వద్ద గత ఏడాది డిసెంబరులో జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్‌ను కేసు నుంచి తప్పించేందుకు అప్పటి పంజాగుట్ట ఎస్‌హెచ్‌వోతో బోధన్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ సంప్రదింపులు జరిపారు. పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావును అప్పట్లోనే సస్పెండ్ చేసి, ఆ తర్వాత అరెస్టు చేశారు. బోధన్ ఇన్‌స్పెక్టర్‌ను ఇటీవల అరెస్టు చేశారు. కానీ.. గురువారం దాకా ఆయనపై సస్పెన్షన్ వేటు వేయలేదు. పోలీసులపై షకీల్ తీవ్ర ఆరోపణలు చేస్తూ.. ఓ వీడియోను విడుదల చేసిన వెంటనే ప్రేమ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడడం గమనార్హం..!

వరుస సస్పెన్షన్లు..

- కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకట్, ఆర్జీఐ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గత ఏడాది డిసెంబరులో సైబరాబాద్ సీపీ వారిని సస్పెండ్ చేశారు.
- ఇటీవల రోడ్డు ప్రమాదం కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై లాలాగూడ మహిళా ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు.
- 4 రోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌లో ఓ కాంగ్రెస్ నేత డ్యాన్స్ చేసిన ఘటనపై సీరియస్ అయిన ఉన్నతాధికారులు.. మహదేవ్‌పూర్ ఠాణా ఎస్‌హెచ్‌వో జి.ప్రసాద్‌ను బదిలీ చేయగా.. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు.

కొరడా ఝుళిపిస్తున్న ఏసీబీ

- ఏసీబీ కూడా పోలీసు శాఖపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇటీవల రూ.30 వేల లంచం తీసుకుంటూ మాదాపూర్ ఎస్సై రంజిత్ కుమార్, కానిస్టేబుల్ విక్రం ఏసీబీకి చిక్కారు.
- 3 రోజుల క్రితం ఆసిఫాబాద్ ఎస్సై రాజ్యలక్ష్మి రూ.25 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.
- తాజాగా శుక్రవారం భద్రాచలం టౌన్ ఎస్సై శ్రీనివాస్, కానిస్టేబుల్ శంకర్ రూ.20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.

ఎండలు బాబోయ్.. ఎండలు!

నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి, మంచిర్యాల జిల్లా హాజీపూర్‌లో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు

» చాలాచోట్ల 44 డిగ్రీలపైనే

» సాయంత్రం కొన్ని జిల్లాల్లో జల్లులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): భానుడి భగభగలతో రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారింది. గురువారం పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు ఏకంగా 45 డిగ్రీలు దాటాయి. ఎండ వేడిమి, ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి, మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల కేంద్రంలో అత్యధికంగా 45.2 డిగ్రీలుగా నమోదైంది. జగిత్యాల జిల్లా వెల్గటూరు, మంచిర్యాల జిల్లా కొమ్మెరలో 45, పెద్దపల్లి జిల్లా కల్వచర్ల, ఖమ్మం జిల్లా పెనుబల్లిలో 44.9, సూర్యాపేట జిల్లా మఠంపల్లిలో 44.7 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. చాలా జిల్లాల్లో 44 డిగ్రీలకు పైనే ఎండలు కాశాయి. ఈ నేపథ్యంలోనే పలు మండలాల్లో రెడ్ అలెర్ట్ కూడా జారీ చేశారు. ఇక సాయంత్రానికి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌తో పాటు పలు జిల్లాల్లో అక్కడక్కడ జల్లులు పడటంతో వాతావరణం చల్లబడింది. నాగారం, దమ్మాయిగూడ మునిసిపాలిటీల పరిధిలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మహబూబాబాద్ జిల్లా కోయిల్‌కొండ మండలం నల్లవెల్లిలో రైతు కావలి నీలకంఠం (32) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. వర్షం పడుతుండటంతో ఇంటి వెనక ఆరబోసిన ధాన్యం తడవకుండా టార్పాలిన్ కప్పేందుకు వెళ్లి మృత్యువాత పడ్డాడు.

వడదెబ్బకు ఆరుగురి మృతి..

ఎండల వేడిమి తాళలేక వడదెబ్బ తగిలి వివిధ జిల్లాల్లో ఆరుగురు మృతి చెందారు. సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామారావుపల్లికి చెందిన మట్కం గంగారం (42), గద్వాల జిల్లా ధరూరు మండల కేంద్రంలో కావలి వెంకటమ్మ (62), భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలం చింతోనిచెలకకు చెందిన సూర్నపాక లక్ష్మయ్య (48), యాదాద్రి జిల్లా వలిగొండ మండలం వేములకొండలో ఏపీకి చెందిన కూలీ అలగంజి నాగరాజు (50), నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ఖిల్లా డిచ్‌పల్లికి చెందిన కొత్తూరు గోపి (41), మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన షేక్ ఫరీద్ పాషా (40) ఎండలకు అస్వస్థత చెంది మరణించారు. ఇటు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండటం చిల్లేపల్లి బీసీ బాలికల గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థినులు వడగాలులకు అస్వస్థతకు గురయ్యారు.

రణరంగంగా మారిన హెచ్‌సీయూ

» ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ విద్యార్థుల మధ్య ఘర్షణ

» హాస్టల్‌లో అర్ధరాత్రి ఘటన.. 15 మందికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ హాస్టల్‌లో విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణ జరగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వర్సిటీ జే బ్లాక్‌లో బుధవారం అర్ధరాత్రి ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ సంఘాలకు చెందిన విద్యార్థులు పరస్పరం బాహాబాహీకి దిగారు. ఇరువర్గాల వారు ఒకరికి వ్యతిరేకంగా మరొకరు నినాదాలు చేసుకున్నారు. ఇది కాస్తా ముదరడంతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో 15 మంది విద్యార్థులు గాయపడ్డారు. ఏబీవీపీ నాయకులు గత ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక తమ భావజాలాన్ని వ్యతిరేకించిన వారిపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. విద్యార్థినులపై కూడా చేయిచేసుకున్నారని, అసభ్య పదజాలంతో దూషించారని తెలిపారు. గొడవను ఆపేందుకు యత్నించిన సెక్యూరిటీ సిబ్బందిపై కూడా చేయిచేసుకున్నారని, దాడులు చేస్తున్న సమయంలో వీడియో తీసిన వారిని బెదిరించి, వీడియోలు డిలీట్ చేయించారని ఆరోపించారు. వర్సిటీలో విద్యార్థులపై తరచు దాడులకు పాల్పడుతున్న వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని వీసీ కార్యాలయం ముందు గురువారం నిరసన తెలిపారు. ఇదిలా ఉండగా హస్టల్‌లో గొడవ జరగడానికి ఎస్ఎఫ్ఐ నాయకులే కారణమని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు.

టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్‌గా అశోక్ గౌడ్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్‌గా పొన్నం అశోక్ గౌడ్ బాధ్యతలు చేపట్టారు. గురువారం గాంధీభవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరీ సమక్షంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. పొన్నం అశోక్‌గౌడ్‌కు వందలాది మంది న్యాయవాదులు అభినందనలు తెలిపారు. లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా న్యాయవాదులకు అశోక్‌గౌడ్ పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవ్యవస్థ కీలకమని, న్యాయవాదులంతా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరీ కోరారు.

మహాత్మాగాంధీ స్మారక నిధి సావనీర్ ఆవిష్కరణ

మహాత్మాగాంధీ స్మారక నిధి వజ్రోత్సవాల సందర్భంగా రూపొందించిన ప్రత్యేక సావనీర్-2024ను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ గురువారం గాంధీభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ ఆశయాలు, అహింస సిద్ధాంతం ప్రపంచానికి ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గాంధీ ట్రస్ట్ సభ్యులు సూర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోవా ప్రజలకు మహదాయి జీవనాడి

» గోవా ముఖ్యమంత్రి ప్రమోద్‌సావంత్

బెంగళూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మహదాయి జలాల సమస్య కర్ణాటకలో ఎన్నికల అంశమైతే.. గోవాలో ప్రజల దాహం తీర్చే జీవనాడి అని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్‌సావంత్ అన్నారు. బెళగావి బీజేపీ అభ్యర్థి జగదీశ్ శెట్టర్ తరఫున ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన ప్రమోద్ సావంత్ గురువారం మీడియాతో మాట్లాడారు. మహదాయి నదీ జలాలను కాలువల ద్వారా వినియోగించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి పర్యావరణ అనుమతుల కోసం కర్ణాటక ప్రభుత్వం ఎదురుచూస్తోందని అన్నారు. ఈలోగా లోక్‌సభ ఎన్నికలు రావడంతో మహదాయి అంశం కర్ణాటకకు ఎన్నికల అంశంగా మారిందని అన్నారు. గోవాకు జీవనాడి అయినందున, హక్కులు సాధించుకునేందుకు తాము అన్నివిధాల ప్రయత్నాలు చేస్తామని అన్నారు. మహదాయి నదీ జలాల అంశం అంతర్రాష్ట్ర వివాదమని స్పష్టం చేశారు. గోవా ప్రజల తాగునీటి కోసం ఉండే ఏకైక వనరు.. మహదాయి అనిఅన్నారు.

బస్సును ఢీకొన్న పెళ్లి బృందం వాహనం నలుగురి దుర్మరణం

» మహారాష్ట్రలో ఘటన...మృతులు కర్ణాటక వాసులు

బెంగళూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పెళ్లి బృందం వాహనం ప్రమాదానికి గురికావడంతో వధువు చెల్లెలితో పాటు మరో ముగ్గురు దుర్మరణం చెందారు. మహారాష్ట్రలో ఈ ప్రమాదం చోటుచేసుకోగా మృతులంతా కర్ణాటకకు చెందిన వారు. బాగల్‌కోటె జిల్లా జమఖండి తాలూకా రహమత్‌పూర్ గ్రామం నుంచి వధువు తరఫున 13 మందితో కూడిన పెళ్లి బృందం బుధవారం రాత్రి క్రూజర్ వాహనంలో బయలుదేరింది. మహారాష్ట్రలోని జత్తా సమీపాన నాగసపాట వద్ద ముందు వెళుతున్న ఓల్వో బస్సును క్రూజర్ వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా, నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. మృతి చెందినవారిలో కనమడి గ్రామానికి చెందిన అనసూయ మోరె(56), లోకకాపుర గ్రామ నివాసి నివేదిత(17), రహమత్‌పుర వాసి భాగ్యశ్రీ అంబేకర్(18), ఉజ్వల షిండే(19) ఉన్నారు.

కుమారుడి మృతదేహాన్ని పాతిపెట్టి.. బతికున్నాడని భార్యను నమ్మించి..

» మూడున్నరేళ్లుగా భార్యను మభ్యపెట్టిన భర్త

» 11ఏళ్ల బాలుడికి తిమ్మిర్లతో స్వల్ప అనారోగ్య సమస్య

» నాటువైద్యుడిని సంప్రదించిన బాలుడి తండ్రి

» అప్పటికే బాలుడి తల్లిపై కన్నేసిన ఆ నాటువైద్యుడు

» వైద్యం వికటించి ఆశ్రమంలోనే బాలుడి మృతి

» తండ్రితో కలిసి ఆశ్రమంలో పాతిపెట్టిన నాటు వైద్యుడు

» ఆసిఫాబాద్ జిల్లా పాసిగాం శివారులో ఘోరం



బాలుడు రిషి (ఫైల్)

రెబ్బెన, ఏప్రిల్ 18: కుమారుడిని చూడకుండా ఓ తల్లి ఎన్ని రోజులని ఉండగలదు? ఆ తల్లి ఏకంగా మూడున్నరేళ్లు కొడుకును కనీసం చూడలేదు. భర్తతో గొడవపడి, కుమారుడిని కట్టుకున్నోడి వద్దే వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయి, కొడుకు గురించి ఆరా తీస్తూ వచ్చింది. ఆమె అడిగినప్పుడల్లా... 'కొడుకు బాగున్నాడు' అని చెబుతూ వచ్చాడా భర్త!! విషయం ఏమిటంటే.. ఆ బాలుడు లేడు. ఓ నాటు వైద్యుడి మందుల కారణంగా ఈ లోకాన్ని వీడి మూడేళ్లు దాటిపోయింది. ఈ ఘోరం కన్నతండ్రిగా తనకు తెలిసినా కూడా అతడు భార్యకు చెప్పలేదు. పైగా... మృతదేహాన్ని మాయం చేద్దామని ఆ నాటు వైద్యుడు చెబితే సహకరించాడు. ఇన్నాళ్లకు భర్త తీరుపై అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తే తన కొడుకు ఇక లేడు అనే విషయం ఆమెకు తెలిసింది. పోలీసుల సమక్షంలో తవ్వగా బయటపడిన కుమారుడి అస్థికలను చూసుకొని ఆమె కంటికీమంటికి ధారగా రోదించింది. ఈ మేరకు ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం పాసిగాం గ్రామంలోని ఓ ఆశ్రమం వెనుకాల ఓ బాలుడి మృతదేహాన్ని గురువారం పోలీసులు వెలికితీశారు. డీఎస్పీ సదయ్య, మృతుడి తల్లి వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా నంబాల గ్రామానికి చెందిన సుల్వ శ్రీనివాస్, మల్లేశ్వరికి కుమారులు రిషి (11), అఖిల్ ఉన్నారు. నంబాలకే చెందిన భీంరావు అనే నాటు వైద్యుడు ఇదే మండలం పాసిగాం శివారులో ఓ ఆశ్రమాన్ని నడుపుతున్నాడు. అనారోగ్య సమస్యలతో ఆశ్రమానికి వచ్చే జనాలకు నాటు వైద్యం చేస్తున్నాడు. ఆ నాటు వైద్యుడంటే శ్రీనివాస్‌కు భక్తి మెండు! అయితే శ్రీనివాస్ పొరుగింట్లోనే ఉండే భీంరావు, ఆయన భార్య మల్లేశ్వరిపై కన్నేశాడు. బాలుడు రిషికి కాళ్ల తిమ్మిర్ల సమస్య ఉండటంతో తండ్రి శ్రీనివాస్, భీంరావును సంప్రదించాడు. చికిత్స పేరుతో రిషిని తన ఆశ్రమంలో చేర్చుకుంటే కుమారుడిని చూసేందుకు అప్పుడప్పుడూ మల్లేశ్వరి వస్తుందని, ఆమెను లోబర్చుకోవచ్చునని భీంరావు పథకం వేశాడు. రిషికి కొన్నాళ్లు ఆశ్రమంలోనే ఉంచి.. నాటువైద్యం చేయాలని తండ్రి శ్రీనివాస్‌కు చెప్పాడు. 2020 నవంబరులో రిషిని శ్రీనివాస్ ఆశ్రమంలో చేర్పాడు. కుమారుడిని చూసేందుకు ఆశ్రమానికి మల్లేశ్వరి రెండుసార్లు వెళ్లింది. తొలుత వెళ్లినప్పుడు.. ఆశ్రమ నిర్వాహకుడు భీంరావు తనను కొడుతున్నాడంటూ తల్లికి రిషి చెప్పుకొని ఏడ్చాడు. కొన్నాళ్లకు రెండోసారి వెళ్లినప్పుడు ఆమెకు బాలుడు నిద్రపోతున్న స్థితిలో కనిపించాడు. ఫలితంగా బాబుతో మాట్లాడకుండానే ఆమె ఇంటికి వచ్చేసింది. ఈ క్రమంలోనే భార్యాభర్తలు శ్రీనివాస్, మల్లేశ్వరి మధ్య గొడవలు జరిగాయి. భర్త తీరుతో విసుగెత్తిన ఆమె, చిన్న కుమారుడు అఖిల్‌ను వెంటబెట్టుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే.. నాటు వైద్యం వికటించడంతో 2021 జనవరి చివర్లో ఆశ్రమంలోనే రిషి మృతిచెందాడు. ఈ విషయం బయటకు పొక్కితే ఆశ్రమానికి చెడ్డపేరు వస్తుందని భీంరావు ఆందోళన చెందాడు. ఇదే విషయాన్ని బాలుడి తండ్రి శ్రీనివాస్‌కు చెప్పాడు. మృతదేహాన్ని ఆశ్రమం వెనుకభాగంలో పాతిపెడదామని భీంరావు చెబితే శ్రీనివాస్ సరేన్నాడు. ఇద్దరూ కలిసి మృతదేహాన్ని పాతిపెట్టారు. ఇదంతా తెలియని మల్లేశ్వరి.. కుమారుడి గురించి పలుమార్లు భర్తను ఆరా తీస్తూ వచ్చింది. తొలుత బాలుడు ఆశ్రమంలోనే ఉన్నాడని చెబుతూ వచ్చిన శ్రీనివాస్.. ఆ తర్వాత ఆశ్రమం నుంచి బయటకు తెచ్చి హాస్టల్లో చేర్పించానని భార్యను నమ్మించాడు. కుమారుడితో మాట్లాడించాలని ఎప్పుడు అడిగినా మూడున్నరేళ్లుగా దాటవేస్తుండటంతో మల్లేశ్వరికి అనుమానం వచ్చింది. కుమారుడి ఆచూకీ గురించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు రంగంలోకి దిగడంతో ఘోరం బయటపడింది. భీంరావును, శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరినీ గురువారం పాసిగాం శివార్లోని ఆశ్రమానికి తీసుకెళ్లగా.. బాలుడిని పాతిపెట్టిన స్థలాన్ని వారు చూపించారు. ఆ స్థలంలో రెబ్బెన తహసీల్దార్ జ్యోత్స్న సమక్షంలో తవ్వగా మృతదేహం తాలూకు అవశేషాలు బయటపడ్డాయి. ఫోరెన్సిక్ వైద్యులు సురేందర్‌రెడ్డి మృతదేహానికి సంబంధించిన అస్థికలు సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. కేసు దర్యాప్తులో ఉంది.



రామయ్య మహాపట్టాభిషేకం దృశ్యం

భద్రాద్రి రామయ్యకు మహాపట్టాభిషేకం

» ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలందజేసిన గవర్నర్

భద్రాచలం, ఏప్రిల్ 18: కల్యాణ రామయ్యగా మెరిసిన భద్రాద్రి రాముడికి గురువారం మహా పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. దంపతులైన శ్రీ సీతారామచంద్రస్వాములను తొలుత మేళతాళాలు, భాజభజంత్రీలు, కోలాటాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా మిథిలా స్టేడియంలోకి తీసుకొచ్చారు. తొలుత ఆరాధాన, అనంతరం వేద స్వస్తితో కార్యక్రమానికి శ్రీకారం చుట్టి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్‌వరణం, మండల త్రయార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా మహాపట్టాభిషేక వశిష్టతను స్థానాచార్యులు కేఈ స్థలశాయి, రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు వివరించారు. పట్టాభిషేకంలో భాగంగా కలశారాధన నిర్వహించి స్వర్ణ పాదుకలు, రాజదండం, రాజముద్రిక సమర్పించారు. అలాగే ఛత్ర, చామర, హార మొదలైన రాజ లాంఛనాలతో పట్టాభిషేక వేడుక ఘనంగా నిర్వహించారు. భక్తకోటి జయజయ ధ్వానాల మధ్య కిరీట ధారణ చేశారు. వేద పఠనం చేసిన అనంతరం నదీ జలాలతో మహాకుంభ తీర్థ ప్రోక్షణ గావించారు. ఈ పట్టాభిషేక కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, దేవనాథ జీయర్‌స్వామి, కంచికామకోటి పీఠాధిపతులు శంకరవిజయేంద్ర సరస్వతీస్వామి తరఫున శ్రీపాద శ్రీకర్, ఆహోబిలం మఠం తరఫున కృష్ణ చైతన్య, తూము నరసింహదాసు వారసుల తరఫున పట్టాభిషేక సందర్భాన్ని పురస్కరించుకుని రామయ్యకు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమం అనంతరం స్వామివారిని రామాలయానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. కార్యక్రమంలో భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఆర్డీవో కె.దామోదర్ రావు, ఏఎస్పీ పరితోష్ పంకజ్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధం ఆపండి...!

వార్ రుక్వాదీ పాపా, ఔర్ ఫిర్ హమారీ బస్ నికాలీ పాపా..! అని ఓ విద్యార్థిని ఎంతో ఉద్వేగంతో తన తల్లిదండ్రులకు చెబుతున్న ఓ వీడియో అడ్వర్టయిజ్‌మెంట్ భారతీయ జనతాపార్టీ ఇటీవల విడుదల చేయడం, సామాజిక మాధ్యమాల్లో అది విస్తృతంగా ప్రచారం కావడం తెలిసినవే. ప్రధానమంత్రి అధికారిక యూట్యూబ్ చానెల్‌లోనూ అది కనిపిస్తుంది. 'నేను చెప్పలేదూ...మోదీ ఎట్లాగయినా మమ్మల్ని ఇంటికి చేరుస్తాడని, యుద్ధం ఆపేశారు నాన్నా, ఆ తరువాత మమ్మల్ని తీసుకొని బస్సు బయలుదేరింది' అంటూ ఆ అమ్మాయి చెబుతూంటే తల్లిదండ్రులు ఆనందబాష్పాలు రాల్చుతూంటారు. ఈ అడ్వర్టయిజ్‌మెంట్‌లో స్థలకాలాదులకు సంబంధించిన ప్రస్తావనలు, మోదీ నిలువరించిన ఆ యుద్ధం ఏమిటన్న వివరాలు ఉండవు. కానీ, ఆ సంభాషణ, విమానాశ్రయ దృశ్యాలను బట్టి అది ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించిన ప్రస్తావన అని తెలుస్తూనే ఉంటుంది.

ఉక్రెయిన్ మీద రష్యా యుద్ధం ప్రకటించిన తరువాత, బీజేపీతో ముడిపడి సామాజిక మాధ్యమాల్లో ఒక అంశం విస్తృతంగా ప్రచారమైంది. భారతదేశానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులను స్వదేశానికి చేర్చడం కోసం నరేంద్రమోదీ ఈ యుద్ధాన్ని కొంతకాలం నిలిపివేశారట. భారతీయవిద్యార్థులను స్వదేశానికి చేర్చుతున్నప్పుడు బీజేపీ నాయకులు చేసిన హడావుడి అటుంచితే, మనపిల్లలకోసం మోదీ ఏకంగా యుద్ధాన్ని ఆపారని అప్పట్లో కొందరు వ్యాఖ్యానించారు కూడా. వీటిని విదేశాంగశాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చీ దృష్టికి తీసుకువెళ్ళినప్పుడు ఈ తరహా వ్యాఖ్యలన్నీ నిరాధారమైనవీ, పూర్తి అసత్యాలని అని ఖండించారు. ఆ యుద్ధపరిస్థితుల మధ్య కాస్తంత క్షేమకరమైన మార్గం ఏమిటన్నది మేం తెలుసుకొని చెప్పాం, చాలామంది ఆ మార్గాన్ని వినియోగించుకొని బయటపడ్డారు అని అన్నారాయన. దీనిని ఆధారంగా చేసుకొని ఎవరో బాంబులు వేయకుండా ఆపారని, లేదా అందుకు ప్రయత్నించారని చెప్పుకోవడం సరికాదు అన్నారాయన. కానీ, విదేశాంగశాఖ ప్రతినిధి ఇలా కాదు పొమ్మన్నంతమాత్రాన ఎందుకు ఊరుకోవాలని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు కూడా అనిపించింది. 22వేలమంది పిల్లలను క్షేమంగా ఇళ్ళకు చేర్చడానికి నరేంద్రమోదీ రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపారని గత ఏడాది ఫిబ్రవరిలో కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ఆయన వ్యాఖ్యానించారు. ఎవరికి నచ్చినా నచ్చకపోయినా సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో బీజేపీ మళ్ళీ ఈ అంశాన్ని బాగానే వాడుకుంటోంది.

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మూడేళ్ళుగా సాగుతోంది. ఈ సుదీర్ఘకాలంలో దానిని ముగించడానికి మోదీ ఎంత కృషిచేశారో, ఎన్ని ప్రయత్నాలు చేశారో తెలియదు కానీ, యుద్ధం ఆరంభమైన తొలినాళ్ళలో మోదీ జోక్యం చేసుకోవాలని చాలామంది విదేశీ నాయకులు కోరారు కూడా. ఇప్పుడు యుద్ధాన్ని ఆపేందుకు స్విట్జర్లాండ్ ఆధ్వర్యంలో ఒక అంతర్జాతీయస్థాయి ప్రయత్నం మొదలైంది. జూన్ 15-16 తేదీల్లో జరిగే ఈ సమావేశంలో అత్యధికదేశాలు పాలుపంచుకుంటాయని అంటున్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు మూడునెలలక్రితం చేసిన అభ్యర్థనకు ఇటీవల సానుకూలంగా స్పందించిన స్విట్జర్లాండ్ తదనుగుణంగా ప్రయత్నాలు ఆరంభించింది. దేశాధినేతలంతా పాల్గొనే ఈ సమావేశం అతిత్వరలోనే యుద్ధాన్ని ముగించేందుకు తోడ్పడుతుందని అంచనా. జూన్‌లోగా స్విట్జర్లాండ్ అన్ని దేశాలతోనూ చర్చోపచర్చలు జరిపి, ఇచ్చిపుచ్చుకోవడాలను తేల్చి, యుద్ధం ముగింపునకు వాతావరణాన్ని సానుకూల పరుస్తుందట. యుద్ధంలో తనది పైచేయిగా ఉన్న వర్తమాన స్థితిలో, అంతర్జాతీయంగా తనమీద ఒత్తిడితెచ్చి, ఉక్రెయిన్‌కు మేలు చేయడానికే ఈ సమావేశాన్ని ఏర్పాటుచేశారంటూ రష్యా దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. అందులో పాల్గొనేది లేదని అంటోంది. చైనా కూడా రష్యా పక్షాన నిలబడింది. ఇంకా రెండునెలల సమయం ఉన్నందున ఇంతలోగా పరిస్థితులన్నీ చక్కబడతాయని పశ్చిమదేశాల తరఫున ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్న స్విట్జర్లాండ్ బలంగా నమ్ముతోంది. ఉక్రెయిన్ దౌత్యప్రతినిధులు ప్రపంచదేశాలన్నీ తిరుగుతూ ఈ సమావేశానికి మద్దతు కూడగడుతున్నారు. అందులో భాగంగానే, గత నెలల ఉక్రెయిన్ విదేశాంగమంత్రి మనదేశంలో పర్యటించి, సమావేశాల్లో పాల్గొనాల్సిందిగా అభ్యర్థించారు. కొద్దిరోజుల్లో ముగుస్తుందని అనుకున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఏళ్ళతరబడి సాగుతూ, ప్రపంచ ఆర్థికాన్ని పెద్దదెబ్బకొట్టింది. ఎవరివాదనలు ఏమైనప్పటికీ, యుద్ధభూమినుంచి కాలువెనక్కుతీసుకొనేందుకు అన్ని పక్షాలకు అందివచ్చిన అవకాశం ఇది. ఇప్పటికైనా, యుద్ధాన్ని ముగించడంలో మనవంతు ప్రయత్నం చేస్తే మంచిది.

మోదీ గ్యారంటీ : 'ఒకే దేశం, ఒకే నాయకుడు'

మొత్తం ఓటర్లు 96 కోట్ల మందికి పైమాటే, 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలలో 543 నియోజకవర్గాలు, వీటిలో 10 లక్షలకు పైగా పోలింగ్ బూత్‌లు... ప్రపంచ అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ రూపురేఖలివి. అయినా ఈ బృహత్ ప్రజాస్వామ్య సమాజంలో సార్వత్రిక ఎన్నికల పోరాటం కేవలం ఒకే ఒక్క పేరుపై జరుగుతోంది: నరేంద్ర దామోదర్ దాస్ మోదీ. 2024 సార్వత్రిక ఎన్నికలు అంతిమ అధ్యక్ష–తరహా ఎన్నికల పోరు. అధికార భారతీయ జనతా పార్టీ ఈ ఎన్నికల సమరాన్ని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రూపంలో చేస్తోంది! తనవైన సొంత ఎన్నికల వ్యూహాలు ఉన్న కేరళ, ప్రాంతీయ నాయకుల మధ్య పాత తరహా పోరు జరుగుతున్న ఆంధ్రప్రదేశ్‌ను మినహాయిస్తే ప్రతి ఇతర రాష్ట్రంలోను ఒకే ఒక్క అభ్యర్థి ఉన్నాడు. ఈ సార్వత్రిక ఎన్నికలను అతడు తన నాయకత్వంపై ఒక రెఫరెండమ్ (ప్రజాభిప్రాయ సేకరణ)గా మార్చి వేశాడు. ఆ ఒకే ఒక్క అభ్యర్థి నరేంద్ర మోదీ అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

బీజేపీ మానిఫెస్టో సైతం ఒక వ్యక్తికి ఎనలేని ప్రాధాన్యమిచ్చింది. ఆ ఎన్నికల ప్రణాళిక ఇచ్చిన ప్రతి హామీలోనూ 'మోదీకీ గ్యారంటీ' అనే ఊతపదం (భాషా భూషణం) కనిపిస్తుంది. అంతేనా? మానిఫెస్టో ప్రతి పేజీని నరేంద్ర మోదీ బొమ్మలు ఆవరించుకుని ఉన్నాయి. 'ఒకే దేశం, ఒకే నాయకుడు' పేరిట జరుగుతున్న అవధులు లేని వ్యక్తి పూజలో పార్టీ వ్యక్తిత్వం అంతర్గతమైపోయింది. 1970 దశకంలో కాంగెస్ అధ్యక్షుడు దేవ్‌కాంత్ బారువా 'ఇండియాయే ఇందిర, ఇందిరే ఇండియా' అని ఇందిరా గాంధీని అపఖ్యాతికరంగా ప్రస్తుతించిన అనంతరం ఒక సార్వత్రిక ఎన్నికల సమరం పూర్తిగా ఒక వ్యక్తి కేంద్రంగా జరగడం ఇదే మొదటిసారి. నరేంద్ర మోదీని మొట్ట మొదట ప్రధానమంత్రి పదవికి తీసుకువచ్చిన 2014 సార్వత్రిక ఎన్నికల సమరం 'అచ్చే దిన్' (మంచి రోజు) హామీతో మార్పుకు ఓటుగా (ఓట్ ఫర్ ఛేంజ్) జరిగింది. 2019 సార్వత్రిక పోరు కూడా నాయకత్వం గురించే అయినా పుల్వామా ఉగ్రదాడి, బాలాకోట్ ప్రతీకార దాడుల ఫలితంగా జాతీయవాద భావోద్వేగ పూరిత వాతావరణంలో జరిగింది. మరి ఇప్పుడైనా అంటే 2024 సార్వత్రిక ఎన్నికలు అయినా ఉద్యోగాలు, ద్రవ్యోల్బణం, ఆదాయ అసమానతలు మొదలైన ప్రజాసమస్యలు కేంద్రంగా జరుగుతున్నాయా అంటే లేదనే చెప్పి తీరాలి. ఆ అంశాల ప్రాతిపదికన జరుగుతున్నాయని కనీసం ఎవరూ చెప్పడమే లేదు. గత పదేళ్ల మోదీ సర్కార్ సాఫల్య వైఫల్యాలపై అర్థవంతమైన చర్చ సైతం జరగడం లేదు. బీజేపీ ఓటర్లను మినహాయిస్తే హిందూత్వకు సైతం ఎలాంటి ప్రాధాన్యం లభించడం లేదు.

తీవ్ర స్థాయిలో ఊదరగొడుతున్న 'వికసిత్–భారత్' కథనాన్ని సైతం, ఒకే ఒక్క నాయకుడు మాత్రమే భారత్‌ను ఉజ్వల భవిష్యత్‌లోకి తీసుకువెళ్లగలడన్న మౌలిక విశ్వాసం చుట్టూ నిర్మించారు. 2036లో ఒలింపిక్ క్రీడోత్సవాలను భారత్‌లోనే నిర్వహించనున్నామనే హామీని సైతం నరేంద్ర మోదీయే శాశ్వతంగా ప్రధానమంత్రిగా ఉంటారనే భరోసా ఆధారంగా ఇవ్వడం జరిగింది. 2022 నాటికి 'నవభారత్' నిర్మాణ స్వప్న సాకార గడువును చాలా నేర్పుగా 2047కు, దాని అనంతర కాలానికి మార్చి వేశారు. ప్రధానమంత్రి 'అమృత్ కాల్' దార్శనికతలో దాన్ని ఒక భాగంగా చేర్చారు.



18వ సార్వత్రిక ఎన్నికల్లో మోదీ పేరిట, అవును మోదీ పేరిట మాత్రమే ప్రభుత్వ అనుకూల తిరుగులేని ప్రజా తీర్పుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. స్వల్పకాలికంగా ఇది బీజేపీకి గొప్ప లబ్ధి సమకూర్చే వ్యూహమనడంలో సందేహం లేదు. అయితే దీర్ఘకాలంలో అదొక అనివార్య ప్రశ్నను హఠాత్తుగా మన ముందుకు తెస్తుంది : 'మోదీ తరువాత, ఎవరు?'

నిజానికి 'గ్యారంటీ' అన్న భావన బీజేపీ సొంతం కానే కాదు. ఆ పదాన్ని తొలుత సృష్టించింది ఆమ్ ఆద్మీ పార్టీ. 2020లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వం ప్రాతిపదికగా చేస్తూ ఆ పదాన్ని ఆప్ వాడింది. ఆ తరువాత హిమాచల్, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో తమ హామీల గురించి నొక్కి చెప్పేందుకు కాంగ్రెస్ ఆ పదాన్ని బాగా ఉపయోగించుకున్నది. ఇప్పుడు అదే ప్రధానమంత్రి నరేంద్ర యోదీ యుఎస్‌పి (యూనిక్ సెల్లింగ్ ప్రపోజిషన్)గా ఉన్నది. ఓటర్లు సాధారణంగా స్థానిక నాయకుల మాటలను నమ్మరని, నరేంద్ర మోదీ లాంటి జాతీయ స్థాయి నాయకులనే విశ్వసిస్తారనే అవగాహనే 'గ్యారంటీ'కి ప్రధాన ఆధారం (వాస్తవ లబ్ధి దక్కకపోయినా ఎక్కువగా ఆశాభావమే 'గ్యారంటీ'కి ప్రాతిపదికగా ఉన్నప్పటికీ మోదీ లాంటి నేతలను ప్రజలు తప్పక విశ్వసిస్తారు మరి).



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

కర్ణాటకే ఇందుకొక మంచి ఉదాహరణ. కోటీశ్వరులు, పార్టీ ఫిరాయింపుదారులు, రాజకీయ కుటుంబాల వారసులతో రాష్ట్ర బీజేపీ నిండిపోయి ఉంది. 'భిన్నమైన పార్టీ'గా పేరుపొందిన బీజేపీ ఇప్పుడు కర్ణాటకలో నరేంద్ర మోదీ కేంద్రిత ఎన్నికల ప్రచార యంత్రాంగం ఆధారంగా ఎట్టి పరిస్థితులలోనూ, ఏ విధంగానైనా సరే గెలిచి తీరేందుకు శతథా ప్రయత్నిస్తోంది. సిట్టింగ్ ఎంపీలలో సగం మందికి పైగా (వీరందరూ సీనియర్, విధేయ కార్యకర్తలు) మళ్లీ పార్టీ టిక్కెట్ ఇవ్వడానికి నిరాకరించిన బీజేపీ, దేవెగౌడ నాయకత్వంలోని జనతాదళ్ (ఎస్)తో పొత్తు పెట్టుకున్నది. ఏడాది క్రితం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో దేవెగౌడ పార్టీకి వ్యతిరేకంగా బీజేపీ పోరాడింది. జనతాదళ్ (ఎస్) తండ్రి–తనయుడి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మాత్రమేనని తూర్పార పట్టింది. అధికారంలో ఉన్నప్పుడు పాలనా వ్యవస్థను పూర్తిగా అవినీతిమయం చేసిందని కూడా తీవ్రంగా ఆరోపించింది.

దక్షిణ బెంగళూరులో యువ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య ఒక ఆదివారం ఉదయం 'రన్ ఫర్ నమో' ఈవెంట్‌ను నిర్వహించారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్నవారికి ప్రధానమంత్రి ముఖచిత్రం ఉన్న టీషర్ట్‌లు, మాస్కులు పంపిణీ చేశారు జై శ్రీరామ్, భారత్ మాతాకీ జై అనే నినాదాల మధ్య 'మోదీ మోదీ' అనే మంత్రఘోష ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించింది. కర్ణాటకలో బీజేపీ తప్పక గెలిచే లోక్‌సభ నియోజకవర్గాలలో దక్షిణ బెంగళూరు ఒకటి. అయినప్పటికీ దక్షిణ బెంగళూరులోనే కాకుండా రాష్ట్రంలోను, దేశవ్యాప్తంగాను ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలోను బ్రాండ్ మోదీ పేరిటే ఈ సార్వత్రిక ఎన్నికలలో పోరాడుతున్నామని యువ ఎంపీ తేజస్వి సూర్య అంగీకరించారు.

ఒక విధంగా బీజేపీ శ్రేణుల మోదీ స్థిరీభావనం (మోదీ ఫిక్సేషన్) అర్థం చేసుకోదగిందే. ప్రధానమంత్రికి లభిస్తున్న తిరుగులేని ప్రజాదరణ మీ విజయానికి తప్పక తోడ్పడే అవకాశమున్నప్పుడు అందుకు మీరు ఎందుకు గర్వపడకూడదు? ఆశిస్తున్న విజయోన్నతికి ఆ అవకాశాన్ని ఎందుకు ఉపయోగించుకోకూడదు? ఇప్పుడు బీజేపీ సరిగ్గా చేస్తుంది అదేనని చెప్పవచ్చు. ఇందిరాగాంధీ హయాంలో కాంగ్రెస్ పార్టీ 1971 అనంతరం ఆమెకు లభించిన 'విజయేందిర', 'దుర్గామాత' కీర్తిప్రతిష్ఠల ఆధారంగా తన వ్యూహాలను రూపొందించుకోలేదా? ప్రజల విశ్వాసాన్ని పరిపూర్ణంగా పొందిన తమ అపూర్వ అగ్రనేత కీర్తి ప్రతిష్ఠలను బీజేపీ ఎందుకు ఉయోగించకోకూడదు? అయితే ఎన్నికలలో ఓటర్లను ఆకట్టుకునేందుకు అటువంటి వ్యూహాలను అనుసరించడం అర్థం చేసుకోదగిన విషయమే కానీ బహుళ–పార్టీ ప్రజాస్వామ్యంలో అది సదా ఆరోగ్యకరమైన పరిణామం కాదు, కాబోదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే అటువంటి వ్యూహాలను అనుసరించడం సమస్త ఇతర నాయకులు, రాజకీయ పక్షాలు అన్నిటినీ ఓటర్లు ఎన్నుకునేందుకు అసంగతమైన వారు, అనవసరమైనవిగా చేసేందుకు ప్రయత్నించడమే అవుతుంది.

మోదీ నాయకత్వ పోకడలను ఇప్పుడు మౌనంగా అంగీకరిస్తున్న సంఘ్ పరివార్ ఒకప్పుడు 'వ్యక్తి' (నాయకుడు) ప్రాముఖ్యత కంటే 'సంఘటన్' (సంస్థ) ప్రాధాన్యాన్ని తరచు నొక్కి చెపుతుండేది. 1999, 2004 సార్వత్రిక ఎన్నికల సందర్భంలో 'భారత్ ఎదురుచూస్తున్న నాయకుడు'గా వాజపేయిని అభివర్ణిస్తూ బీజేపీ చేసిన ప్రచారోద్ధృతి పట్ల సంఘ్ పరివార్ ఎలా ఆగ్రహం వ్యక్తం చేసిందో గుర్తు చేసుకోండి. వాజపేయికి అలా ఎనలేని ప్రాధాన్యమివ్వడం సంఘ్ పెద్దలు ససేమిరా అంగీకరించలేదు. మరి అదే సంఘ్ పరివార్ ఇప్పుడు 'ఆయేగా తో మోదీ హి' ప్రచారార్భాటాలను నిరాక్షేపంగా సమ్మతిస్తోంది. మూడోసారి అధికారంలోకి వచ్చిన పక్షంలో నరేంద్ర మోదీ తప్పకుండా తమ సైద్ధాంతిక ఎజెండాలోని ప్రధాన అంశాలన్నిటినీ తప్పకుండా అమలుపరుస్తారనే భరోసా పూర్తిగా ఉండడం వల్లే సంఘ్ పెద్దలు మౌనం వహించారు. సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో ప్రధానమంత్రిగా ఉన్న వాజపేయి కనీస ఉమ్మడి కార్యక్రమం ప్రతిబంధకాల నడుమ ప్రధానమంత్రిగా, కూటమి అధినేతగా తన విధులను అతి జాగ్రత్తగా నిర్వర్తించవలసి వచ్చింది. మోదీకి అటువంటి ఇబ్బందులు లేవు. సొంత మెజారిటీతో అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్ అధికరణ 370ని రద్దు చేసింది; అయోధ్యలో రామాలయాన్ని నిర్మించింది; ఉమ్మడి పౌరస్మృతిని అమలుపరుస్తామని ఇప్పుడు హామీ ఇస్తోంది.

లోక్‌సభ ఎన్నికల బరిలో ఉన్న బీజేపీ అభ్యర్థులు చాలా వరకు దేశానికి పెద్దగా తెలియని వ్యక్తులు, ఎలాంటి ప్రాముఖ్యం లేనివారు; ప్రధానమంత్రి ఫర్మానాలను కేంద్ర మంత్రులు తూ.చ తప్పకుండా అమలుపరుస్తున్నారు; అధికారంలో ఎవరుంటే వారికి పూర్తి విధేయతతో వ్యవహరిస్తారనే 'కీర్తి'ని బ్యూరోక్రాట్లు ఎటువంటి మినహాయింపు లేకుండా నిలబెట్టుకుంటున్నారు; ప్రతిపక్షాలు కన్నెర్ర జేస్తున్నాయి గానీ మోదీ వాటిని ఇప్పటికే లేవలేని విధంగా చితగ్గొట్టేశారు కదా; ఇక మీడియా అమిత వినయ విధేయతలతో ప్రధానమంత్రికి జేజేలు కొడుతోంది... ఈ పరిస్థితుల్లో జరుగుతున్న 18వ సార్వత్రిక ఎన్నికల్లో మోదీ పేరిట, అవును మోదీ పేరిట మాత్రమే ప్రభుత్వ అనుకూల తిరుగులేని ప్రజాతీర్పుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. ఇదొక తెలివైన వ్యూహం. స్వల్పకాలికంగా ఇది, చీలిపోయిన, ధైర్యం కోల్పోయిన, నిరుత్సాహంలో ఉన్న ప్రతి పక్షంతో పోటీపడుతున్న బీజేపీకి గొప్ప లబ్ధి సమకూర్చే వ్యూహం, సందేహం లేదు. అయితే దీర్ఘ కాలంలో అదొక అనివార్య ప్రశ్నను హఠాత్తుగా మన ముందుకు తెస్తుంది: 'మోదీ తరువాత, ఎవరు?'

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

దేశాభివృద్ధికి దిక్సూచి... కాంగ్రెస్ మేనిఫెస్టో

గత దశాబ్దకాలంగా మోదీ పాలనలో ఆదాయ అసమానతలు పెరిగిపోయాయి. దేశవ్యాప్తంగా పేదరికం, నిరుద్యోగం, ఉపాధి కొరత, ధరల పెరుగుదల తీవ్రంగా ఉన్నాయి. దేశంలో దశాబ్దకాలంలో ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం బలంగా వృద్ధి చెందింది. దీనిలో భాగంగా దేశ సహజ వనరులు, సంపద, భూమి, ఇంధన వనరులు, గనులు, రేవులు అభివృద్ధి పేరిట దేశంలోని అతికొద్ది మంది పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయడంతో సంపద కేంద్రీకృతం అయి ఆదాయ అసమానతలు పెరిగాయి. 43 ఆశ్రిత పెట్టుబడిదారీ దేశాల్లో భారత్ 10వ స్థానంలో ఉంది. ప్రపంచంలో అధిక పేదలున్న భారత్– కోటీశ్వరుల సంఖ్యలో 3వ స్థానంలో ఉంది. ముఖ్యంగా 2014–2023 మధ్య కాలంలో బీజేపీ ప్రభుత్వం అనుసరించిన విధానాలు దేశంలో తీవ్ర ఆదాయ అసమానతలకు, సంపద కేంద్రీకరణకు ప్రధాన కారణం. దేశ జనాభాలో ఒక శాతం ధనికుల వద్ద 40 శాతం సంపద కేంద్రీకృతం అయినట్లు ఇటీవల పారిస్‌కు చెందిన వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ నివేదిక తెలిపింది. దీని ప్రకారం భారతదేశం ప్రపంచంలోనే ఒక తీవ్ర ఆదాయ అసమానతలకు కేంద్రంగా మారిందని చెప్పవచ్చు.

ఈ నేపథ్యంలో 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పి.చిదంబరం ఆధ్వర్యంలో 'న్యాయపత్రం' పేరిట మేనిఫెస్టోను విడుదల చేసింది. 'పంచన్యాయ్'లో భాగంగా సమన్యాయం, రైతులు, కార్మికులు, యువకులు, మహిళలకు దేశవ్యాప్తంగా 'మార్పు కోసం హస్తం' అనే నినాదంతో దీన్ని తయారుచేశారు. సోనియా, రాహుల్, మల్లిఖార్జున్ ఖర్గే వంటి అగ్రనేతలు దీనిని ఢిల్లీలో విడుదల చేశారు. తెలంగాణలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ– ప్రజల ముంగిట్లోకి జాతీయ మేనిఫెస్టో కమిటీ దీనిని తీసుకువచ్చాయి. కాంగ్రెస్ పార్టీ సహజ లక్షణమైన అన్ని వర్గాల అభివృద్ధిని ఆకాంక్షించే సమ్మిళిత వృద్ధి సూత్రం ఆధారంగా ఇది రూపొందింది. అందరికీ దేశ ఆర్థిక, భౌగోళిక, సహజ వనరుల సంపద, ఆర్థిక ఫలాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలు, నిరుద్యోగులు మొదలైన వారికి అభివృద్ధి ఫలాల్లో న్యాయమైన, సమాన వాటా పొందినపుడు దేశం నిజమైన అభివృద్ధి సాధిస్తుంది. ఈ లక్ష్యంతో దేశంలో ఉపాధి కల్పన, సంపద సృష్టి, సంక్షేమం, అభిలషణీయ వనరుల వినియోగం వంటి సూత్రాల ఆధారంగా దేశ సమగ్ర అభివృద్ధికి దోహదం చేయడానికి ఈ మేనిఫెస్టో ఐదు న్యాయాల్లో భాగంగా 25 గ్యారంటీలు అందించింది. ఆ ఐదు న్యాయాల్లో ప్రధానంగా–



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలు, నిరుద్యోగులు మొదలైన వారు అభివృద్ధి ఫలాల్లో న్యాయమైన, సమాన వాటా పొందినపుడు దేశం నిజమైన అభివృద్ధి సాధిస్తుంది. ఈ లక్ష్యంతో దేశంలో ఉపాధి కల్పన, సంపద సృష్టి, సంక్షేమం, వనరుల సద్వినియోగం వంటి సూత్రాల ఆధారంగా దేశ సమగ్ర అభివృద్ధికి దోహదం చేయడానికి కాంగ్రెస్ తన మేనిఫెస్టో ఐదు న్యాయాల్లో భాగంగా 25 గ్యారంటీలు అందించింది.

దేశ ప్రజలకు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు వంటి వారికి సమన్యాయం అందించడానికి దోహదం చేసే జనగణన, 50 శాతానికి మించి రిజర్వేషన్లు అందించడం; ఎస్సీ, ఎస్టీలకు ఉప ప్రణాళిక; గిరిజనులకు భూమిపై హక్కు కల్పించటం ద్వారా అందరికీ దేశ సంపద సమాన పంపిణీ జరిగేట్లు చూస్తుంది.

దేశంలో ప్రధాన రంగం అయిన వ్యవసాయం తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఎదుర్కొంటోంది. వ్యవసాయ సంక్షోభం తప్పించడానికి ప్రధానంగా పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించటం, రైతులకు రుణ మాఫీకోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు; పంటల బీమా పథకం మరింతగా అభివృద్ధి చేయటం ద్వారా వ్యవసాయ రంగం ఎగుమతుల్లో వృద్ధి ప్రధాన లక్ష్యంగా ప్రకటించింది.

కార్మికుల ఆరోగ్య, సామాజిక భద్రతలో భాగంగా కార్మికులకు ఆరోగ్య హక్కు చట్టం; అసంఘటిత రంగ కార్మికులకు ప్రమాద బీమా వర్తింపు మరో ముఖ్యమైన హామీ. కనీస వేతనాలను రోజుకు రూ. 400లకు పెంచడం, ఉపాధి హామీ చట్టాన్ని పట్టణ ప్రాంతాలకు వర్తింప చేయడంతో పాటు కాంట్రాక్టు ఉద్యోగ వ్యవస్థ రద్దు ద్వారా కార్మికులకు ఉద్యోగ భద్రతను అందించాలనే ప్రయత్నం చేసింది. భారతదేశం మానవ వనరులకు నిలయం. వీటిని సద్వినియోగం చేయటం ద్వారా దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి, ఉద్యమదారిత్వానికి, సాంకేతిక అభివృద్ధి, నైపుణ్యాలు పెంచడం ద్వారా యువకులను అభివృద్ధి చేస్తామని ప్రకటించింది. దీనిలో భాగంగా కేంద్రంలో 30 లక్షల ఉద్యోగాల భర్తీ, అప్రెంటిస్ శిక్షణ, పరీక్షా పత్రాల లీకేజీ నివారణ, ఐదువేల కోట్ల రూపాయలతో స్టార్టప్‌ల స్థాపనకు యువతకు ప్రోత్సాహం కల్పించటం ద్వారా యువ అభివృద్ధికి గ్యారంటీని కల్పించింది.

మహిళా న్యాయంలో భాగంగా కేంద్ర ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం; సంవత్సరానికి ఒక లక్ష రూపాయలు మహిళలకు అందించటం; మహిళా ఉద్యోగులకు హాస్టల్స్ సంఖ్య రెట్టింపు; మహిళా హక్కుల సాధన, మహిళల అభివృద్ధి, సాధికారత, చైతన్యం పెంపునకు మేనిఫెస్టో ప్రాధాన్యత ఇచ్చింది.

అంతేకాక కాంగ్రెస్ పార్టీ అనేక ఇతర వాగ్దానాలు చేసింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటానికి ఈడబ్ల్యూఎస్ కోటా అన్ని వర్గాలకు అందివ్వటం, జమిలి ఎన్నికల తిరస్కరణ; జమ్ము కాశ్మీర్, పుదుచ్చేరీలకు రాష్ట్ర స్థాయి హోదా ఇవ్వటం. అలాగే నూతన విద్యావిధానాన్ని సమీక్షించటం, రూ.25 లక్షల వరకు నగదు రహిత బీమా అమలుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. అగ్నిపథ పథకం రద్దు, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలుచేయడం ద్వారా వ్యవసాయ వృద్ధి; నేషనల్ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు వంటి ఇతర ముఖ్య హామీలు ఇచ్చింది. తద్వారా దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదం చేస్తామని గ్యారంటీల అమలు ద్వారా సమాజంలో భాజపా పాలనలో అన్ని రంగాల్లో జరిగిన విధ్వంసాన్ని తొలగించి పేదలు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళల జీవితాల్లో వెలుగురేఖలు తెస్తామని ప్రకటించింది.

ఠాగూర్ 'గీతాంజలి'లోని ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో... ఎక్కడ సగర్వంగా తలెత్తుకుని ఉండగలమో... అంటూ సాగే వాక్యాలను నిజం చేయడానికి కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రస్తావించింది. తద్వారా దేశ గౌరవం, సాధికారిత పెంపునకు కంకణబద్ధులయింది.

■ డా. రియాజ్
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి

ఎలాంటి కాలమిది?

"వెల్లివిరిసిన విజ్ఞానం
బ్రహ్మజెముడులా అజ్ఞానం
భక్తివిశ్వాసాల పరమ పరిధవం...
అంధాంధ తమసాల అవ్యక్తనిశీథం...
నైరాశ్యపు చలిగుబుళ్ల ఈచుకున్న శశిరాస్యం"*

మరి ఇది ఒక 'వైభవోజ్వల మహాయుగమా?
'వల్లకాటికి' దారితీస్తున్న అధ్వానశకమా?

అవినీతి పరుగుపందెంలో
ఒకరిని మించి ఒకరి ఎత్తుగడల పోటీ
గెలిచినా ఓడినా విన్నర్స్ రన్నర్స్‌గా
చివరికి లబ్ధిపొందడం ఖాయం!

ఎన్నికల రేసులో
నియమ నిబంధనలన్నీ
పాటించేవాడికే పరిమితం,
కుల మత ధన చక్రవ్యూహంలో
చక్రం తిప్పేవాడే విజేత

ధర్మాధర్మాల వ్యాఖ్యానాల
పరిహాస పర్వంలో
అన్యాయపురేఖలు గీస్తున్నవాళ్లు
వక్రీకరణ చరిత్రతో అబద్ధాలతో
భ్రమయుగంలోకి ఈడ్చుకెడుతున్నవాళ్లు

ఇంతకు ఎలాంటి కాలమిది?
ఎవరికి మేలైన కాలమిది?
ఆశ్రితపక్షపాతం కుటుంబాల పాలనలో
వారసత్వ రాజ్యతంత్రంగా
పౌరస్వేచ్ఛను కాలరాస్తున్న కాలాన
ఎక్కడికక్కడ మూలాల్ని వెతుకుతూ
హక్కుల కోసం రక్తమోడుతున్న కాలమిది!!

– నిఖిలేశ్వర్

*(తెన్నేటి సూరి అనువాద నవల 'రెండు మహానగరాలు' ప్రారంభ పంక్తులను గుర్తు చేస్తూ)

'ఇండియా'కు ఆరంభ అనుకూలతలు

ప ద్దెనిమిదవ సార్వత్రిక ఎన్నికల ఆరంభ దశలో ప్రతిపక్ష ఇండియా కూటమికి అనేక అనుకూలతలు ఉన్నాయి. వాటి నుంచి అది ప్రయోజనం పొందనున్నది. దేశంలోని దాదాపు ఐదో వంతు నియోజకవర్గాలలో పోలింగ్ మొదటి దశలోనే జరగనుండడమే అందుకు కారణంగా చెప్పవచ్చు. తొలుతనే ఆధిక్యతను సమకూర్చుకునేందుకు వివిధ అనుకూలతలు 'ఇండియా'కు ఒక అవకాశాన్ని కల్పించనున్నాయి.

మూడు అంశాలు సంయుక్తంగా 'ఇండియా'కు ఈ అవకాశాన్ని కల్పిస్తున్నాయి. తొలిదశ పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలలో ఎన్‌డీఏ, 'ఇండియా'లు 2019 సార్వత్రిక ఎన్నికలలో ఇంచుమించు సమానస్థాయిలో సీట్లు సాధించుకున్నాయి. ప్రస్తుత రాజకీయ పొత్తుల ప్రాతిపదికన చూస్తే తొలిదశ పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలలో గత పర్యాయం ఎన్‌డీఏ, 'ఇండియా' చెరి 49 సీట్లను గెలుచుకున్నాయి. మిగతా ఆరు దశలలోను ఎన్‌డీఏకే స్పష్టమైన అనుకూలత ఉన్నది. అయితే తొలి దశ పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలలో ఉభయ కూటములకు విజయావకాశాలు సమస్థాయిలో ఉండడం గమనార్హమైన విశేషం.

2019 అనంతర పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తే ఈ సమతుల్యత 'ఇండియా'కు అనుకూలంగా మొగ్గుతుంది. ఇండియా కూటమి 55 స్థానాల్లో ఆధిక్యతలో ఉన్నదని, ఎన్‌డీఏ 42 స్థానాలలో మాత్రమే ముందంజలో ఉన్నదని విశదమవుతుంది. తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్‌లలో 'ఇండియా' భాగస్వామ్య పక్షాలు కొంత మేరకు విజయావకాశాలను కోల్పోయినప్పటికీ అవి రాజస్థాన్‌లో తొమ్మిది, మధ్యప్రదేశ్‌లో రెండు లోక్‌సభ నియోజకవర్గాలలోను లబ్ధి పొందగలవని తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

ఇది కేవలం గణాంక సంభావ్యత మాత్రమే కాదు, శుక్రవారం నాడు పోలింగ్ జరగనున్న కొన్ని ప్రాంతాలలో ఇండియా కూటమికి రాజకీయ అవకాశాలు మెరుగుపడనున్నాయి. జాట్, గుజ్జర్, మీనా తదితర వ్యవసాయక కులాల జనాభా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్న రాజస్థాన్ ఉత్తర, తూర్పు ప్రాంతాలు ఆ రాష్ట్రంలో రైతు ఉద్యమానికి గుండెకాయ వంటివి. ప్రస్తుత ఎన్నికలలో సీపీఎం, రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నది. ఈ పొత్తు వల్ల భారతీయ జనతా పార్టీకి నష్టం వాటిల్లే అవకాశం ఎంతైనా ఉన్నది. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే ఈ తొలిదశ పోలింగ్ శాతం రెండో దశ పోలింగ్‌పై ప్రభావం చూపనున్నది.

ఉత్తరప్రదేశ్‌లో తొలిదశలో వాయవ్య ప్రాంతంలోని ఎనిమిది నియోజకవర్గాలలో పోలింగ్ జరగనున్నది. ఆ ప్రాంతంలో ముస్లిం ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. ఈ కారణంగా సమాజ్‌వాది పార్టీ ఈ నియోజకవర్గాలలో మెరుగైన ఫలితాలను సాధించే అవకాశమున్నది. రైతుల ఉద్యమం కూడ ఈ ప్రాంత ప్రజలను బాగా ప్రభావితం చేసింది.

మహారాష్ట్రలో విదర్భ ప్రాంతం వలే మధ్యప్రదేశ్‌లో మహాకోశల్ ప్రాంతం ఇప్పటికీ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్నది. ఉత్తరాది, పశ్చిమ రాష్ట్రాలలో బీజేపీ జైత్రయాత్రను అడ్డుకునేందుకు విదర్భ, మహాకోశల్ ప్రాంతాలు 'ఇండియా' కూటమికి ముఖ్యంగా కాంగ్రెస్‌కు ఒక మంచి అవకాశాన్ని సమకూర్చనున్నాయి. ఎగువ అసోంలోని అన్ని నియోజకవర్గాలకు, ఉత్తర బెంగాల్‌లోని మూడు స్థానాలకు నేడు పోలింగ్ జరగనున్నది. ఈ నియోజకవర్గాలు అన్నిటినీ 2019లో బీజేపీ గెలుచుకున్నది. బీజేపీ వాటిని ఈసారి మళ్లీ గెలుచుకోలేకపోవచ్చు. అయితే అసోం, బెంగాల్ రాష్ట్రాలలో బీజేపీతో దీటుగా తలపడేందుకు ప్రతిపక్ష కూటమి ఈ స్థానాలను గెలుచుకోవలసి ఉన్నది. ఈశాన్య భారతంలోని పర్వత ప్రాంతాల రాష్ట్రాలు అన్నిటిలోను ఒకటి రెండు చోట్ల మినహా అన్ని నియోజకవర్గాలలోను నేడు పోలింగ్ జరగనున్నది. ఈ రాష్ట్రాల్లో బీజేపీ నేతృత్వంలోని కూటమి ప్రాబల్యాన్ని మణిపూర్ మహా విషాదం ప్రతికూలంగా ప్రభావితం చేసే అవకాశం లేదన్నది పరిశీలకుల అభిప్రాయంగా ఉన్నది.

బీజేపీ తన సిట్టింగ్ ఎంపీలలో సగం మందికి పైగా మళ్లీ టిక్కెట్లు ఇవ్వకపోవడం 'ఇండియా' కూటమికి మరొక విజయావకాశాన్ని సమకూర్చనున్నది. రాజస్థాన్‌లో తన 11 మంది ఎంపీలలో తొమ్మిది మందికి మళ్లీ టిక్కెట్లు ఇచ్చేందుకు బీజేపీ నిరాకరించింది. అధికార పార్టీ అభ్యర్థిత్వాన్ని పొందలేకపోయిన ఆ తొమ్మిదిమందీ నాయకత్వంపై తిరుగుబాటు చేశారు. 'ఇండియా' కూటమి తన 48 మంది ఎంపీలలో 28 మందిని మళ్లీ పోటీకి నిలబెట్టింది. తమిళనాడులో తన 38 మంది సిట్టింగ్ ఎంపీలలో 18 మందిని మార్చి వేసింది.



■ యోగేంద్ర యాదవ్

ఉత్తరాదిన ఇండియా కూటమికి 2019 అనంతర అసెంబ్లీ ఎన్నికలలో లభించిన ఆధిక్యతలు ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలలో విజయావకాశాలుగా మారనున్నాయి. దక్షిణాదిన 2019లో ఈ కూటమి తాను గెలుచుకున్న సీట్లను విజయవంతంగా రక్షించుకుంటున్నది. అంతేకాకుండా తొలి దశలోనే ఆ సంఖ్యా బలానికి అదనంగా 10 నుంచి 15 సీట్లను చేర్చుకునే అవకాశమున్నది.



క్లుప్తంగా చెప్పాలంటే ఉత్తరాదిన ఇండియా కూటమికి 2019 అనంతర అసెంబ్లీ ఎన్నికలలో లభించిన ఆధిక్యతలు ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలలో దానికి విజయావకాశాలుగా మారనున్నాయి. దక్షిణాదిన 2019లో ఈ కూటమి తాను గెలుచుకున్న సీట్లను విజయవంతంగా రక్షించుకుంటున్నది. అంతేకాకుండా తొలి దశలోనే ఆ సంఖ్యా బలానికి అదనంగా 10 నుంచి 15 సీట్లను చేర్చుకునే అవకాశమున్నది. అయితే రాజకీయ అవకాశాలు అంత తేలిగ్గా సమకూరుతాయా? అందునా మోదీ– అమిత్ షా నేతృత్వంలోని బీజేపీ ప్రత్యర్థిగా ఉన్న పరిస్థితులలో అది మరీ కష్టం. ఇండియా కూటమి తొలిదశలోనూ చాలా సవాళ్లను అధిగమించవలసి ఉన్నది.

తమిళనాడులో తనకు ఉన్న స్థానాలు అన్నిటినీ నిలబెట్టుకోవడం 'ఇండియా'కు ప్రథమ, అత్యంత ముఖ్యమైన సవాల్. సిట్టింగ్ ఎంపీలలో కొంత మందికి టిక్కెట్ నిరాకరించడం, మరికొంతమంది నియోజకవర్గాలను మార్చడం ఆ సవాల్‌ను అంగీకరించడమేనని చెప్పవచ్చు. ప్రస్తుత దశలో ఇండియాకు ప్రధాన ప్రత్యర్థి ఎన్‌డీఏ కాకుండా బలహీనపడిన అన్నాడీఎంకే అవడం గమనార్హం. బీజేపీ ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఎన్‌డీఏకు ప్రజల మద్దతును సమీకరించలేకపోయింది. ఫలితంగా తమిళనాడులో ఎన్‌డీఏ ఇప్పటికే ఒక బలహీన కూటమిగా ఉన్నది. భాగస్వామ్య పక్షమైన పీఎంకేకు రాష్ట్రవ్యాప్తంగా చెప్పుకోదగిన శక్తి లేదు. మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం, దినకరన్ ఉన్నప్పటికీ ఎన్‌డీఏ ప్రాబల్యం పెరగలేదు. అయితే బీజేపీ ప్రచార ఉద్ధృతి మూలంగా ఎన్‌డీఏ ఓట్ల వాటా పెరిగే అవకాశమున్నది. అంతేకాకుండా దీర్ఘ కాలంలో రాష్ట్ర రాజకీయాల్లో ఒక ప్రముఖ శక్తిగా ఎన్‌డీఏ ఆవిర్భవించవచ్చు. అన్నాడీఎంకే– బీజేపీ కూటమి విచ్ఛిన్నమవడం వల్లే తమిళనాడులో త్రిముఖ పోటీలు జరుగుతున్నాయి. డీఎంకే వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా బీజేపీ, దాని మిత్రపక్షాలు ఇండియా కూటమికి తోడ్పడవచ్చని భావిస్తున్నారు.

తమిళనాడుతో పాటు కాంగ్రెస్, బీజేపీల మధ్య ముఖాముఖి పోటీ జరగనున్న 45 నియోజకవర్గాలలో ఎన్‌డీఏకు తీవ్ర సవాళ్లు ఎదురుకానున్నాయి. వాటిలో 36 స్థానాలలో గత సార్వత్రిక ఎన్నికలలో కూడా కాంగ్రెస్–బీజేపీ మధ్య ముఖాముఖి పోటీ జరిగింది. బీజేపీ 30 స్థానాలను గెలుచుకున్నది. ఈ తొలి దశలో ఇండియా మెరుగైన ఫలితాలను సాధించాలంటే రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, అసోంలో అత్యధిక స్థానాలను గెలుచుకోవలసి ఉన్నది.

2019లో బొటాబొటి మెజారిటీతో గెలుచుకున్న సీట్లు అన్నిటినీ కూడా ఇండియా మళ్లీ గెలుచుకోవలసి ఉన్నది. అటువంటి సీట్లు ఇండియాకు ఏడు ఉండగా, ఎన్‌డీఏకు ఐదు ఉన్నాయి. ఈ విషయంలో ప్రతిపక్ష కూటమి పరిస్థితి మెరుగ్గా ఉన్నది. ఇండియా కూటమి కొన్ని అంతర్గత, బాహ్య సవాళ్లను కూడ అధిగమించవలసి ఉన్నది. 14 సీట్లలో ఇండియా భాగస్వామ్యపక్షాలు పరస్పరం పోటీ చేస్తున్నాయి! పశ్చిమ బెంగాల్‌లో 3, లక్షదీవులులోని ఏకైక నియోజకవర్గం, అసోంలో మూడు స్థానాలలో ఇండియా భాగస్వామ్య పక్షాలు పరస్పర ప్రత్యర్థులుగా ఉన్నాయి. సరే, ఇండియా వెలుపల ఉన్న కొన్ని చిన్న పార్టీలు సైతం ఈ ప్రతిపక్ష కూటమికి నష్టం చేసే అవకాశమున్నది. తొలిదశ పోలింగ్ జరగనున్న 86 నియోజకవర్గాలలో బీఎస్‌పీ పోటీ చేస్తోంది. ఈ పార్టీ ఓట్ల వాటా ప్రతి ఎన్నికలలోనూ తగ్గుతూ వస్తోంది అయినా యూపీ, ఉత్తరాఖండ్‌లలో ఇండియా విజయావకాశాలను ఈ పార్టీ దెబ్బ తీసే ప్రమాదమున్నది. ప్రకాశ్ అంబేడ్కర్ నాయకత్వంలోని వంచిత్ బహుజన్ అఘాడి 2019లో వలే బలంగా లేకపోవచ్చు గానీ విదర్భ ప్రాంతంలో ఇండియా కూటమి ఓట్లను ఈ పార్టీ కొల్లగొట్టే అవకాశమున్నది. రాష్ట్రీయ లోక్‌దళ్ అధ్యక్షుడు జయంత్ సింగ్ బీజేపీతో పొత్తు పెట్టుకోవడాన్ని ఆయన మద్దతుదారులైన జాట్‌లు, ముస్లిం ఓటర్లు హర్షించడం లేదు. అయినప్పటికీ ఆయన రాజకీయం ఇండియా కూటమి ప్రభావాన్ని తగ్గించే అవకాశమున్నది.

ఎన్నికల ప్రచారంలో గతంలో వలే ఆనందోత్సాహాలు కన్పించడం లేదు. ఎన్నికల ఉష్ణోగ్రత చాలా తక్కువగా ఉన్నది. పోలింగ్‌లో పాల్గొనే ఓటర్ల శాతం తక్కువగా ఉండవచ్చనేందుకు ఇది సూచనా? తొలిదశ పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలలో 2019లో 69.9 శాతం పోలింగ్ జరిగింది. జాతీయ సగటు కంటే రెండు పాయింట్లు అధికం. ముఖ్యంగా తమిళనాడు వెలుపల రాష్ట్రాలలో సగటు కంటే తక్కువ పోలింగ్ శాతం ఒక విస్మృత పోలింగ్ రీతిని సూచించవచ్చు. ఎన్నికల తొలి దశలో పోలింగ్ శాతాలు 18వ సార్వత్రిక ఎన్నికలలో ప్రజల మనస్థితిని తెలియజేసే తొలి సూచన అవుతాయి.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)



ఆట మొదలైంది

'లోక్‌సభ' పోరులో గెలుపే లక్ష్యంగా పార్టీల వ్యూహాలు

- శ్రేణులు, నాయకుల సమన్వయంపై కాంగ్రెస్ ఫోకస్
- నేడు మహబూబాబాద్‌లో, 24న వరంగల్‌లో సీఎం రేవంత్ సభలు
- బూత్ స్థాయి కేడర్‌పై బీజేపీ దృష్టి
- కంచుకోటను కాపాడుకునే ప్రయత్నంలో గులాబీ పార్టీ
- నియోజకవర్గాల బాధ్యతలు ఎమ్మెల్సీలు, సీనియర్లకు..
- ఓరుగల్లుపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల గురి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

నామినేషన్ల పర్వం మొదలైంది. పార్టీలు సమరానికి సై అంటున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచార పర్వంలోకి దిగడంతో పాటు ఓ వైపు కేడర్‌ను కలుస్తూ.. మరోవైపు ప్రజల్లోకి వెళ్తూ గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ క్రమంలోనే ఆయా పార్టీల అధినాయకత్వాలు కూడా తమ అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహాలకు పదను పెడుతున్నాయి. లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు ప్రత్యర్థి పార్టీల నుంచి శ్రేణుల చేరికల పై దృష్టి సారిస్తున్నాయి. రాష్ట్ర, జాతీయ నాయకులతో రోడ్ షోలు బహిరంగ సభలకు పార్టీలు ప్లాన్ చేస్తుండటంతో ఉమ్మడి వరంగల్ రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

కేడర్‌లోకి హస్తం నేతలు

ఉమ్మడి వరంగల్ జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టిన కాంగ్రెస్.. బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో పాగా వేసేందుకు వ్యూహరచన చేస్తోంది. 2014 నుంచి తమ చేతికి చిక్కని ఓరుగల్లులో పాగా వేయాలని ప్రణాళిక రచిస్తోంది. వరంగల్ లోక్‌సభ స్థానాన్ని గులాబీ పార్టీ నుంచి చేజిక్కించుకునేందుకు వలసలపై దృష్టి పెట్టింది. సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావులతో పాటు 20మందికి పైగా కార్పొరేటర్లు, ముగ్గురు మున్సిపల్ చైర్మన్లను బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేర్చుకున్నారు. అంతేగాకుండా స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లో చేర్చుకుని ఆయన కుమార్తె కడియం కావ్యకు ఎంపీ టికెట్ ఇచ్చింది. దీంతో కడియం శ్రీహరి తన కూతురు కావ్యతో కలిసి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ముఖ్య నాయకులను కలిసి తమ గెలుపునకు సహకరించాలని కోరుతూనే నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాజకీయాలకు కొత్త అయిన కడియం కావ్యను కేడర్‌లోకి తీసుకెళ్తూ జోష్ నింపుతున్నారు. కావ్య ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేయడంతో పాటు సాయంత్రం 4గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే మడికొండ బహిరంగ సభ ద్వారా సత్తా చాటాలని కాంగ్రెస్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. అలాగే మహబూబాబాద్ లోక్‌సభ నుంచి పోటీ చేస్తున్న బలరాంనాయక్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇప్పటికే లోక్‌సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించిన బలరాం నాయక్.. శుక్రవారం ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మహబూబాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఈ సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటుండటంతో శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు బలరాంనాయక్ ప్రయత్నిస్తున్నారు. అలాగే పార్టీ అధిష్ఠాం వరంగల్, మహబూబాబాద్ పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాలకు కో ఆర్డినేటర్లను నియమించింది. ఎప్పటికప్పుడు కో ఆర్డినేటర్లు ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతూ సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.

కేడర్‌పై బీజేపీ నజర్

వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాలపై బీజేపీ నజర్ పెట్టింది. 1984లో తొలిసారి బీజేపీ అభ్యర్థి చందుపట్ల జంగారెడ్డి అప్పటి హనుమకొండ స్థానం నుంచి విజయం సాధించారు. అప్పటి నుంచి పోటీ చేస్తున్న బీజేపీకి వరంగల్ సీటు అందని ద్రాక్షలా మారింది. అయితే 40ఏళ్లకు బీజేపీకి వరంగల్‌లో గెలుస్తామన్న ధీమాతో ఎన్నికల బరిలో దిగుతోంది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను పార్టీలో చేర్చుకుని టికెట్ ఇచ్చింది. మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగిన మాజీ ఎంపీ సీతారాంనాయక్ అన్ని నియోజకవర్గాల్లో ప్రచారానికి తిరుగుతున్నారు. ఈ రెండు చోట్ల బీజేపీకి ఉన్న సంస్థాగత బలంతో పాటు మోదీ గాలిలో విజయం సాధిస్తామన్న ధీమాతో ఆ పార్టీ ఉంది. దీంతో బూత్ స్థాయి కేడర్‌పై బీజేపీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రముఖులను నియమించింది. పార్టీలోని కీలక నేతలు ఐక్యతతో పని చేస్తుండటంతో పాటు అనుబంధ సంఘాలు చాపకింద నీరులా విస్తృత ప్రచారం చేస్తున్నాయి. ఇప్పటికే వరంగల్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమావేశాలు నిర్వహించి పార్టీ అభ్యర్థిని పరిచయం చేస్తూ ఈసారి వరంగల్‌లో

మిగతా 7వ పేజీలో..



అధికారులకు సూచనలు చేస్తున్న వరంగల్ కలెక్టర్, ఆర్వో ప్రావీణ్య

తొలి అంకం ప్రారంభం..

మొదలైన 'లోక్‌సభ' నామినేషన్ల పర్వం

- తొలి రోజు వరంగల్‌కు ముగ్గురు, మానుకోటకు ఒకరు దాఖలు
- రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద పటిష్ట బందోబస్తు

వరంగల్ కలెక్టరేట్/మహబూబాబాద్ (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి తొలిఅంకం ప్రారంభమైంది. గురువారం అధికారులు నోటిఫికేషన్‌ను విడుదల చేయడంతో.. నామినేషన్ల దాఖలు ప్రక్రియ షురూ అయ్యింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ (మానుకోట) స్థానాలకు సంబంధించి తొలిరోజు మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో వరంగల్ నియోజకవర్గానికి సంబంధించి ముగ్గురు, మానుకోటలో ఒకరు తమ నామపత్రాలను అందజేశారు. వరంగల్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య, మానుకోటలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. తొలిరోజు వరంగల్‌లో అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా అంబోజు బుద్దయ్య, స్వతంత్ర అభ్యర్థిగా బరిగెల శివ ఒక సెట్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థినిగా తౌటపల్లి నర్మద ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఇక మహబూబాబాద్ స్వతంత్ర అభ్యర్థిగా మరిపెడ మండలం ఎడ్జర్ల శివారు గుర్రపు తండాకు చెందిన బానోత్ లింగ్యానాయక్ తొలి నామినేషన్ వేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగగా.. రెండు నియోజకవర్గాల్లోనూ ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి నామినేషన్లు దాఖలు కాలేదు. ఆయా పార్టీల అభ్యర్థులు ముహూర్త బలాలు చూసుకుంటున్నారని, 19, 22, 24 తేదీల్లో దాఖలు చేయనున్నట్లు సమాచారం. నామినేషన్ల స్వీకరణకు గాను వరంగల్, మహబూబాబాద్ కలెక్టరేట్‌లలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం సమీపంలో 144సెక్షన్ అమలు చేశారు. వరంగల్‌లో నామినేషన్ల స్వీకరణకు ముందు ఏర్పాట్లను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు తగు సూచనలు చేశారు. నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి పొరపాట్లు జగరకుండా పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. మహబూబాబాద్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ నేతృత్వంలో సహాయ రిటర్నింగ్ అధికారులుగా అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావులు ఎన్నికల బాధ్యతలు నిర్వర్తించనున్నారు.



మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నేడు మానుకోటకు సీఎం

- 'జనజాతర' సభకు రానున్న రేవంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రిగా తొలిసారి రాక
- ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల పర్యవేక్షణలో ఏర్పాట్లు, జనసమీకరణ
- సిద్ధమైన మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం

మహబూబాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేసి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. అదే దూకుడుతో పార్లమెంట్ స్థానాలను హస్తగతం చేసుకునేందుకు పార్లమెంటు పోరుకు కాలుదువ్వుతోంది. ఈ క్రమంలో తొలి ఎన్నికల ప్రచార సభకు ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డినే రంగంలో దింపుతోంది. నోటిఫికేషన్ విడుదలవడం, నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడంతో.. రెండోరోజు శుక్రవారం ముహూర్తం ఖరారు చేసుకున్న మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యరి పోరిక బలరాంనాయక్ తన నామినేషన్ దాఖలు అనంతరం ఈ ఎన్నికల ప్రచారసభను నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో మహబూబా బాద్‌కు చేరుకొని, తర్వాత జనజాతర బహిరంగసభలో ప్రసంగించనున్నారు. ఇందుకోసం పార్టీ జిల్లా నాయకత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది.

సెంట్‌మెంట్‌గా మానుకోట..

మహబూబాబాద్ పార్లమెంట్ ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గ ఆవిర్భావ

మిగతా 7వ పేజీలో..

వివరాలు 7లో..

బిడ్డపై ఆరాటమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదు..



- ఉద్యకారులను జైలులో వేసిన ఘనత కడియం శ్రీహరిది..
- రాజీనామా చేయకుండా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నాడు..
- బీజేపీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు

అరూరి రమేశ్ చిన్న మెదడు చితికింది..



- రాజకీయాలను అడ్డం పెట్టుకొని భూకబ్జాలకు పాల్పడ్డాడు..
- ప్రతీ ఎకరాకు గోదావరి జలాలు తీసుకొస్తా..
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- వర్ధన్నపేటలో వరంగల్ లోక్‌సభ సన్నాహక సమావేశం

అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన
పూర్తి చేయండి

- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు పరిశీలన



వందఫీట్ల రోడ్డులో పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 18: బల్దియా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా వరంగల్ పోతననగర్‌లో చేపడుతున్న పనులను గురువారం సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తర్వాత అజర ఆస్పత్రి సమీపంలో జరుగుతున్న కల్వర్టు పనులు, అలంకార్ జంక్షన్, టీటీడీ జంక్షన్, నయీంనగర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఇంకా నయీంనగర్ నుంచి ప్రెసిడెన్సీ స్కూల్ వరకు నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్‌ను పరిశీలించారు. రాజాజీనగర్ వద్ద పాత కల్వర్టును కూల్చి కొత్తగా నిర్మిస్తున్న కట్టడాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జవహర్ నగర్, వడ్డెపల్లి జంక్షన్ల వద్ద జరుగుతున్న పనులను పూర్తి చేయాలని సూచించారు. కమిషనర్ వెంట ఈఈ ప్రవీణ్‌చంద్ర, సిటీ ప్లానర్ వెంకటేశ్వర్లు, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, టీపీఎస్ బషీర్, ఏఈలు హరికుమార్, విజయలక్ష్మి, స్మార్ట్‌సిటీ ప్రతినిధి ఆనంద్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలి

నగర పాలక సంస్థ పరిధిలో ఇటీవల 5 శాతం తగ్గించిన పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో రెవెన్యూ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 5 శాతం రిబేట్ పన్ను వసూళ్ల అంశాన్ని అధికారులు ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. కిందటేడు కంటే ఈ యేడు 10 శాతం ఎక్కువ మొత్తంగా పన్నులు వసూలు చేయాలని అన్నారు. గత సంవత్సరం రూ.17కోట్లు వసూలు జరిగాయని ఈ యేడు రూ.20కోట్లు టార్గెట్‌గా వసూలు చేయాలని ఆదేశించారు. ఈనెల 30 వరకు నిర్దిష్ట లక్ష్యాన్ని చేరుకోలేని రెవెన్యూ అధికారులకు నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరవుతున్న బిల్ కలెక్టర్‌లకు షోకాజు నోటీజులు జారీ చేయాలని ఆర్‌ఐలను ఆదేశించారు. ప్రజల్లో పన్ను వసూళ్లపై కరపత్రాలు పంపిణీ చేయాలని అన్నారు. పన్ను చెల్లింపులపై ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయితే వారిని గుర్తించి వారిపై పోలీసులు కేసులు నమోదు చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనిసుర్ రషీద్, డిప్యూటీ కమిషనర్‌లు రవీందర్, కృష్ణారెడ్డి, ఆర్‌వోలు సుదర్శన్, యూసుఫుద్దీన్, షహజాది బేగం, శ్రీనివాస్‌లతో పాటు ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి

- విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల నియంత్రణ కమిటీలు వేయాలి
- అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 18: జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణపై వివిధ శాఖల అధికారులతో గురువారం సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ.. విద్యాసంస్థల సమీపంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారని, అటువంటి విద్యాసంస్థలపై నిఘా ఉంచాలన్నారు. జిల్లాలోని విద్యాసంస్థలలో మత్తు పదార్థాల నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో గంజాయి, మత్తు పదార్థాలను నియంత్రించడంలో చర్యలు చేపట్టాలని, గత మార్చి నెలలో 72 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, ఇందుకు సంబంధించి నాలుగు కేసులను నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి, డీఈఓ డాక్టర్ అబ్దుల్‌హై, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోపాల్‌తోపాటు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఠారెత్తిస్తున్న ఎండలు

- వడగాలులతో ఉక్కిరి బిక్కిరి
- 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- రానున్న రెండు రోజులు మరింత త్రీవం

హనుమకొండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. మూడు నాలుగు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటింది. దీనికి వడగాలులు కూడా తోడయ్యాయి. దీంతో ఎండల తీవ్రత మరింత అధికమైంది. ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. గురువారం ఎండల త్రీవత మరింత పెరగింది. ములుగు జిల్లాలో అత్యధికంగా 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 43.3 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లాలో 42.1 డిగ్రీలు, హనుమకొండ జిల్లాలో 41.9 డిగ్రీలు, వరంగల్ జిల్లాలో 42.1 డిగ్రీలు, జనగామ జిల్లాలో 41.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిన్నటి ఉష్ణోగ్రతలతో పోల్చి చూస్తే గురువారం కాస్త తగ్గినట్టు కనిపిస్తోంది. బుధవారం ఉమ్మడి జిల్లాలో సరాసరి 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు అయింది. మహబూబాబాద్ జిల్లాలో 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదైన జిల్లాలో మహబూబాబాద్ రెండవ జిల్లాగా నిలిచింది. 44.8 డిగ్రీలతో నల్గొండ మొదటి స్థానంలో నిలిచింది.

రానున్న నాలుగు రోజుల్లో..

రానున్న నాలుగు రోజుల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండనున్నట్టు వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. రానున్న నాలుగు రోజుల్లో మహబూబాబాద్‌లో 42.2 డిగ్రీలు, ములుగులో 42.6 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 43 డిగ్రీలు హనుమకొండలో 42.3 డిగ్రీలు, జనగామలో 41.9 డిగ్రీలు, వరంగల్‌లో 42.6 డిగ్రీలు ఆపైన ఉష్ణోగ్రత రికార్డయ్యే అవకాశం ఉందని తెలిపారు. దీనితో పాటు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో తీవ్రంగా వడగాలులు వీచాయి. ఎండల తీవ్రత దృష్ట్యా వాతావరణ శాఖ అధికారులు ఎల్లో అలర్ట్‌ను జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎండల తీవ్రతకు ప్రజలు బయటకు రావాలంటేనే జంకే పరిస్థితి నెలకొన్నది. వడగాలులు వీస్తున్నందువల్ల ప్రజలు ఇళ్లలో ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వృద్ధులు, పిల్లలు, గర్భిణులు వడగాలుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అయితే ఠారెత్తిస్తున్న ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ద్రోణి రూపంలో చల్లటి కబురు అందింది. ద్రోణి ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో మంగళ, బుధవారం నుంచి తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

రేపు మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్ష

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 20న మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి భాషబోయిన సంతోష్ అన్నారు. గురువారం హనుమ కొండలోని కేడీసీలో మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్ష వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనం తరం సంతోష్ మాట్లాడుతూ... మోడల్ పరీక్షల వల్ల విద్యార్థుల్లో పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించి వాటి పట్ల అవగాహన కలుగుతుందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల ల్లో ఎప్‌సెట్, నీట్ కోచింగ్‌లను ఏర్పాటు చేయా లన్నారు.అకాడమీ లు, ప్రైవే టు జూనియర్ కళాశాలలు కోచింగ్‌ల పేరిట విద్యార్థుల నుంచి రూ.లక్షలు వసూల్ చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, నాయకులు అమరేందర్‌రెడ్డి, జి. సుజాత, ఎ.అవినాష్, చిట్యాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కేడీసీలో మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్ష వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కలెక్టరేట్ నుంచే పర్యవేక్షణ

● కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నంబర్ల ఏర్పాటు ● 24 గంటలు అందుబాటులో సిబ్బంది

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 18: జిల్లాలో ఎన్నికల పర్యవేక్షణ అంతా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచే సాగుతోంది. అధికార యంత్రాంగం అంతా ఎన్నికల విధుల్లో తలమునకలై ఉన్నారు. జిల్లాలో ఏ మూలకు ఏం జరిగినా ఇట్టే పసిగట్టి తగిన చర్యలు తీసుకునేందుకు కట్టుదిట్టమై ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దని ఇప్పటికే కలెక్టర్ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ప్రతీ ఒక్కరిని జాగు చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో నాయకులు ప్రచారంపై దృష్టి సారించారు. ఈ సమయంలో పౌరులతోపాటు నాయకులకు పలు సందేహాలు వస్తుంటా యి. ఎన్నికల ప్రవర్తన నియమావళి, అతిక్రమణలపై ఫిర్యాదు చేసేందుకు ఎవరికి సంప్రదించాలో తెలియక ఆందోళన చెందుతుంటారు. ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగం సందేహాల నివృత్తి, ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి పెట్టింది. ఓటరు జాబితాలో తమ పేరు ఉందా లేదో తెలుసుకోవాలన్నా, సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రలోభాలకు గురి చేసినా, ఓట్లు దండుకోవడానికి డబ్బు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేస్తున్నా, ప్రచార సమయంలో గొడవలు తలెత్తే అవకాశం ఉన్నా టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేస్తే నిమిషాల వ్యవధిలోనే సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలిస్తారు. అక్కడి పరిస్థితులను బట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఎలాంటి ఫిర్యాదులైనా టోల్ ఫ్రీ నెంబర్ 1950కు ఫిర్యాదు చేసే అవకాశాన్ని కల్పించారు.



సి విజిల్‌పై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన బ్యానర్

ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు

ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో అధికారులు టోల్‌ఫ్రీ నెంబరు అందుబాటులోకి తెచ్చి సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఎక్కువశాతం ఓటర్ల జాబితాకు సంబంధించి ఫిర్యాదులను వస్తున్నట్లు తెలుస్తోంది. ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుం టున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే రాజకీయ పార్టీల నాయకులు ఒకరిని మించి మరొకరు ఎత్తుగడలు వేసే అవకాశం ఉంది. అప్పటి నుంచి ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకోవడం షరా మామూలే. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమణ, మద్యం, నగదుతోపాటు వివిధ రకాల బహుమతులు, కానుకలు అందించే అవకాశాలు ఉంటాయి. దీంతో ఫిర్యాదులు సైతం పెరుగుతాయి. ప్రచార సందర్భాల్లో గొడవలు, దాడులు చోటు చేసుకునే సందర్భాల్లో ఫిర్యాదులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి సందర్భాల్లో టోల్ ఫ్రీ నెంబరు 1950కు ఫోన్ చేస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందజేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

24 గంటలు అందుబాటులో

ఎన్నికల సమయంలో ఫిర్యాదులను స్వీకరించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు. అధికారులు షిప్టుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. ఏ సమయంలోనైనా ఫిర్యాదు స్వీకరించేందుకు సిద్ధంగా ఉంటున్నారు. కంట్రోల్ రూం టోల్‌ఫ్రీ నెంబర్ 1950, జిల్లా సమాచార కేంద్రం నెంబర్ 0870-2530811, వాట్సాప్ నెంబర్ 91542 52936లకు ఫిర్యాదు చేస్తే సకాలంలో చర్యలు తీసుకోనున్నారు. వచ్చిన ప్రతీ ఫిర్యాదును నమోదు చేయడం జరుగుతుంది. ఫిర్యాదు చేసి వ్యక్తి పేరు, ఫోన్ నెంబరు, అడ్రస్‌తోపాటు వారి వచ్చిన సందేహం, ఫిర్యాదును నమోదు చేసుకుంటారు.

సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు..

ఫిర్యాదు చేసిన 5 నిమిషాల్లోనే జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలోని మానిటరింగ్ సెల్‌కు చేరుతుంది. అక్కడ నుంచి ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు చేరుతుంది. వారు 15 నిమిషాల్లో క్షేత్రస్థాయి విచారణ చేస్తారు. ఆ నివేదిక 30 నిమిషాల్లో రిటర్నింగ్ అధికారికి వెళ్లేలా ఏర్పాటు చేశారు. సి-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై 100 నిమిషాల్లో సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని అధికారులు తెలుపుతున్నారు. లైవ్ ఫొటోలు, వీడియోలను తీసేటప్పుడు, అప్‌లోడ్ చేసే సమయంలో జీపీఎస్ ఆన్‌లో ఉంచడంతో జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ ద్వారా ఆటోమెటిగ్గా లొకేషన్ నమోదు అవుతుంది. అక్రమంగా మద్యం, డబ్బులు, బహుమతుల పంపిణీ, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించినా, ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన లైవ్ ఫొటోలు, వీడియోలతో సి-విజిల్ యాప్ ద్వారా పంపవచ్చు. సి-విజిల్ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.


మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

మీడియా సెంటర్ ఏర్పాటు

శాసనసభ ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు అందించేందుకు కలెక్టరేట్‌లో మీడియా సర్టిఫికేషన్ అండ్, మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ) మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచారం వ్యయంలో లెక్కించడం జరుగుతుంది. వార్త పత్రికలు, ఈ పేపర్‌లు, టెలివిజన్ చాలన్స్, స్థానిక కేబుల్ నెట్‌వర్క్స్, సోషల్ మీడియా, ఎస్ఎంఎస్‌లు ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాల్సి ఉంటుంది. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడంలో మీడియా పాత్ర కీలకం కావడంతో మీడియా సెంటర్ ఏర్పాటు చేశారు.

ఇంటి నుంచే నామినేషన్లు

వరంగల్ సిటీ, ఏప్రిల్ 18: ఎన్నికల ప్రక్రియలో రోజు రోజుకూ సాంకేతిక పరిజ్ఞానం తోడవుతోంది. ఇంటి వద్ద నుంచే సులువుగా ఓటు నమోదు చేసుకోవడం, చిరునామా మార్పు, పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకోవడం, ఎన్నికల నిబంధనల ఉలంఘన జరుగుతుంటే వాటిపై ఫిర్యాదులు చేయడం లాంటి వెసులుబా టు ఉంది. ఇక ప్రస్తుతం నామినేషన్లను ఇళ్ల వద్ద నుంచే దాఖలు చేసే అవకాశం కూడా ఎన్నికల సంఘం కల్పిస్తోంది. ఎన్నికల రిటర్నింగ్ కేంద్రాలకు వెళ్లకుండానే అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు దాఖలు చేసేందుకు ప్రత్యేక యాప్‌లను సిద్ధం చేసింది. అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు మద్దతుదారులతో కలిసి ర్యాలీగా వెళ్లడం, ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకోవడం లాంటి ఖర్చుతో కూడుకున్న వాటిని తగ్గించేందుకు ప్రత్యేకంగా సువిధ యాప్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది.



సువిధ యాప్

దాఖలు ఇలా...

గురువారం ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ఈనెల 25 వరకు కొనసాగనుంది. వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలనుకునే వారు వరంగల్, మహబూబాబాద్ కలెక్టరేట్లకు వెళ్లాల్సిందే. ఈ క్రమంలో కొందరికి దూరం భారంగా మారుతోంది. అలాంటివారు సువిధ యాప్‌లో నామినేషన్ పత్రాలను దాఖలు చేయవచ్చు. అయితే ఎన్నికల కమిషన్ సూచించిన పత్రాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఆస్తులు, అఫిడవిట్ పత్రాలు, బలపరిచే వారి వివరాలను నమోదు చేయాలి. వీటికి కావాల్సిన పత్రాలు అందజేసిన తర్వాత నిర్ణీత సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాలి. ఈపత్రాలతో జిల్లా ఎన్నికల అధికారిని కలిసి మూడు సెట్లను అందించాల్సి ఉంటుంది. నామినేషన్ల పరిశీలన, గుర్తుల కేటాయింపు వాటికి అభ్యర్థులు అందుబాటులో లేకుంటే వారి మద్దతు దారులు హాజరుకావాల్సి ఉంటుంది. వివరాలు తప్పుగా ఉంటే నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది. ఆన్‌లైన్ అవకాశాన్ని వినియోగించుకుంటే అభ్యర్థులకు కొంత సమయం, డబ్బు ఆదా అవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఇక అనుమతులు సులువు

ఎన్నికల ప్రచారానికి సంబంధించి సమావేశం నిర్వహించాలంటే ఇదివరకు తెల్లకాగితంపై రాసి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అధికారులకు సమయం దొరికినప్పుడు అనుమతులిచ్చేవారు. ఇది తలనొప్పిగా ఉండేది. ఇప్పుడు సులువుగా మారింది. ఇందుకోసం ఎన్నకల సంఘం సువిధ యాప్‌ను ప్రవేశపెట్టింది. అనుమతుల జారీ కోసం అధికారుల వద్దకు వెళ్లాల్సిన పనిలేదు. యాప్‌లో దరఖాస్తు చేస్తే అనుమతులు జారీ చేస్తారు.

అనుమతులు తప్పనిసరి

నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఇక ఎన్నికల ప్రచా రం జోరుగా సాగనుంది. ప్రధాన పార్టీలు సభలు, సమా వేశాలపై దృష్టి సారిస్తాయి. ర్యాలీలతో హోరెత్తిస్తారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు ఎన్నికల సంఘం ప్రచార పర్వంలో నిబంధనలు విధించింది. అభ్యర్థులు ఎలాంటి కార్యక్రమాలు చేయాలన్న ముందస్తు అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇందుకు సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

48 గంటల్లోనే ప్రచార అనుమతులు

- చరవాణి గూగుల్ ప్లేస్టోర్ ద్వారా సువిధ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- సమావేశం నిర్వహించే వివరాలతో పాటు తమకు ఏ విధమైన అనుమతులు కావాలో అందులో నమోదు చేయాలి.
- అనుమతులకు సంబంధించి మీ సేవా కేంద్రంలో చలానా చెల్లించాల్సి ఉంటుంది. చెల్లించిన చలానా రసీదు సువిధలో నమోదు చేసిన వివరాలు రిటర్నింగ్ అధికారి, అసెంబ్లీ పరిధిలోని ఏఆర్వో కార్యాలయాల్లో అందజేయాలి.
- ఎలాంటి జాప్యం లేకుండా దరఖాస్తులు ఎన్నికల అధికారులకు చేరిన 48 గంటల్లో అనుమతులు జారీ చేస్తారు. అనుమతి జారీలో జాప్యం జరిగితే..సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చు.


వరంగల్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న స్వతంత్ర అభ్యర్థి బరిగెల శివ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిని తౌటపల్లి నర్మద , అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థి అంబోజు బుద్దయ్య.

నామినేషన్ల పర్వం షురూ..

మహబూబాబాద్ (ఆంధ్రజ్యోతి)/వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 18 : లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పర్వం గురువారం ప్రారంభం కాగా.. తొలిరోజున వరంగల్ నియోజకవర్గానికి ముగ్గురు, మాను కోటలో ఒకరు తమ నామినేషన్లను దాఖలు చేశారు. వరంగల్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య, మానుకోటలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. వరంగల్‌లో అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్ పార్టీ అభ్యర్థిగా అంబోజు బుద్దయ్య, స్వతంత్ర అభ్యర్థిగా బరిగెల శివ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థినిగా తౌటపల్లి నర్మద ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇక మహబూ బాబాద్ స్వతంత్ర అభ్యర్థిగా మరిపెడ మండలం ఎడ్జర్ల శివారు గుర్రపు తండాకు చెందిన బానోత్ లింగ్యానాయక్ తొలి నామినేషన్ వేశారు.



మహబూబాబాద్‌లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బానోత్ లింగ్యానాయక్

బిడ్డపై ఆరాటమే తప్పు.. ప్రజలపై ప్రేమ లేదు..

● ఉద్యకారులను జైలులో వేసిన ఘనత కడియం శ్రీహరిది.. ● బీజేపీ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు

హనుమకొండ టౌన్, ఏప్రిల్18: బిడ్డపై ఆరాటమే తప్పు.. ఎమ్మెల్యేగా గెలిపించిన స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఎలాంటి ప్రేమ లేదని బీజేపీ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ ధర్మారావు మండిపడ్డారు. గురువారం హంటర్‌రోడ్డులోని బీజేపీ వరంగల్ లోక్‌సభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్మారావు మాట్లాడారు. బీజేపీ గెలిస్తే పెద్ద ప్రమాదం జరుగుతుందని రాజ్యాంగంపై అవగాహన లేకుండా కడియం పిచ్చికూతలు కూస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం విద్యావేత్త అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తనకున్న అధికారంతో జిల్లా ఎస్పీలు, కమిషనర్‌లను హెచ్చరించి ఉద్యమకారులను జైల్లో పెట్టించాడని ఆరోపించారు. బీజేపీ దళిత ద్రోహి అని పదే పదే చెబుతున్న కడియంకు.. పరకాల నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా జైపాల్ మాదిగను నిలబెట్టింది బీజేపీనే అన్న విషయం మరువొద్దన్నారు. లోక్‌సభలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 77శాతం మంది ప్రాతినిథ్యం వహిస్తున్నా రనే విషయం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. దొర కాళ్లు పట్టుకొని బీఆర్ఎస్‌లో చేరి తిన్నింటి వాసాలు లెక్కపెట్టిన చరిత్ర శ్రీహరిది అని ధర్మారావు ధ్వజమెత్తారు. డబ్బులకు లాలూచీ పడి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్‌లో చేరాడని విమర్శించారు. పార్టీ మారినప్పటికీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నాడని అన్నారు. శ్రీరామ నవమిని దేశవ్యాప్తం గా కన్నులపండువగా నిర్వహించుకుంటే.. మూఢత్వం అం టూ కొంతమంది విమర్శలు చేస్తున్నారని, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడుతున్న వ్యక్తులను పాకిస్తాన్‌కు తరలించాలని ధర్మారావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్లమెంట్ ప్రభారీ మురళీ, బీజేపీ నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, శ్రీధర్, రావు పద్మ, జైపాల్, కీర్తిరెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ధర్మారావు

భద్రకాళి సన్నిధిలో అరూరి పూజలు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 18: చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయం లో వరంగల్ లోక్‌సభ బీజే పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అరూరి రమేష్ శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రచార పర్వం ప్రారంభం కావడంతో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అరూరి.. తన ప్రచార వాహనాలకు వాహన పూజ లు నిర్వహించారు. ప్రచార పర్వం ప్రారంభిస్తున్న నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, హనుమకొండ బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి, మాజీ ఎంపీ చాడా సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు. అనంతరం వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలో ప్రచారం నిమిత్తం పూజ తర్వాత వాహనాలు బయల్దేరి వెళ్లాయి.


ప్రచార వాహనాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నేడు మానుకోటకు సీఎం


మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో సిద్ధమవుతున్న జనజాతర సభావేదిక


మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో పోలీస్ బందోబస్తు కోసం అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

(5వ పేజీ తరువాయి)

తొలి పార్లమెంట్ సభ్యుడిగా 2009లో గెలిచిన పోరిక బలరాంనాయక్ అప్పటి యూపీఏ ప్రభుత్వంలో కేంద్రసామాజిక న్యాయశాఖ సహాయమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత తెలంగాణ ఆవిర్భావంతో ఉద్యమ పార్టీగా బరిలో దిగిన బీఆర్ఎస్ అభ్యర్థులపై రెండుసార్లు పోటీ చేసి ఓటవి ి పాలయ్యారు. ప్రస్తుతం మార్పుకోరిన తెలంగాణ ప్రజల ఓటరు నాడికి అనుగుణంగా కాంగ్రెస్ ప్రభంజనంలో మళ్లీ పార్లమెంట్ స్థానానికి పోటీ పడుతున్నారు. రేవంత్‌రెడ్డి సీఎం కాకముందు నుంచే పోరిక బలరాంనాయక్‌కు ఆత్మీయుడిగా కొనసాగారు. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే ఒకట్రెండు సభల్లో ఉదహరించారు. దీంతో పాటు సెంటిమెంట్‌గా అటు మహబూబ్‌నగర్ నుంచి ఇటు మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచార జనజాతర సభలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకావడం, వ్యూహాత్మకంగానే ఈరెండు స్థానాలను ఎంచుకున్నారని భావిస్తున్నారు. ఇక ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ పోలీస్ అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా మానుకోట పట్టణం ఎన్టీఆర్ స్టేడియంలోని సభాస్థలి, హెలిప్యాడ్, పోలీస్‌బందోబస్తుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల..

సీఎం రేవంత్‌రెడ్డి సభ విజయవంతానికి రెండ్రోజులుగా మహబూబాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, మానుకోట పార్లమెంట్ ఎన్నికల కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తుమ్మల నాగేశ్వరరావు సభ ఏర్పాట్లను చూస్తున్నారు. మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి భారీగా జనసమీకరణ చేసేం దుకు కసరత్తు పూర్తి చేశారు. మండుటెండల్లో నిర్వహిస్తున్న సభకు హాజరయ్యే వారికి తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించడంతో పాటు నీడ కోసం షామియానాలు కూడా వేశారు. శ్రీరామనవమి సందర్భంగా మహబూబాబాద్ గాంధీపార్కులో జరిగిన ఉత్సవాలకు హాజరైన ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి కూడా తొలుత సీఎం సభ ప్రాంగణాన్ని పరిశీలించి వెళ్లారు. డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్‌రెడ్డి, ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు అటు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, తదితరులతో సమన్వయం చేసుకుంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పార్టీ నాయకులు, శ్రేణులతో సమావేశాలు నిర్వహించి సీఎం సభ విజయవంతానికి ఏర్పాట్లు చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతుండడంతో ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ విజయాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు.

ఆట మొదలైంది..

(5వ పేజీ తరువాయి)

పాగా వేయాలని కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతున్నారు.

కంచుకోటపై గులాబీ గురి

పదేళ్లుగా బీఆర్ఎస్‌కు ఉమ్మడి వరంగల్ కంచుకోటలా ఉంది. ఏ ఎన్నికలు జరిగినా ఓరుగల్లులో ఆపార్టీదే హవా.. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ కేడర్‌లో కొంత నైరాశ్యం నెలకొంది. దీనికి తోడు వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖరారైనా కడియం కావ్య కాంగ్రెస్‌లోకి జంప్ కావడం శ్రేణుల్లో మరింత నిరుత్సాహం నింపింది. అయితే ఏప్రిల్ 1న హనుమకొండలో జరిగిన వరంగల్ లోక్‌సభ స్థాయి సమావేశంలో నేతల ప్రసంగాలు వారిలో ఉత్సాహం నింపాయి. బీఆర్ఎస్‌కు కడియం శ్రీహరి ద్రోహం చేశారని రగిలిపోతున్న కేడర్ తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుని ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌ను వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా మాలోతు కవితను అధిష్ఠానం ఖరారు చేయడంతో పాటు ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులను అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలుగా నియమించింది. ఇప్పటికే స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించిన బీఆర్ఎస్ శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజక వర్గ శ్రేణుల సమావేశం ఏర్పాటు చేసింది. అలాగే మిగతా అన్ని నియోజక వర్గాల్లో కార్యకర్తల సమావేశాలతో ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్‌కు ధీటుగా ప్రచారం చేయాలని వ్యూహ రచన చేస్తున్నారు. మొత్తానికి నామినేషన్ల ఘట్టం మొదలు కావటంతో ఓరుగల్లులో రాజకీయాలు వేడెక్కబోతున్నాయి.

అరూరికి చిన్న మెదడు చితికింది..

● రాజకీయాలను అడ్డం పెట్టుకుని భూ కబ్జాలకు పాల్పడ్డాడు.. ● ప్రతీ ఎకరాకు గోదావరి జలాలు అందిస్తా..
● స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ● వర్ధన్నపేటలో వరంగల్ లోకసభ సన్నాహక సమావేశం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 18: వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ చిన్న మెదడు చితికిందని, అందుకే మతి తప్పి మాట్లాడుతున్నాడని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎద్దేవా చేశారు. గురువారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని 'డీ' కన్వెన్షన్ హాలులో వర్ధన్నపేట వరంగల్ లోక్‌సభ ఎన్నిక సన్నాహక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీహరి మాట్లాడారు. తన తాత, తనతో పాటు కూతురు కడియం కావ్య పర్వతగిరిలోనే జన్మించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని కొందరు వక్రీకరిస్తూ ఇష్టారాజ్యంగా మాట్లాడు తున్నారని అరూరి రమేశ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడించినా రమేశ్‌కు బుద్ధి రాలేదన్నారు. కబ్జాదారులు, గుంటనక్క లాంటి నాయకులు అవసరమా? అని ప్రశ్నించారు. రమేశ్ వంటి దొంగలకు అవకాశం ఇస్తే దోపిడీ జరుగుతుందన్నారు. రాజకీయాల్లో సేవ చేసే దృక్పథం ఉండాలే కానీ.. దోచుకునే తత్వం ఉండరాదన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశానికే ప్రమాదమని శ్రీహరి ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాదానికి అర్థమే మారిపోతుందన్నారు. దళితులకు రిజర్వేషన్లు రద్దు అవుతాయని చెప్పారు. బీజేపీ అరాచకాలకు అడ్డుపడాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని శ్రీహరి కోరారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు గోదావరి జలాలు అందించే బాధ్యత తనదని శ్రీహరి హామీ ఇచ్చారు. డాక్టరు కడియం కావ్యను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రమేశ్ భూ బకాసురుడు..

అరూరి రమేశ్ భూ బకాసుడని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య ఆరోపించారు. తొలి నుంచి కూడా తన జన్మస్థలం ఇతర వ్యక్తిగత విషయాలే తప్ప.. ఇంకేమీ చెప్పలేక రమేశ్ నానా తంటాలు పడుతున్నాడని అన్నారు. తన తండ్రి కడియం శ్రీహరి రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చ లేదని, ఈ క్రమంలో అరూరి రమేశ్‌కు ఏమీ దొరకక అర్థం లేని విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. దొంగలకు అవకాశం ఇస్తే ఆగమైపోతారని ప్రజలకు సూచించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి దేశాన్ని భయందోళనలకు గురిచేస్తున్న బీజేపీని పాతాళానికి తొక్కి పెట్టాలన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రపంచదేశాలకే దిక్సూచిగా నిలిచిందని అన్నారు. రాజ్యాంగ నిర్మాణ డాక్టరు బీఆర్ అంబేద్కర్ విశ్వవాప్తంగా కీర్తి పొందారన్నారు. కానీ బీజేపీ మాత్రం రాజ్యాంగాన్నే మారుస్తామని చెప్పడం అనైతికమన్నారు. ప్రజలు ఆలోచించాలని, దేశంలో శాంతి నెలకొనాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినీ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టరు రియాజ్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

23న వరంగల్‌కు కేటీఆర్

● నియోజకవర్గాల వారీగా సమావేశాలు
● 22న సుధీర్‌కుమార్ నామినేషన్ దాఖలు



రాంనగర్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ 23న వరంగల్ పర్యటనకు రానున్నారు. వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్ ప్రచార కార్యక్రమానికి కేటీఆర్ హాజరుకానున్నారు. 23న సాయంత్రం 4గంటలకు వర్ధన్నపేటలో జరిగే సమావేశంలో పాల్గొననున్న కేటీఆర్.. సాయంత్ర 6గంటలకు వరంగల్ తూర్పు నియోజకవర్గంలో జరిగే సమావేశంలో పాల్గొంటారు. సుధీర్‌కుమార్ 22న ఉదయం 10గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు.

అలాగే ఏడు నియోజకవర్గాల వారిగా ప్రచార సమావేశాలను పార్టీ ప్రకటించింది. 19న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సమావేశం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఉదయం 10గంటలకు జరగనుంది. 20న ఉదయం 10గంటలకు భూపాలపల్లి నియోజకవర్గ సమావేశం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తారు. 20న మధ్యాహ్నం 2గంటలకు పరకాల నియోజకవర్గ సమావేశం నియోజకవర్గ కేంద్రంలోని లలితా కన్వెన్షన్‌లో జరుగుతుంది. 23న సాయంత్రం 4గంటలకు వర్ధన్నపేట నియోజకవర్గ సమావేశం నియోజకవర్గ కేంద్రంలో జరుగుతుంది. 23న సాయంత్రం 6గంటలకు వరంగల్ తూర్పు నియోజకవర్గ సమావేశం వరంగల్‌లో నిర్వహించనున్నారు. 25న ఉదయం 10గంటలకు పాలకుర్తి నియోజకవర్గ సమావేశం రామ ఉపేందర్ గార్డెన్స్ తొర్రూరులో నిర్వహించనున్నారు.

ఆర్టీసీ సిబ్బంది రోజూ రూ.లక్ష తీసుకురావాలి

ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ శ్రీలత

న్యూశాయంపేట, ఏప్రిల్ 18: ఆర్టీసీలో నూతనంగా 'లక్షే లక్ష్యం' అనే కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు వరంగల్-1డిపోలో ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ శ్రీలత జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆర్ఎం శ్రీలత మాట్లాడుతూ.. రీజియన్ పరిధిలోని డిపోల సిబ్బంది ఇక నుంచి రోజుకు రూ.లక్ష ఆదాయాన్ని అదనంగా తీసుకురావాలన్నారు. డిపో 1 పరిధి పెద్దగా ఉన్నందున రోజుకు సిబ్బంది రూ.1,80,000 తీసుకురావాలన్నారు. సిబ్బంది సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో 1 మేనేజర్ వంగాల మోహన్‌రావు, అసిస్టెంట్ ఇంజనీర్ మెకానికల్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సంతోష్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ శ్రీలత



రామాలయం ఆవరణలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

మెట్టుగుట్టపై ఘనంగా వసంతోత్సవం

మడికొండ, ఏప్రిల్ 18: మడికొండలోని మెట్టుగుట్టపై శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రామాలయంలో హోమం, బలిహరణ, ఘనంగా వసంతోత్సవం నిర్వహించారు. స్వామి వారి నాగవెల్లి (రథోత్సవం) రోజు అలంకరణ నిమిత్తం 4వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికానరోత్తం రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈవో శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ ఆధ్వర్యంలో జరిగిన పూజలలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పారుపెల్లి సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, బైరి రాజు, బోగి కేదారి, దండిగం శ్రీనివాస్, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విజేత స్కిన్ హాస్పిటల్ ప్రారంభం



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 18: బాలసముద్రం అంబేద్కర్ జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన విజేత స్కిన్, అస్థటిక్స్ (సౌందర్యం) హాస్పిటల్‌ను దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో మహిళలు, యువత ఎదుర్కొనే వివిధ రకాల చర్మవ్యాధులు, హెయిర్‌కు సంబంధించిన అత్యాధునిక ట్రీట్‌మెంట్ అందిస్తున్న డాక్టర్ విజేత, డాక్టర్ వినోద్‌రెడ్డిలను అభినందించారు. అనంతరం వైద్యులు తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి హాస్పిటల్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అడ్వాన్స్ మిషన్స్, డెర్మటాలజీ, కాస్మటాలజీలో అత్యాధునిక చికిత్స అందిస్తుందన్నారు. అపాయింట్‌మెంట్ కోసం సెల్ నెంబర్ 8885500107, 8885500106లలో సంప్రదించాలని సూచించారు.

బీఆర్‌ఎస్ బీఫామ్ అందుకున్న సుధీర్‌కుమార్



కేసీఆర్ చేతుల మీదుగా బీఫామ్ అందుకుంటున్న సుధీర్ కుమార్

రాంనగర్, ఏప్రిల్ 18: బీఆర్‌ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారెపెల్లి సుధీర్‌కుమార్ బీఫామ్ అందుకున్నారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన బీఆర్‌ఎస్ సమావేశంలో ఆ పార్టీ అధినేత కేసీఆర్ చేతుల మీదుగా స్వీకరించారు. ఆయన వెంట వరంగల్‌కు చెందిన ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, మధుసూధనాచారి, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నేతలు నన్నపునేని నరేందర్, గండ్ర వెంకటరమణారెడ్డి, రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, మెట్టు శ్రీనివాస్, గండ్ర జ్యోతి, రాకేష్‌రెడ్డి తదితరులున్నారు.

నోటీసు బోర్డుపై ఎన్నికల షెడ్యూల్ ప్రదర్శన

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 18: మే నెల 13న జరిగే లోక్ సభ ఎన్నికల షెడ్యూల్‌ను గురువారం వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రదర్శించారు. అసిస్టెంట్ కమిషనర్ అనిసుర్ రషీద్ షెడ్యూల్ వివరాలను నేరుగా నోటీసు బోర్డుకు అంటించారు. నామినేషన్ల ప్రారంభం, ముగింపు, నామినేషన్ల ఉపసంహరణ, ఎన్నికల తేదీ, ఓట్ల లెక్కింపు తదితర వివరాలతో కూడిన ప్రతులను అంటించారు.

కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 18: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదుల కోసం జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌తో పాటు, టోల్ ఫ్రీ నెంబర్ 18004251816 ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోల్‌ఫ్రీ నెంబర్ 24గంటల పాటు పని చేస్తుందని, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆ ప్రకటనలో కోరారు.

కేయూలో నూతన ఎంఓయూ

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 18: హైదరాబాద్‌కు చెందిన హార్ట్ ఫుల్నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, కేయూ గురువారం నూతన ఎంవోయూ చేసుకుంది. గురువారం కేయూలో జరిగిన కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, హార్ట్ ఫుల్నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ బాధ్యులు అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. సమాజంలో విలువల పతనం, విపరీత ధోరణులు, ప్రశాంతత లేమి నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన శిక్షణను ఫుల్నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఇస్తుందని వర్సిటీ అధికారులు తెలిపారు. ఉద్యోగులకు శిక్షణ కల్పిస్తారని వెల్లడించారు. కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆదేశాల మేరకు ఎంఓయూ చేసుకున్నట్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో హార్ట్ ఫుల్నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ తరపున రిటైర్డు ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆదిత్య అర్య, డాక్టర్ అనంత మాధవ మోహన్, మురళీధర్‌రావు, ఎస్‌వీ రమణన్, వరప్రసాద్, శారద, కేయూ ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, డీవో ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి, ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి, ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్, ఏఆర్ డాక్టర్ కోలా శంకర్ పాల్గొన్నారు.

నోటుకు ఆశ పడి ఓటును అమ్ముకోవద్దు

అదనపు కలెక్టర్ శ్రద్ధా శుక్లా

ఆకట్టుకున్న మహిళా ఉద్యోగుల ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళా ఉద్యోగులు

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 18: నోటుకు ఆశ పడి ఓటును అమ్ముకోవద్దని, ఓటును అమ్ముకుంటే పశ్నించే హక్కు కోల్పోతారని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. ఓటు హక్కు వినియోగంపై గురువారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఓటు ప్రాధాన్యత అవగాహన పెంపొందించేలా వివిధ శాఖల మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రద్ధాశుక్లా మాట్లాడుతూ.. ఓటు హక్కుపై మహిళలను చైతన్యవంతులను చేయాలని, మహిళలు తమ ఓటు హక్కును బాధ్యతగా భావించి కుటుంబంలో ఓటు హక్కు కలిగిన వారందరితో ఓటు హక్కు వినియోగించుకొనుటకు సహకరించాలన్నారు. ప్రజాస్వామ్య మనుగడకు ఓటు ప్రధాన ఆయుధమని, 18 యేళ్ల పైబడి ఓటు హక్కు ఉన్న వారందరు తప్పకుండా ఓటు వేసి సమాజ మనుగడకు దోహదపడాలన్నారు. అనంతరం గెలుపొందిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ, డీఆర్‌డీఓ నాగపద్మజ, అదనపు డీఆర్‌డీఓ ఎం.శ్రీనివాసరావు, పౌరసంబంధాల శాఖ ఏడీ భానుప్రసాద్, మహిళా సాధికారత కో-ఆర్డినేటర్ డి.కళ్యాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో నాగపద్మజ

ఐనవోలు, ఏప్రిల్ 18: ఉపాధి పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో నాగపద్మజ ఉపాధి కూలీలకు సూచించారు. వెంకటాపూర్, గర్మిళ్లపల్లి గ్రామాల్లో గురువారం పంట కాలువలు, చెరువు పూడికతీత, నర్సరీలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ.. రోజు రూ.300 కూలీ రావాలంటే ఎంత పనిచేయాలో కూలీలను అడిగి తెలుసుకుని కొలతలు పెట్టించారు. ప్రతీ గ్రామంలో కూలీలు 150 నుంచి 200 మంది వచ్చే విధంగా చూడాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై ఉందన్నారు. ఎండ తీవ్రత ఉన్నందున ఉదయమే పనులు చేపట్టాలన్నారు. కూలీలకు పనులు జరిగేచోట తాగునీరు, నీడ కల్పించాలని కార్యదర్శులను ఆదేశించారు. నర్సరీల్లో మొక్కల పెంపకం సంతృప్తిగా ఉందని విరివిగా చింత, వేప మొక్కలను పెంచాలని సూచించారు. బహుళజాతి కంపెనీ అమెజాన్ చింత గింజలు కొనేందుకు ముందుకు వచ్చిందన్నారు. మునిగ, రాళ మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లు, ఏపీవో నక్క కుమారస్వామి, ఈసీ ప్రదీప్, టీఏ రమేష్, కార్యదర్శులు రవికుమార్, రజాక్, ఎఫ్ఏ రమ, యాదలక్ష్మి, కూలీలు పాల్గొన్నారు.

హెరిటేజ్ డీజిల్ లోకో అదుర్స్



విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న మోడల్ డీజిల్ ఇంజన్

కాజీపేట, ఏప్రిల్ 18: కాజీపేట డీజిల్‌షెడ్‌లో పాత డీజిల్‌లోకో ఇంజన్‌ను రైల్వే కార్మికులు రంగు, రంగుల విద్యుత్ కాంతులతో గురువారం ముస్తాబు చేశారు. గురువారం ప్రపంచ వారసత్వ దినోత్సవంలో భాగంగా రైల్వేలో అంతరించిన ఈ డీజిల్ ఇంజన్‌ను మెరుగులు దిద్ది రంగులు వేసి, విద్యుత్ కాంతులతో మోడల్‌గా డీజిల్ లోకోగా ఏర్పాటు చేశారు. జూలై 27, 1974 సంవత్సరంలో తయారైన ఈ డీజిల్ ఇంజన్ 42 సంవత్సరాలు ఇండియన్ రైల్వేలో సేవలు అందించింది. చివరిసారిగా మే 25న 2016 సంవత్సరంలో సికింద్రాబాద్ నుంచి కాజీపేట వరకు ప్రయాణించిందని రైల్వే అధికారులు తెలిపారు. డీజిల్ ఇంజన్ పనితీరును, సేవలను, జ్ఞాపకాలను రైల్వే కార్మికులు నెమరువేసుకున్నారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, ఏప్రిల్18: నిబంధనలు ఉల్లఘించిన 25 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు. 25 మందిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రమేశ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 23 మందికి రూ. 27,900, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ ఇద్దరికి రూ.1600 జరిమానాను విధించారన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలో అత్యుత్తమ పరిశోధనలు

కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్



మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 18: పరిశోధకులు క్షేత్రస్థాయిలో పర్యటించి లోతైన అంశాలను సేకరిస్తేనే అత్యుత్తమ పరిశోధనలు వెలువడుతాయని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఉద్బోధించారు. గురువారం కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నేతృత్వంలో వారం పాటు నిర్వహించే పరిశోధకుల కార్యశాలను వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ప్రారంభించి మాట్లాడారు. పరిశోధనల్లో వస్తున్న మార్పులను వివరించారు. కృత్రిమ మేధా అవశ్యతను పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో దత్తాంశాలను సేకరించినప్పుడే ఉత్తమ పరిశోధనలు వెలువడుతాయని అన్నారు. సెకండరీ డేటాను సక్రమంగా ఉపయోగించుకోవాలని చెప్పారు. పరిశోధకుడు ఉత్తమ ఆలోచన, సృజన చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.అమరవేణి, డీన్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి, రిటైర్డు ప్రొఫెసర్ పి.కృష్ణమాచారి, ఓంప్రకాశ్, భవాని ప్రసాద్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్

కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

మడికొండ, ఏప్రిల్ 18: మడికొండలోని వాల్మీకి నగర్‌కు చెందిన సుమారు వంద మంది బీఆర్‌ఎస్ నేతలు 64వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుర్ల మోహన్ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సుబేదారిలోని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ క్యాంప్ కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే నాగరాజ్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బైరి లింగమూర్తి, బోగి క్రిష్ణమూర్తి, నిగ్గుల వెంకటప్రసాద్, బోగి వెంకటస్వామి, బోగి లింగమూర్తి, మీనుగు సతీష్, పేర్ల సురేష్, రవి, సత్యం, రాజపోషాలు, రవీందర్, క్రిష్ణ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలోకి పలువురు



బీజేపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న అరూరి రమేష్, రావు పద్మ తదితరులు

ఐనవోలు, ఏప్రిల్ 18 : కొండపర్తి మాజీ సర్పంచ్ కట్కూరి రాజమణి బెన్సన్, మాజీ ఉప సర్పంచ్ పిట్టల శ్యామ్‌తోపాటు 50 మంది బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరినట్లు ప్రకటించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మలు పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, కొండేటి శ్రీధర్, నియోజకవర్గ కన్వీనర్ కేశవరెడ్డి, కార్పొరేటర్ అభినవ్ భాస్కర్, సొసైటీ చైర్మన్ వనంరెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ జయపాల్, ఎంపీటీసీ రాజేందర్, నాయకులు బన్న ప్రభాకర్, లూథర్, నాగరాజు, కిరణ్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన బీజేపీని ఓడిద్దాం..

మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పద్మయ్య

ధర్మసాగర్, ఏప్రిల్ 18 : ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాట తప్పి మోసం చేసిన బీజేపీని ఓడించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మయ్య అన్నారు. గురువారం ధర్మసాగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని మాదిగలను మోసం చేశారని అన్నారు. మంద కృష్ణ మాదిగ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మద్దతూ తెలుపుతూ మాదిగ అస్థిత్వాన్ని తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. మతం పేరుతో దళితులను, ఉపకులాలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దళితులకు రూ.12 లక్షలు దళిత బంధు తరహాలో మంజూరు చేయాలన్నారు. మాదిగ హక్కుల దండోరా పక్షాన కడియం కావ్యకు మద్దతు తెలుపుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిన్నారపు సంగీత్, మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు కాగిత ప్రసాద్, నరేందర్ పాల్గొన్నారు.

వాగ్దేవిలో మంత్ర- 2కే పోస్టర్ ఆవిష్కరణ

నయింనగర్, ఏప్రిల్ 18: హనుమకొండ నయింనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో జాతీయస్థాయి ఎంబీఏ విద్యార్థుల సదస్సుకు సంబంధించిన మంత్ర-2కే పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాగ్దేవి కళాశాలల సెక్రటరీ డాక్టర్ దేవేందర్‌రెడ్డి హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వాగ్దేవి కళాశాలలో 20 యేళ్ల నుంచి ఎంబీఏ విద్యార్థులు మంత్ర పేరిట సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి ఎంబీఏ విద్యార్థులు హాజరై వివిధ పోటీలలో పాల్గొని బహుమతులు పొందుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి కళాశాలల అకాడమిక్ డైరెక్టర్ వాహినీ దేవి, తెలంగాణ రిటైర్డ్ డీజీపీ డాక్టర్ ఆదిత్య ఆర్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శేషాచలం, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ అచ్చయ్య, ఎంబీఏ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదిగలపై కాంగ్రెస్ చిన్నచూపు

ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్

కాజీపేట, ఏప్రిల్ 18: అత్యధిక ఓటు బ్యాంకు ఉన్న మాదిగలకు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎంపీ సీటు కేటాయించకుండా చిన్నచూపు చూపించిందని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ కాంగ్రెస్ పార్టీపై ధ్వజమెత్తారు. కాజీపేట మీడియా పాయింట్‌లో గురువారం ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు మాట్లాడారు. గతంలో ప్రతీ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ బహిరంగ సభల్లో ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగను రేవంత్ రెడ్డి పిలిచి మాదిగలకు దగ్గర చేశారన్నారు. అధికారం చేపట్టాక మాదిగలకు అండగా నిలవాల్సిన సమయంలో మాదిగలకు ఒక్క సీటుకూడా కేటాయించకుండా అన్యాయం చేశారన్నారు. ఇప్పటికైనా వరంగల్, నాగర్‌కర్నూల్ ఎంపీ సీట్లు మాదిగలకు కేటాయించాలని లేకుంటే ఈ ఎన్నికల్లో మాదిగలంతా ఐక్యంగా ఉండి కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెబుతారన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి

ఈ నెల 22న పరకాలలో నిర్వహించే ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ పార్లమెంట్ స్థాయి సదస్సుకు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ కోరారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శులు రాజారపు కిరణ్, మందస్వరాజ్, ఎస్. రజినీ కుమార్, నాయకులు జేరుపోతుల సారంగపాణి, తిప్పారపు మల్లేశ్, మంద వర్ధన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభకు పంపిస్తే.. ప్రశ్నించే గొంతుకనవుతా..

స్వతంత్ర్య అభ్యర్థి గడ్డం చిరంజీవి చిందు

వడ్డెపల్లి, ఏప్రిల్ 18: లోక్‌సభకు తనను పంపిస్తే ప్రశ్నించే గొంతుకనవుతానని వరంగల్ లోక్‌సభ స్వతంత్ర్య అభ్యర్థి, తెలంగాణ చిందు హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం చిరంజీవి చిందు అన్నారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వరంగల్ లోక్‌సభకు ఎన్నికైన వివిధ పార్టీల ఎంపీలు ఇప్పటి వరకు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. పేద కుటుంబానికి చెందిన తనకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు ఆదరించి ఓట్లు వేసి లోక్‌సభకు పంపిస్తే నిరంతరం వారి సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని అన్నారు. సమావేశంలో తెలంగాణ చిందు హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ సభ్యులు గడ్డం హరిబాబు, గడ్డం మధుబాబు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో దాడులపై

ఎస్ఎఫ్ఐ నిరసనలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 18: హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులతపై ఏబీవీపీ దాడులను నిరసిస్తూ గురువారం కేయూ మొదటి గేటు వద్ద ఎస్ఎఫ్ఐ హనుమకొండ జనరల్ సెక్రటరీ మంద శ్రీకాంత్ నేతృత్వంలో నిరసన ఆందోళన చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. హెచ్‌సీయూలో ఎస్ఎఫ్ఐ కూటమి విజయం సాధించడాన్ని జీర్ణించుకోలేని ఏబీవీపీ మతోన్మాద గుండాలు ఎస్ఎఫ్ఐ స్టూడెంట్స్‌పై దాడులకు తెగపడ్డారని ఆరోపించారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేయూ కమిటీ అధ్యక్షుడు పురుషోత్తం, ఉపాధ్యక్షులు సాయికిరణ్, జస్వంత్ పరిమళ, అనిల్, సందీప్,రాజ్‌కుమార్, సాయి, ఉదయ్ పాల్గొన్నారు.

వేసవిలో ఇంటర్ తరగతులు నిర్వహించొద్దు..

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 18: ఇంటర్ విద్య కమిషనరేట్ ఆదేశాల మేరకు వేసవిలో ఇంటర్ కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు తరగతులు నిర్వహించొద్దని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దుగ్గెల తిరుపతి అన్నారు. గురువారం హనుమకొండలో జరిగిన డీవైఎఫ్ఐ సమావేశంలో తిరుపతి మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా వేసవిలో తరగతులు నిర్వహిస్తూ, ముందస్తు అడ్మిషన్ల పేరుతో లక్షలాదిగా ఫీజులను అక్రమంగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. నగరంలో అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్న కళాశాలపై ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

అక్రమ అడ్మిషన్లపై డీఐఈఓ చర్యలు చేపట్టాలని అన్నారు. దీనిపై ఇంటర్ కమిషనరేట్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, సుమంత్, రవితేజ, అఖిల్, మధుమేశ్, అనిల్, రాజు, శ్రీకాంత్, కిరణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టును తనిఖీ చేసిన సీపీ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన జనగామ చెక్‌పోస్టును వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తనిఖీ చేశారు. చెక్‌పోస్టులో విధులు నిర్వహించే సిబ్బంది 24గంటలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్రమ మార్గంలో ఎటువంటి మద్యం, డబ్బు సరఫరా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వాహనాలు తనిఖీ చేసిన రిజిస్టర్‌ను కమిషనర్ పరిశీలించారు. అనంతరం పాలకుర్తి, దేవరుప్పుల పోలీస్ స్టేషన్‌లను అంబర్ కిషోర్‌ఝా సందర్శించారు. స్టేషన్‌లో పెండింగ్ కేసులు, స్టేషన్‌లన పనితీరును పరిశీలించారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న బీజేపీ

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు

మడికొండ, ఏప్రిల్ 18: బీజేపీది నీతివంతమైన పాలన అంటే.. ప్రతిపక్షాల గొంతు నొక్కడమా? అని వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రశ్నించారు. మడికొండలో ఈనెల 24న జరుగనున్న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ స్థలాన్ని గురువారం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి పరిశీలించారు. సభ ఏర్పాట్లకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పది రోజులుగా రాముడి పేరుతో ప్రజలను మభ్యపెట్టి, మోసపుచ్చి, ఒక సెంటిమెంట్‌తో ఓట్లు సాధించాలని బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. బీజేపీ చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించడంలేదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. నల్లధనం మొత్తం బయటికి తీసి ప్రతీ ఒక్కరి ఖాతాలో రూ.15లక్షలు వేస్తామని, మూడుకోట్ల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని, బీజేపీ ఇచ్చిన హామీలపై ప్రజలు ఎక్కడికక్కడ ప్రశ్నిస్తున్నారని స్పష్టం చేశారు. తమది నీతివంతమైన ప్రభుత్వం అని చెప్పుకునే బీజేపీ ప్రభుత్వం.. సీబీఐ, ఐటీ వారిని ప్రయోగించి ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కుతోందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలను తమ రాజకీయ లబ్ధికి ఉపయోగించుకోవడం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు.


అలాగే కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకున్న ఐదు న్యాయ అంశాలపై పూర్తి సమాచారాన్ని ప్రజలకు అందిస్తామన్నారు. భారీ మెజారిటీతో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవడానికి ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 19 ఏప్రిల్ 2024

హనుమంతుడిలోని శరణాగతి, సమర్పణ భావం అపూర్వమైనవి. మనం గురువుకు, భగవంతుడికి శరణాగతి కావడానికి దోహదపడే శక్తి ఆయన నుంచే ప్రాప్తిస్తుంది.



హనుమ... శరణాగతికి ప్రతిరూపం



రామాయణంలోని 'సుందరకాం డ'లో హనుమంతుడి విశిష్టత గురించి వాల్మీకి మనోహరంగా వర్ణించాడు. సీతాన్వేషణ, లంకాదహనం, సీతాదేవి జాడను శ్రీరాముడికి తెలియజేయడం లాంటి ఘట్టాలు అందులో ఉన్నాయి. హనుమంతుడి శక్తి, సామర్థ్యాలను తులసీదాస్ తన 'హనుమాన్ చాలీసా'లో చాలా వివరంగా తెలియజేశాడు. 'శ్రీగురుచరణ...' అంటూ ముందుగా హనుమంతుణ్ణి గురురూపంలో కీర్తిస్తాం... ఎందుకంటే హనుమంతుడు తన భక్తులను ఆధ్యాత్మికంగా ఎంతో ఉన్నత స్థితికి తీసుకువెళతాడు.

'విద్యావాన గుణీ అతి చాతుర ... రామకాజ కరివేకో ఆతుర ప్రభు చరిత్ర సునీవేకో రసియా... రామలఖన సీతా మనబసియా'... అనే చరణంలో వర్ణించినట్టు హనుమంతుడు మిక్కిలి శక్తిమంతుడు, వివేకవంతుడు అయినప్పటికీ, ఆయన అనన్యమైన భక్తి, సమర్పణ భావం కలిగినవాడు. తన ప్రభువైన శ్రీరాముడి ఆదేశపాలన కోసం ఆత్రుతగా ఎదురుచూస్తూ ఉంటాడు. శ్రీరాముడికి వ్యక్తిగత కార్యదర్శిలా సదా ఆయన వెంట ఉండడానికి ఒక వ్యక్తి అవసరం. ఆ కార్యం నిమిత్తమే హనుమంతుడి సృష్టి జరిగింది. హనుమంతుడు గరిమాది అష్ట సిద్ధులు కలిగినవాడు. అణిమా సిద్ధిని ఉపయోగించి... ఆయన అణువులో, పరమాణువులో సైతం ప్రవేశించగలడు. ఆయన శరీరంలోని ప్రతి కణం శక్తితో, భక్తితో నిండి ఉంటుంది. భక్తి, శక్తి వేరు కాదు. మన అంతర్గత సూక్ష్మ శరీరంలోని కుడి పార్శ్వం శక్తికి మూలమనీ, ఎడమ పార్శ్వం భక్తికి మూలమనీ చెబుతారు. గణేశుడు మనకు వివేకాన్ని ప్రసాదిస్తే... హనుమంతుడు శక్తిని ప్రసాదిస్తాడు. గణేశుడు, జ్ఞానం, చిన్నపిల్లవాడిలా అబోధిత తత్త్వం కలిగిన అవతారం. ఆయన వివేకం, విచక్షణా జ్ఞానం కలిగినవాడైతే... హనుమంతుడు సమతుల్యత, ప్రేమ తత్త్వం, ఆనందంతో నిండినవాడు. ఎవరైనా తమ భక్తులకు సమస్యలు సృష్టించినట్టయితే... వారిని రక్షించడానికి గణేశుడు, హనుమంతుడు సిద్ధంగా ఉంటారు. కానీ మనం వారి ప్రేమను, కటాక్షాన్ని పొందే అర్హతను కలిగి ఉండాలి.

హనుమంతుడు మనలోని అహంకారానికి, విపరీతమైన ఆలోచనలకు విరుగుడు మందు వేస్తాడు. లంకలో రావణుడు "నువ్వొక వానరానివి, నువ్వేమి చేయగలవు" అని పరిహసించినప్పుడు... రావణ సభలోను, అనంతరం లంకా నగరంలోనూ హనుమంతుడు బీభత్సం సృష్టించి, గుణపాఠం నేర్పిన సందర్భం దీనికి ఉదాహరణ. హనుమంతుడు ప్రేమమయుడు, కరుణామూర్తి. అయితే ఇతరులను బాధపెట్టే, హింసించే వారిని ఏమాత్రం ఉపేక్షించడు. ఆయన తన శక్తితో లంకాదహనం చేశాడే కానీ... ఎవరినీ దహించలేదు. అయితే రావణుడు భీతిల్లేలా చేశాడు. అంతటి వివేకం, సమతుల్యతా కలిగినవాడు ఆంజనేయుడు. తలచుకుంటే సీతాదేవిని ఆయన అవలీలగా రాముని చెంతకు చేర్చగలడు. కానీ సీతామాత ఆజ్ఞను శిరసావహించాడు. రామరావణ యుద్ధం జరిగి, రావణుణ్ణి రాముడు వధించాల్సి ఉంది... కాబట్టే ఈ విధంగా జరిగింది.

హనుమంతుడిలోని శరణాగతి, సమర్పణభావం అపూర్వమైనవి. మనం గురువుకు, భగవంతుడికి శరణాగతి కావడానికి దోహదపడే శక్తి ఆయన నుంచే ప్రాప్తిస్తుంది. లంకలో సీతమ్మను హనుమంతుడు కలిసినప్పుడు... ఆమె గోళాలలాంటి బంగారు పూసలతో కూడిన ఒక కంఠాభరణాన్ని హనుమంతుడికి బహుమతిగా ఇస్తుంది. అప్పుడు అతను ఆ గోళాలన్నిటినీ ఒక్కొక్కటిగా తెరిచి చూస్తాడు. తన ఆరాధ్యదైవమైన రాముడు వాటిలో కనిపించలేదు. "నా శ్రీరామచంద్రుడు లేని ఈ గొలుసును నేనేం చేసుకోవాలి?" అని అంటాడు సీతమ్మతో. "రాముడు మరెక్కడో కాదు... నా హృదయంలోనే నెలవై ఉన్నాడ"ని తన హృదయ కవాటాలను తెరిచి చూపిస్తాడు. హనుమంతుడి నుంచి నేర్చుకోవలసింది... భక్తిని. ఆయన పట్ల మన భక్తి స్వచ్ఛమైనది, వాస్తవమైనదీ అయితే... మనల్ని తాకడానికి కూడా ఎవరూ సాహసించరు. కేవలం హనుమంతుణ్ణి పదేపదే స్మరిస్తూ, పూజించినంత మాత్రాన సరిపోదు. ఆ ప్రార్థన అనన్యమైన భక్తిశ్రద్ధలతో, హృదయపూర్వకంగా ఉండాలి. మనిషి సాధారణంగా తన భవిష్యత్తు గురించి ఎక్కువగా ప్రణాళికలు వేస్తూ ఉంటాడు. ఇది పింగళానాడి తాలూకు లక్షణం. మరికొందరు అతిగా, అది కూడా మన ఆధీనంలో లేని వాటి కోసం ప్రణాళికలు వేస్తూ ఉంటారు. ఇది మన కుడిపార్శ్వంలో అధిక వేడిమికి కారణం అవుతుంది. దానివల్ల పింగళానాడి సమతుల్యత కోల్పోయి, మనం అనారోగ్యం బారిన పడతాం.. అటువంటి సమయాల్లోనే హనుమంతుణ్ణి ఆశ్రయించాలి. మన పింగళానాడిని అధిష్ఠించి ఉన్న హనుమంతుణ్ణి జాగృతం చేసుకోవాలి. ఆయన లక్షణాలను మనలో స్థిరపరుచుకోవాలి. అప్పుడు ఆయన మన ప్రణాళికలను క్రమబద్ధీకరిస్తాడు, మనల్ని సమతుల్యతలో ఉంచుతాడు. సహజయోగ సాధన ద్వారా కుండలినీ జాగృతి జరిగి, మనం ఆత్మసాక్షాత్కారం పొందినప్పుడు... మనలో హనుమంతుడి లక్షణాలు సహజసిద్ధంగా స్థిరపడతాయని సహజయోగప్రదాత శ్రీమాతాజీ నిర్మలాదేవి తన ప్రవచనాల్లో వివరించారు.



మనిషి సాధారణంగా తన భవిష్యత్తు గురించి ఎక్కువగా ప్రణాళికలు వేస్తూ ఉంటాడు. ఇది పింగళానాడి తాలూకు లక్షణం. మరికొందరు అతిగా, అది కూడా మన ఆధీనంలో లేని వాటి కోసం ప్రణాళికలు వేస్తూ ఉంటారు. ఇది మన కుడిపార్శ్వంలో అధిక వేడిమికి కారణం అవుతుంది. దానివల్ల పింగళానాడి సమతుల్యత కోల్పోయి, మనం అనారోగ్యం బారిన పడుతాం.. అటువంటి సమయాల్లోనే హనుమంతుణ్ణి ఆశ్రయించాలి.

కాబట్టి హనుమాన్ చాలీసా ఆఖరి దోహాలో తులసీదాస్ వర్ణించినట్టు... "ఓ పవన తనయా... సర్వ సంకట హారీ... సర్వ మంగళ రూపా... వీర హనుమా... శ్రీ ఆంజనేయా... సీతారామ లక్ష్మణ సమేతుడవై నా హృదయ కమలంలో కొలువై ఉండు" అని ఆయనను శరణు వేడుదాం.

(23న హనుమద్విజయోత్సవం)

డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



గీతాసారం

కర్మఫల త్యాగం

జీవితంలో ఎన్నో కష్టసుఖాలు, ఎత్తుపల్లాలు ఎదురవుతాయి. వాటిని మనం ఎలా తట్టుకోగలమనేదే ప్రధానం. మనం చేసే కర్మలు, ఇతరుల కర్మలు మనకు సంతోషాన్నో లేదా దుఃఖాన్నో ఇస్తాయనే భ్రమలో ఉంటాం. కాబట్టి దుర్భరమైన దశలో ఉన్నప్పుడు... నిరాశ చెందడం, కర్మలను త్యజించడం వైపు మొగ్గు చూపడం సహజం. అర్జునుడు కూడా అదే సందిగ్ధంలో ఉన్నాడు. 'యుద్ధంలో పోరాడడం' అనే తన కర్మను వదులుకోవాలని అనుకుంటున్నాడు.

"ఎవరైతే తమ క్రియల ద్వారా వచ్చే ఫలితాల మీద (కర్మ ఫలం మీద) ఆధారపడకుండా తన విద్యుక్త ధర్మాన్ని ఆచరిస్తారో వారే సన్యాసులు, యోగులు. వారు త్యజించేది కర్మఫలాన్ని తప్ప కర్మను కాదు" అని శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు. విద్యుక్త ధర్మం లేదా నిర్దేశిత ధర్మం అనే మాటను వివరిస్తున్న కొద్దీ గందరగోళం పెరుగుతుంది, ఎందుకంటే అది పూర్తిగా ప్రయోగాత్మకమైనది. ఈతను నేర్చుకోవాలనుకొనేవారు నీటిలోకి దూకాలి. అదే విధంగా విద్యుక్త ధర్మాన్ని లేదా విధిని గురించి అర్థం చేసుకోవాలంటే... ఇంద్రియాల సహాయం లేకుండా ఆనందంగా ఉండాలి.



విత్తనానికి పైన ఉండే పొర... లోపల ఉన్న అంకురాన్ని కాపాడుతుంది, తగిన పరిస్థితుల్లో అది మొలకెత్తడానికి దారి ఇస్తుంది. ఇది మనకు చాలా సహజంగా కనిపిస్తుంది కానీ... ఆ పొర దృక్పథం నుంచి చూసినప్పుడు ఇది గందరగోళంగా ఉంటుంది. ఎందుకంటే అంకురాన్ని మొదట అది కాపాడుతుంది, ఆ తరువాత విడిచిపెడుతుంది. అదే విధంగా గతం తాలూకు భారం, భవిష్యత్తుకు సంబంధించిన అంచనాలు లేకుండా... శక్తిమంతమైన ప్రస్తుత క్షణం మనకు ప్రసాదించిన కర్మను నిర్వహించడమే విద్యుక్త ధర్మం లేదా విధి. సన్యాసి కర్మఫలాన్ని త్యజిస్తాడు తప్ప కర్మను కాదని శ్రీకృష్ణుడు చెప్పాడు. 'పూర్తిగా కర్మను మానేస్తే బాధ ఉండదు, పాపం ఉండదు' అనే భావనలో ఉంటాం. 'కర్మ చెయ్యాలి, కర్మ ఫలం గురించి ఆలోచన వదిలెయ్యాలి' అనే శ్రీకృష్ణుడి సూచన ఆ భావనను పటాపంచలు చేస్తుంది. ఆయన సూచనను మనం అనుసరిస్తే... పలాయనవాదాన్ని ఆశ్రయించకుండా మనలో ప్రతి ఒక్కరికీ సన్యాసి అయ్యే అర్హత కలుగుతుంది. ఎలాంటి పరిస్థితులు ఎదురైనప్పటికీ, ఒక వ్యక్తి కర్మఫలాన్ని వదులుకున్నప్పుడు... ఆ క్షణంలో అతను సన్యాసికి లభించే ఆనందానికి అర్హుడవుతాడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

దైవమార్గం

క్రీస్తు తొలి అద్భుతం

అది గలలియా నదీతీరంలోని ఒక చిన్న పల్లెటూరు. ఆ ఊరిలో వివాహం జరుగుతోంది. పెళ్ళివారి ఆహ్వానం మేరకు తల్లి మరియతో పాటు ఏసు క్రీస్తు కూడా వెళ్ళాడు. వేడుకలకు హాజరయ్యే అతిథులకు ద్రాక్షరసం ఇవ్వడం అక్కడ ఆనవాయితీ. అయితే తెచ్చిన ద్రాక్షరసం అయిపోయింది. పేదవారైన వధువు తల్లితండ్రులు తమ పరువు పోతుందనే ఆందోళనలో ఉన్నారు. వారి దుఃఖం తీర్చడానికి... ఏసు క్రీస్తు తన తల్లి సూచన మేరకు ఖాళీ బానల్లో నీళ్ళు పోయించాడు. ఆ నీటిని ద్రాక్షరసంగా మార్చి, అందరిలో ఆశ్చర్యాన్ని ఆనందాన్ని నింపాడు.

ఖాళీ బానల్లో నీరు పోయించే బదులు... బానలతో ద్రాక్షరసాన్ని కూడా ఆయన సృష్టించి ఉండవచ్చు కదా? నీరు పోయించి, దాన్ని ద్రాక్షరసంగా మార్చడం అవసరమా? కానీ దీనిలో ఒక అంతరార్థం ఉంది. అప్పటివరకూ ఎన్నో మూఢనమ్మకాలు, సమాజ తిరోగమనానికి ఆటంకంగా నిలుస్తున్న పాత పద్ధతులు కొనసాగుతున్నాయి. అవి పాత బానల్లో ఎప్పుడూ పోసే నీళ్ళలాంటివి అయితే... వాటిని ద్రాక్షరసంగా... అంటే కొత్తగా మార్చుకోవాల్సిన అవసరం ఉంది. 'పాతవాటిని ఇప్పటికైనా ప్రయోజనకరంగా పునరుద్ధరించుకుందాం. మానవ అభ్యుదయానికి దోహదం చేసేలా మార్చుకుందాం' అనే సందేశాన్ని ఇవ్వడం ఏసు ప్రభువు ఉద్దేశం. ఇది ఆయన చేసిన తొట్టతొలి అద్భుతం.



ఇలా ఆయన చేసిన ప్రతి అద్భుతం వెనుక, చెప్పిన ప్రతి ఉపమానం వెనుక ఒక మహత్తర సందేశం దాగి ఉంటుంది. ఆ సందేశాన్ని చిన్న పిల్లలకు కూడా అర్థమయ్యేలా చెప్పడం ప్రభువు ప్రత్యేకత. సువార్తికులందరూ నేర్చవలసిన మహత్తరమైన కళ. ఆయన ఏ అద్భుతాన్నీ తన ఔన్నత్యాన్ని ప్రకటించుకోవడానికో, ఇంద్రజాల ప్రదర్శనకో చూపలేదు. ఆవశ్యకతను బట్టి... దీనజనోద్ధరణ కోసమే చేశాడు. ఒక్కొక్క అద్భుతంలో ఒక ఆంతర్యం... అన్నిటిలోనూ మానవాళిపట్ల ఆయనకు ఉన్న అపారమైన ప్రేమ కనిపిస్తాయి.


ఈ నేల మీద ఎందరెందరో పుట్టారు. ఈ సమాజాన్ని మార్చడానికి బోధలు చేశారు. కానీ కొందరి ప్రవర్తనలో మాత్రమే ఆ బోధలు ప్రతిఫలించాయి. ఈ విశేషం క్రీస్తులో పుష్కలం, పరిపూర్ణం. బోధకుల మాటలకు, చేతలకు సమన్వయం కుదిరినప్పుడే ప్రజల్లో సంపూర్ణ విశ్వాసం కలుగుతుంది. దైవకార్యాన్ని నెరవేర్చడానికి మానవలోకానికి క్రీస్తు వచ్చాడు. ఆయన చేసిన అద్భుతాలన్నీ మానవజాతి తన మూఢభావాల నుంచి విముక్తం కావాలని, చీకటి నుంచి వెలుగులోకి నడవాలని సంకల్పించినవే. చైతన్యపూరితమైన ఆయన ప్రసంగాలు, నిరక్షరాస్యులైనా అతి సులువుగా గ్రహించేలా చెప్పిన కథలు... ఇప్పటికీ వాడని పూలలా వికసిస్తూనే ఉన్నాయి. సూక్తి సుగంధాలను విరజిమ్ముతూనే ఉన్నాయి. తోటి మనిషి కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడాలనే సత్యాన్ని బోధించడానికి శిలువపై ఆయన చేసిన ప్రాణత్యాగం ఒక గొప్ప ఉదాహరణ.

• డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు, 9866755024

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/K95Kdskలో చదవండి.

సద్బోధ

గజదొంగ పశ్చాత్తాపం



పూర్వం రాజగృహ అనే పట్టణంలో లోహకురుడనే దొంగ ఉండేవాడు. అతను చాలా క్రూరుడిగా, ప్రమాదకరమైనవాడిగా పేరు పొందాడు. లోహకురుడి కొడుకు రోహిణేయుడు. తండ్రిని మించిన తెలివితేటలు, ధైర్యం కలిగినవాడు. తండ్రి అడుగుజాడల్లోనే నడిచి... గజదొంగ అయ్యాడు. లోహకురుడు వృద్ధాప్యంతో మంచం పట్టాడు. మరణించేముందు కొడుకును పిలిచి "మహావీరుడి బోధలు ఎన్నడూ వినకు. ఎందుకంటే ఆయన బోధలు మన వృత్తికి తగినవి కావు" అని చెప్పాడు. అలాగేనని తండ్రికి రోహిణేయుడు మాట ఇచ్చాడు.

కొన్నాళ్ళ తరువాత... రోహిణేయుడు ఒక నగరంలో నుంచి వెళుతూ ఉండగా... మహావీరుడు కొందరికి దీక్ష ఇస్తున్నట్టు తెలిసింది. మహావీరుడి ప్రసంగం అతనికి వినిపిస్తోంది. వెంటనే అతను చెవులు రెండూ మూసుకొని, వేగంగా నడవడం ప్రారంభించాడు. కొద్దిదూరం వెళ్ళగానే అతని కాలికి పదునైన ముల్లు గుచ్చుకుంది. ముల్లును తొలగించడానికి... ఒక చెవి మీద నుంచి చేతిని తియ్యాల్సి వచ్చింది. "ఎవరి పాదాలు నేలను తాకవో, ఎవరు కనురెప్పలు ఆర్చరో, ఎవరి శరీరానికి చెమట పట్టదో, ఎవరి మెడలో వేసిన పూల మాల వాడిపోదో... అటువంటి వారే దివ్యులైనవారు. దేవతలు" అని మహావీరుడు చెప్పిన మాటలు అతని చెవిన పడ్డాయి. తన పాదం నుంచి ముల్లును తొలగించుకున్న రోహిణేయుడు అక్కడి నుంచి బయటపడ్డాడు.

క్రమంగా అతని దుండగాలు మితిమీరాయి. అతని దోపిడీల్లో సంపద పోగొట్టుకున్నవారు రాజును కలిసి... రోహిణేయుడి బారి నుంచి తమను కాపాడాలని విన్నవించుకున్నారు. ఆ బాధ్యతలను మంత్రి అభయకుమారుడికి రాజు అప్పగించాడు. మంచి వ్యూహకర్త అయిన మంత్రి... కీలకమైన ప్రదేశాల్లో, సంపన్నులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సైనికులతో గట్టి నిఘా పెట్టాడు. వారు వలపన్ని రోహిణేయుణ్ణి పట్టుకున్నారు. అయితే అతని దగ్గర దొంగ సొత్తు ఏదీ దొరకలేదు.

న్యాయస్థానంలో రోహిణేయుణ్ణి ప్రవేశపెట్టినప్పుడు... తను దగ్గరలో ఉన్న గ్రామంలోని రైతుననీ, తనకు ఏ పాపం తెలీదనీ వాదించాడు. రాజభటులు ఆ గ్రామంలో తన గురించి ఆరా తీస్తారని అతనికి తెలుసు. అందుకే ముందుజాగ్రత్తలు కూడా తీసుకున్నాడు. అతను తమ గ్రామం వాడేనని అక్కడివారు చెప్పడంతో.... న్యాయమూర్తులు అతణ్ణి విడిచిపెట్టారు.

కానీ అతనే గజదొంగ రోహిణేయుడనేది అభయకుమారుడి నమ్మకం. ఆ సంగతి అతని నోటి నుంచే చెప్పించడానికి ఒక పథకం వేశాడు. తన మనుషులతో రోహిణేయుణ్ణి తప్పతాగించి, స్పృహ తప్పేలా చేశాడు. రోహిణేయుడికి తెలివి వచ్చేసరికి... అతని చుట్టూ పరిసరాలన్నీ స్వర్గంలా కనిపించేలా ఏర్పాటు చేశాడు. అక్కడ కొందరు మహిళలను, పురుషులను దేవదూతల వేషంలో ఉంచాడు.

రోహిణేయుడు మేలుకున్నాడు. "నేనెక్కడ ఉన్నాను?" అని అక్కడ ఉన్నవారిని అడిగాడు.

"నువ్వు స్వర్గంలో ఉన్నావు. నీ జీవితంలో చేసిన తప్పులన్నీ అంగీకరిస్తే... స్వర్గ సుఖాలు నీకు శాశ్వతంగా లభిస్తాయి" అని వారు చెప్పారు. "తక్షణం చెప్పాలి" అని ఒత్తిడి చేశారు.

రోహిణేయుడికి సందేహం కలిగింది. ఏం చేయాలని అతను ఆలోచిస్తూ ఉండగా... మహావీరుడి నుంచి విన్న మాటలు గుర్తుకువచ్చాయి. మానవుల మాదిరిగా వారి కాళ్ళు నేలను తాకుతున్నాయి. వాళ్ళు కనురెప్పలు ఆర్పుతున్నారు. వాళ్ళ శరీరాల మీద చెమట కనిపిస్తోంది. వాళ్ళ మెడలోని పూల దండల్లో కొన్ని పూలు వాడిపోయి ఉన్నాయి. 'ఇది స్వర్గం కాదు. నా నోట నేను చేసిన దోపిడీల గురించి చెప్పించడానికి వేసిన ఎత్తుగడ' అని గ్రహించాడు.

"నాకేమీ తెలీదు" అని గట్టిగా చెప్పాడు. వారు అతణ్ణి బతిమాలి, బెదిరించి... ఫలితం లేకపోవడంతో వదిలేశారు.

'మహావీరుడి మాటలు ఎంతో అద్భుతమైనవి. ఎంతో శక్తిమంతమైనవి. నేను విన్నది కొన్ని వాక్యాలే. అవి కూడా వినకూడదని ఎంతగా అనుకున్నా నా చెవిన పడ్డాయి. అవే నా జీవితాన్ని కాపాడాయి. ఇక మీదట దొంగతనాలు చేయను. మహావీరుణ్ణి ఆశ్రయిస్తాను' అని రోహిణేయుడు నిశ్చయించుకున్నాడు. గతంలో తను చేసిన పనులన్నీ తలచుకొని పశ్చాత్తాపం చెందాడు. మహావీరుణ్ణి కలుసుకొని, ఆయన పాదాలమీద పడ్డాడు.

"స్వామీ! నేను ఎన్నో పాపాలు చేశాను. ఆ జీవితం మీద విరక్తి కలిగింది. పాప విముక్తి పొందాలనుకుంటున్నాను. నన్ను మీ శిష్యుడిగా స్వీకరించండి" అని ప్రార్థించాడు. మహావీరుడు అందుకు అంగీకరించి... రోహిణేయుడికి దీక్ష ఇచ్చాడు. మహావీరుడి బోధలు వింటూ, ఆయన నిర్దేశించిన అహింస, సత్యం, ఇతరుల ఆస్తిని ఆశించకపోవడం, దొంగతనం చేయకపోవడం, బ్రహ్మచర్యం అనే పంచవ్రతాలను పాటిస్తూ కైవల్యసాధన మార్గంలో పయనించాడు రోహిణేయుడు.

సందేశం


వారికి ఎల్లప్పుడూ దైవానుగ్రహం



'తల్లితండ్రులను సేవించడమే ఉత్తమ గతులకు మార్గం' అని ఇస్లాం ధర్మం చెబుతోంది. దివ్య గ్రంథాలు సైతం ఈ విషయాన్ని స్పష్టం చేశాయి.

ఒక సందర్భంలో దైవ ప్రవక్త మహమ్మద్ చెప్పిన కథ ఇది.

ముగ్గురు వ్యక్తులు అరణ్యంలో ప్రయాణిస్తున్నారు. హఠాత్తుగా వర్షం ముంచుకురావడంతో దగ్గరలో ఉన్న ఒక గుహలోకి వెళ్ళి తలదాచుకున్నారు. వర్షం తీవ్రతకు కొండ చరియ విరిగిపోయి... ఆ గుహకు ప్రవేశద్వారానికి అడ్డంగా పడిపోయింది. దానితో ఆ బాటసారులు ముగ్గురూ అందులో చిక్కుకుపోయారు. దాని నుంచి బయటపడే పరిస్థితి లేదని వారికి అర్థమయింది. తమ జీవితాల్లో చేసిన మంచి పనులను గుర్తు చేసుకొని... తమను ఈ గండం నుంచి ఎలాగైనా బయటపడెయ్యాలని అల్లాహ్‌ను వేడుకోసాగారు. వారిలో ఇద్దరు తాము చేసిన సత్కార్యాలను గుర్తు చేసుకొని... అల్లాహ్‌ను ప్రార్థించారు. చివరి వ్యక్తి "అల్లాహ్! నాకు వృద్ధులైన తల్లితండ్రులు, చిన్నవారైన పిల్లలు ఉన్నారు. నేను గొర్రెలు కాసి నా కుటుంబాన్ని పోషించేవాణ్ణి. రోజూ గొర్రెలను మేపి, ఇంటికి రాగానే... పాలు తీసి నా తల్లితండ్రులకు ఇచ్చేవాణ్ణి. ఆ తరువాత నా పిల్లలకు ఇచ్చేవాణ్ణి. ఒక రోజు నేను ఇంటికి వచ్చేసరికి ఆలస్యమయింది. నా తల్లితండ్రులు నిద్రపోయారు. వారికి నిద్రాభంగం కలిగించడం ఇష్టం లేకపోయింది. మరోవైపు నా పిల్లలు ఆకలితో ఉన్నారు. అయినప్పటికీ వారికి ముందుగా పాలు ఇవ్వడం నా తల్లితండ్రుల పట్ల అవిధేయతగా భావించి... ఆ పాల పాత్రతో వారు లేచే వరకూ అక్కడే నిలబడి ఉన్నాను. నా పట్ల ప్రసన్నుడవై... ఈ బండరాయిని తొలగించు" అని కోరాడు. గుహ ప్రవేశ ద్వారాన్ని మూసేసిన ఆ బండరాయి తక్షణమే తొలగిపోయింది. ఆ బాటసారులు క్షేమంగా బయటపడ్డారు. తల్లితండ్రులను సేవిస్తూ, వారిపట్ల విధేయతతో మెలగినవారికి అల్లాహ్ అనుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుందని దైవ ప్రవక్త ఈ కథ ద్వారా స్పష్టం చేశారు.



లోకగౌరవం పొందాలంటే...

సుభాషితం



దాక్షిణ్యం స్వజనే, దయా పరిజనే,
శాఠ్యం సదా దుర్జనే
ప్రీతిః సాధుజనే నయో నృపజనే,
విద్వజ్జనే చార్జవమ్
శౌర్యం శత్రుజనే, క్షమా గురుజనే,
కాంతాజనే ధృష్టతా
యే చైవం పురుషాః కలాసు కుశలాస్తే
ష్వేవలోకస్థితిః

లోకుల నుంచి గౌరవం పొందడం కోసం వ్యక్తులకు ఉండవలసిన గుణాలను, లక్షణాలను భర్తృహరి తన 'నీతి శతకం'లోని ఈ శ్లోకంలో తెలియజేశాడు. దాన్ని...

వరకృప భృత్యులందు నిజ వర్గమునం
దనుకూల వృత్తి కా
పురుషులయందు శాఠ్యము సుబుద్ధులయం
దనురక్తి దాల్మి స
ద్గురువులయందు గౌరవము కోవిదు
లందు నయంబు రాజులం
దరిజనులందు శౌర్యము మృగాక్షులయందు
బ్రగల్భభావ మీ
వరుస కళాప్రవీణులగు వారలయందు
వసించు లోకముల్... అని చక్కటి తెలుగులో అందించాడు ఏనుగు లక్ష్మణకవి.

భావం: సేవకుల పట్ల దయ, బంధువుల పట్ల ఆప్యాయత, దుష్టుల విషయంలో కాఠిన్యం, సజ్జనులకు ప్రీతిపాత్రంగా ఉండడం, పెద్దల పట్ల ఓర్పు, గురువులపై గౌరవం, పాలకుల పట్ల వినయం, శత్రువులపై శౌర్యం, స్త్రీల పట్ల సమభావం, దృఢచిత్తం కలిగి నడుచుకొనేవారు ఉత్తములు. వారికి ఈ లోకమంతా అనుకూలంగా ఉంటుంది.

అశోకుడి 9వ రహస్యం



'హనుమాన్' చిత్రంతో పాన్ ఇండియా లెవెల్ సక్సెస్‌ను అందుకున్నారు తేజ సజ్జా. ఆయన కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో మరో సూపర్ హీరో తరహా పాత్రలో నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమా టైటిల్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్‌ను నిర్మాత డి. సురేశ్‌బాబు లాంచ్ చేశారు. ఈ చిత్రం పేరు 'మిరాయ్: సూపర్ యోధా'. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మాట్లాడుతూ "మిరాయ్ అనేది అశోకుని కాలంలో రహస్యమైన ఓ శాసనం. 'హనుమాన్'కు ముందే ఈ సినిమా కథను తేజకు చెప్పాను" అని అన్నారు. చిత్ర నిర్మాత టి.జి విశ్వప్రసాద్ మాట్లాడుతూ "కార్తీక్ విజన్ అద్భుతంగా ఉంటుంది. అది ఈ సినిమాలో స్పష్టంగా కనిపిస్తుంది" అని చెప్పారు. తేజ సజ్జ మాట్లాడుతూ "ఈ చిత్రం అశోక రాజు, అతని 9 రహస్యాల ఆధారంగా రూపొందుతోంది. అశోకుడి 9వ రహస్యానికి గ్రహణం రాకుండా అడ్డుకునే యోధుడి పాత్రను పోషిస్తున్నాను" అని చెప్పారు. పీరియాడికల్ సూపర్ హీరో ఫాంటసీగా తెరకెక్కిస్తున్న 'మిరాయ్' చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 18న ఎనిమిది భాషల్లో 2డి, 3డి వెర్షన్స్‌లో విడుదల చేస్తున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది.

అయోధ్య సందర్శించిన మిస్టర్ బచ్చన్



రవితేజ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'మిస్టర్ బచ్చన్' చిత్రం ఉత్తరప్రదేశ్ షెడ్యూల్ పూర్తయింది. 30 రోజుల పాటు అక్కడ కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. అక్కడి నుంచి అయోధ్య వెళ్లి రామ్ లల్లా ఆశీస్సులు తీసుకుని హైదరాబాద్ చేరుకుంది యూనిట్. ఈ సినిమాలో రవితేజ పవర్‌ఫుల్ క్యారెక్టర్ పోషిస్తున్నారు. ఆయన సరసన భాగ్యశ్రీ బోర్సే నటిస్తోంది. జగపతిబాబు కీలక పాత్రధారి. మిగిలిన నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత మేకర్స్ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీజే మేయర్, సినిమాటోగ్రఫీ: అయనంక బోస్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్.

ఆద్యంతం వినోదభరితం



'చుట్టాలబ్బాయి' సినిమా తర్వాత నటుడు ఆది సాయికుమార్, దర్శకుడు వీరభద్రం చౌదరి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'కృష్ణ ఫ్రమ్ బృందావనం'. దిగంగనా సూర్యవంశీ హీరోయిన్. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ మూవీని తూము నరసింహా, జామి శ్రీనివాసరావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ గురువారం ప్రారంభమైంది. ముహూర్తపు షాట్‌కు నిర్మాత దిల్‌రాజు క్లాప్ ఇచ్చారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి గౌరవ దర్శకత్వం వహించారు. నటుడు సాయికుమార్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర డైరెక్టర్ వీరభద్రం చౌదరి మాట్లాడుతూ "ఈ సినిమా ఆద్యంతం వినోదభరితంగా ఉంటుంది" అని చెప్పారు. హీరో ఆది సాయికుమార్ మాట్లాడుతూ "కుటుంబమంతా కలసి చూసి హాయిగా నవ్వుకునేలా ఈ చిత్రం ఉంటుంది" అని అన్నారు.




జన కేతనం

ఏపీ ఎన్నికల ప్రత్యేకం

2024 AP ELECTIONS

ఏపీ సీఎస్, డీజీపీ ఔట్!?

మరో ఆరుగురు ఐఏఎస్, ఐపీఎస్‌లూ... రంగం సిద్ధం చేసిన ఎన్నికల కమిషన్





అమరావతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కుతూ ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి సేవలో తరిస్తున్న మరికొందరు ఉన్నతాధికారులపై వేటుకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డిని ఆ పదవుల నుంచి పక్కకు తప్పించడం ఖాయమని తెలుస్తోంది. వీరితోపాటు అరడజను మంది ఐఏఎస్, ఐపీఎస్‌లపై ఈసీ కన్నెర్ర చేసిందని.. వీరిని బదిలీ చేసేందుకు రంగం సిద్ధమైనట్లు అధికార వర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. దీనిపై నేడో, రేపో ఉత్తర్వులు వచ్చే అవకాశముంది. అదే జరిగితే.. ఇటు సీఎస్‌ను, అటు పోలీస్ బాస్‌ను ఒకేసారి పక్కకు తప్పించడం ఇదే తొలిసారి అవుతుంది. సీఎస్ జవహర్ రెడ్డి తొలి నుంచీ జగన్ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ వస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత కూడా ఆయన వ్యవహార శైలిలో ఏ మాత్రం మార్పు రాలేదు. వైసీపీకి రాజకీయంగా లబ్ధి కలగడమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా ఉంచాలన్న ఈసీ ఆదేశాలను ఆసరాగా తీసుకుని.. ఉద్దేశపూర్వకంగానే పింఛన్ల పంపిణీని ఆలస్యం చేసి, ఈ పాపాన్ని విపక్షాలపై నెట్టేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు వచ్చాయి. గీత దాటి వైసీపీ కోసం ప్రచారం చేస్తున్న సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డిని సస్పెండ్ చేయాలని ఈ నెల 8న ఈసీ ఆదేశాలు జారీ చేసింది. కానీ.. జవహర్ రెడ్డి దీనిపై చర్యలు తీసుకోకుండా ఫైలును అలా తొక్కి పెట్టారు. తప్పనిసరి పరిస్థితుల్లో గురువారం సాయంత్రానికి వెంకట్రామి రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక.. రాష్ట్ర రెవెన్యూ ఇంటెలిజెన్స్ కమిషనర్ చిలకల రాజేశ్వరరెడ్డి డిప్యుటేషన్‌ను మధ్యలోనే రద్దు చేసి తిరిగి పంపించాలని కేంద్రం జారీ చేసిన ఆదేశాలనూ జవహర్ రెడ్డి పట్టించుకోలేదు. ఇలాంటి అనేక అంశాలను పరిశీలించిన ఈసీ.. జవహర్ రెడ్డి వ్యవహార శైలి నిష్పాక్షికంగా లేదని, ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవడం లేదనే నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. వీటన్నింటిపై విచారణ జరిపిన తర్వాతే జవహర్ రెడ్డిని సీఎస్ పోస్టు నుంచి తప్పించాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. పోలీస్ బాస్ కసిరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డిపైనా బదిలీ వేటుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. పేరుకు ఆయన డీజీపీ అయినా రాష్ట్ర పోలీస్ యంత్రాంగమంతా 'తాడేపల్లి' డైరెక్షన్‌లోనే నడుస్తోందనే ఆరోపణలు చాన్నాళ్లుగా ఉన్నాయి. చిలకలూరిపేటలో ప్రధాని మోదీ పాల్గొన్న సభలో భద్రతపై రాజేంద్రనాథ్ రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారన్న విమర్శలున్నాయి. ఆయనకు జిల్లా ఎస్పీలపై పట్టు లేదనే ప్రచారం కూడా ఉంది.

గాజు గ్లాసుపై పేచీ!

- జనసేన బరిలో ఉన్న చోటే ఆ పార్టీకి ఆ గుర్తు
- మిగిలిన చోట్ల స్వతంత్రులకూ ఇచ్చే చాన్సు
- ఈసీ దృష్టికి తీసుకెళ్లనున్న కూటమి

అమరావతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏపీలో జనసేనకు గాజు గ్లాసును ఎన్నికల గుర్తుగా ఇవ్వడాన్ని హైకోర్టు అనుమతించింది. కానీ ఆ తర్వాత మరో సమస్య వచ్చి పడింది. ఆ పార్టీ పోటీ చేస్తున్న చోట మాత్రమే ఆ పార్టీ అభ్యర్థులకు ఈ గుర్తు కేటాయిస్తారు. జనసేన అభ్యర్థులు లేని చోట్ల స్వతంత్ర అభ్యర్థులు అడిగితే ఈ గుర్తు కేటాయిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి స్పష్టం చేశారు. కూటమిలో భాగస్వామిగా జనసేన 21 అసెంబ్లీ సీట్లకు, రెండు ఎంపీ సీట్లకు పోటీ చేస్తోంది. మిగిలిన చోట్ల ఆ పార్టీ మిత్రపక్షాలు టీడీపీ, బీజేపీ బరిలో ఉన్నాయి. జనసేన అభ్యర్థులు లేని చోట గాజు గ్లాసు గుర్తు స్వతంత్ర అభ్యర్థులకు కేటాయిస్తే తాము నష్టపోతామని రెండు పార్టీల నేతలు ఆందోళన చెందుతున్నారు. 'కాకినాడ, మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గాల్లో జనసేన అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వాళ్లు తమ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో గాజు గ్లాసు గుర్తును ప్రచారం చేసుకుంటారు. అదే లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో టీడీపీ, జనసేన పోటీచేసే అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్వతంత్ర అభ్యర్థులకు గాజు గ్లాసు గుర్తు వస్తే ఏమిటీ పరిస్థితి? ఓటర్లకు ఇది అయోమయం కలిగించదా? కూటమి ఓట్లు చెదిరిపోవా' అని ఒక నేత ప్రశ్నించారు. సమస్యను కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని కూటమి వర్గాలు భావిస్తున్నాయి.

ఉండి నుంచే రఘురామ పోటీ

నలుగురు అసెంబ్లీ అభ్యర్థుల మార్పునకు టీడీపీ కసరత్తు



అమరావతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రకటించిన వారిలో నలుగురు అసెంబ్లీ అభ్యర్థులను తెలుగుదేశం పార్టీ మార్చింది. గురువారమిక్కడ పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన జోనల్ ఇన్‌చార్జుల సమావేశంలో పార్టీ అధినేత చంద్రబాబు ఈ విషయం తెలియజేశారు. తాజా మార్పుల ప్రకారం నరసాపురం సిటింగ్ ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు అదే జిల్లా పరిధిలోని ఉండి అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేయనున్నారు. ఆ ఎంపీ స్థానం పొత్తులో బీజేపీకి వెళ్లింది. రఘురామ కోసం ఆ సీటును తమకివ్వాలని చంద్రబాబు కోరినా బీజేపీ నాయకత్వం సమ్మతించలేదు. దీంతో రఘురామను ఉండి అసెంబ్లీ స్థానంలో పోటీ చేయించాలని చంద్రబాబు నిర్ణయించారు. అక్కడ టీడీపీ తమ అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజును ఇదివరకే ప్రకటించింది. ఆయనకు నచ్చజెప్పి పోటీ నుంచి విరమింపజేసే బాధ్యతను చంద్రబాబు తమ పార్టీ నేతలకు అప్పగించారు. అనకాపల్లి జిల్లాలోని మాడుగులలో కూడా టీడీపీ తమ అభ్యర్థిని మార్చింది. ఇక్కడ అంతకు ముందు ప్రవాసాంధ్రుడు పైలా ప్రసాదరావుకు సీటిచ్చారు. ఆయన క్షేత్ర స్థాయిలో ప్రచారంలో వెనుకబడ్డారని అధినాయకత్వానికి నివేదికలు అందాయి. దీంతో ఆయన్ను మార్చి బండారు సత్యనారాయణమూర్తిని అభ్యర్థిగా ఎంపిక చేశారు. అలాగే మడకశిర(ఎస్సీ)లో ప్రస్తుత అభ్యర్థి అనిల్ కుమార్‌ను మార్చాలని నిర్ణయించారు. ఈ సీటును పార్టీ దళిత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజుకు ఇవ్వనున్నారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె అభ్యర్థి జయచంద్రారెడ్డిని కూడా మార్చబోతున్నారు. ప్రత్యామ్నాయంగా మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మాలపాటి రమేశ్ సతీమణి సరళారెడ్డి, మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్, చిప్ తయారీ బహుళ జాతి సంస్థలో ఉన్నత స్థాయిలో పనిచేస్తున్న కొండా నరేంద్ర పేర్లు వినిపిస్తున్నాయి.









నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం.

లఖ్‌నవూ X చెన్నై

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు) **361** (7 మ్యాచ్‌లు)	బుమ్రా (ముంబై) **13** (7 మ్యాచ్‌లు)




హమ్మయ్య.. ముంబై

ఆఖరి ఓవర్‌లో విజయం • సూర్యకుమార్ అర్ధసెంచరీ
వణికించిన పంజాబ్ • అశుతోష్ పోరాటం వృథా


సూర్యకుమార్ (53 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 78)


బుమ్రా (3/21)

ముల్లాపూర్: అశుతోష్ శర్మ (28 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్సర్లతో 61) అసాధారణ ఇన్నింగ్స్‌తో విజయంపై ఆశలు కోల్పోయిన ముంబై ఇండియన్స్.. చివరకు ఆఖరి ఓవర్‌లో గట్టెక్కింది. 193 పరుగుల ఛేదనలో పంజాబ్ స్కోరు ఓ దశలో 14/4 మాత్రమే. కానీ ఈ స్థితి నుంచి అశుతోష్, శశాంక్ సింగ్ (25 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 41) మ్యాచ్‌ను చివరి వరకు తెచ్చారు. కానీ కీలక దశలో ముంబై పేసర్లు బుమ్రా, కొట్జీ వీరి వికెట్లు తీసి జట్టును ఆదుకున్నారు. దీంతో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో హార్దిక్ సేన 9 పరుగుల తేడాతో నెగ్గింది. ఈ సీజన్‌లో చివరి ఓవర్‌లో పంజాబ్ ఓడడం ఇది నాలుగోసారి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 7 వికెట్లకు 192 పరుగులు చేసింది. సూర్యకుమార్ (53 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 78), రోహిత్ (36), తిలక్ (34 నాటౌట్) రాణించారు. హర్షల్‌కు మూడు, కర్రాన్‌లకు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ 19.1 ఓవర్లలో 183 పరుగులు చేసి ఓడింది. బుమ్రా, కొట్జీలకు మూడేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బుమ్రా నిలిచాడు.

1 ముంబై ఇండియన్స్ తరఫున ఎక్కువ సిక్సర్లు (224) బాదిన బ్యాటర్‌గా రోహిత్

బెదరగొట్టిన అశుతోష్: పిచ్‌ను సద్వినియోగం చేసుకుంటూ ముంబై పేసర్లు కొట్జీ, బుమ్రా చెలరేగడంతో పంజాబ్ ఛేదన పేలవంగా ఆరంభమైంది. కానీ ఓవైపు వికెట్లు నేలకూలుతున్నా మధ్య ఓవర్లలో శశాంక్-అశుతోష్ జోడీ రన్‌రేట్ తగ్గకుండా ఆడడంతో ముంబైకి ఓటమి కళ్లముందు కనిపించింది. తొలి 13 బంతుల్లోనే ప్రభ్‌సిమ్రన్ (0), రొసో (1), కర్రాన్ (6), లివింగ్‌స్టోన్ (1) పెవిలియన్‌కు చేరడం దెబ్బతీసింది. అప్పటికి స్కోరు 14 పరుగులే. బుమ్రా ఒకే ఓవర్‌లో రొసో, కర్రాన్‌ల వికెట్లతో షాకిచ్చాడు. ఈ స్థితిలో శశాంక్ ఆదుకునే ప్రయత్నం చేశాడు. ఏడో ఓవర్‌లో హర్‌ప్రీత్ సింగ్ (13)ను శ్రేయాస్ గోపాల్ రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేయగా ఐదో వికెట్‌కు 35 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరో ఎండ్‌లో జితేశ్ (9)ను పేసర్ ఆకాశ్ ఎల్బీ చేయడంతో 77/6 స్కోరుతో పంజాబ్ కష్టాలు రెట్టింపయ్యాయి. కానీ అశుతోష్ ముంబైపై ఎదురుదాడికి దిగాడు. శశాంక్-అశుతోష్ జోడీ పంజాబ్ విజయంపై ఆశలు రేకెత్తించిన వేళ.. బుమ్రా ఝలక్ ఇచ్చాడు. 13వ ఓవర్‌లో శశాంక్ వికెట్ తీశాడు. 16వ ఓవర్‌లో రెండు అద్భుత సిక్సర్లతో అశుతోష్ 23 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేయగా, బ్రార్ మరో సిక్సర్‌తో మధ్వాల్ 24 పరుగులిచ్చుకున్నాడు. దీంతో సమీకరణం 24 బంతుల్లో 28 రన్స్‌కు మారడంతో మ్యాచ్ పంజాబ్ వైపు మొగ్గింది. ఈ దశలో బుమ్రా 3 పరుగులే ఇవ్వగా.. 18వ ఓవర్‌లో అశుతోష్‌ను కొట్జీ అవుట్ చేయడంతో ఒక్కసారిగా ముంబైలో జోష్ కనిపించింది. దీనికి తోడు తర్వాతి ఓవర్‌లోనే బ్రార్ సైతం అవుట్ కావడంతో ఇక ఆశలు లేకుండా పోయాయి. చివర్లో రబాడ (8) సిక్సర్‌తో ఆరు బంతుల్లో 12 రన్స్ అవసరమైనా, తొలి బంతికే అతను రనౌట్ కావడంతో ఎంఐ ఊపిరిపీల్చుకుంది.


అశుతోష్ శర్మ (28 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్సర్లతో 61)

సూర్య అర్ధసెంచరీ: టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన ముంబై త్వరగానే ఓపెనర్ ఇషాన్ (8) వికెట్‌ను కోల్పోయినా.. సూర్యకుమార్ అదరగొట్టాడు. రోహిత్, తిలక్ సహకారమందించడంతో ఎంఐ సవాల్ విసిరే స్కోరును సాధించింది. ఐదో ఓవర్‌లో రోహిత్‌ను ఎల్బీగా అవుటిచ్చినా రివ్యూకు వెళ్లడంతో బతికిపోయాడు. ఆరో ఓవర్‌లో అతడి సిక్సర్‌తో ముంబై పవర్‌ప్లేలో 54/1 స్కోరుతో పర్వాలేదనిపించింది. అనంతరం సూర్య ఎక్కువగా స్ట్రయికింగ్ తనే తీసుకుంటూ అడపాదడపా బౌండరీలతో చెలరేగాడు. దీంతో 34 బంతుల్లో అతడి ఫిఫ్టీ పూర్తయ్యింది. అటు 12వ ఓవర్‌లో పేసర్ కర్రాన్‌కు రోహిత్ చిక్కడంతో రెండో వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో 22 బంతులపాటు ఒక్క బౌండరీ కూడా నమోదు కాలేదు. ఇక 16వ ఓవర్‌లో రివ్యూ ద్వారా ఎల్బీ నుంచి గట్టెక్కిన సూర్య చెలరేగి 4,6,6తో 18 రన్స్ రాబట్టాడు. కానీ సెంచరీ ఖాయమనిపించిన తరుణంలో సూర్యను కర్రాన్.. కెప్టెన్ హార్దిక్ (10)ను హర్షల్ వరుస ఓవర్లలో అవుట్ చేశారు. మరోవైపు 19వ ఓవర్‌లో టిమ్ డేవిడ్ (14) 4,4,6తో 18 రన్స్ అందించగా, స్కోరు 200 దాటుతుందనిపించింది. అయితే ఆఖరి ఓవర్‌లో హర్షల్ 7 పరుగులే ఇచ్చి డేవిడ్, షెఫర్డ్ (1)ల వికెట్లు తీశాడు. నబీ (0) రనౌటయ్యాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	7	6	1	0	12	0.677
కోల్‌కతా	6	4	2	0	8	1.399
చెన్నై	6	4	2	0	8	0.726
హైదరాబాద్	6	4	2	0	8	0.502
లఖ్‌నవూ	6	3	3	0	6	0.038
ఢిల్లీ	7	3	4	0	6	-0.074
ముంబై	7	3	4	0	6	-0.133
గుజరాత్	7	3	4	0	6	-1.303
పంజాబ్	7	2	5	0	4	-0.251
బెంగళూరు	7	1	6	0	2	-1.185

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

ముంబై: ఇషాన్ (సి) హర్‌ప్రీత్ (బి) రబాడ 8, రోహిత్ (సి) హర్‌ప్రీత్ (బి) కర్రాన్ 36, సూర్యకుమార్ (సి) ప్రభ్‌సిమ్రన్ (బి) కర్రాన్ 78, తిలక్‌వర్మ (నాటౌట్) 34, హార్దిక్ (సి) హర్‌ప్రీత్ (బి) హర్షల్ 10, డేవిడ్ (సి) కర్రాన్ (బి) హర్షల్ 14, షెఫర్డ్ (సి) శశాంక్ (బి) హర్షల్ 1, నబీ (రనౌట్) 0 : **ఎక్స్‌ట్రాలు : 11 ; మొత్తం 20 ఓవర్లలో 192/7 ; వికెట్లపతనం** : 1-18, 2-99, 3-148, 4-167, 5-190, 6- 192, 7-192; **బౌలింగ్:** లివింగ్‌స్టోన్ 2-0-16-0, అర్షదీప్ 3-0-35-0, రబాడ 4-0-42-1, హర్షల్ 4-0-31-3, కర్రాన్ 4-0-41-2, హర్‌ప్రీత్ 3-0-21- 0

పంజాబ్: కర్రాన్ (సి) ఇషాన్ (బి) బుమ్రా 6, ప్రభ్‌సిమ్రన్ (సి) ఇషాన్ (బి) కొట్జీ 0, రొసో (బి) బుమ్రా 1, లివింగ్‌స్టోన్ (సి అండ్ బి) కొట్జీ 1, హర్‌ప్రీత్ సింగ్ (సి అండ్ బి) శ్రేయాస్ 13, శశాంక్ (సి) తిలక్ (బి) బుమ్రా 41, జితేశ్ (ఎల్బీ) మధ్వాల్ 9, అశుతోష్ (సి) నబీ (బి) కొట్జీ 61, హర్‌ప్రీత్ బ్రార్ (సి) నబీ (బి) హార్దిక్ 21, హర్షల్ (నాటౌట్) 1, రబాడ (రనౌట్) 8 : **ఎక్స్‌ట్రాలు : 21 ; మొత్తం 19.1 ఓవర్లలో 183 ఆలౌట్ ; వికెట్లపతనం** : 1-10, 2-13, 3-14, 4-14, 5-49, 6-77, 7-111, 8-168, 9-174 ; **బౌలింగ్:** కొట్జీ 4-0- 32-3, బుమ్రా 4-0-21-3, మధ్వాల్ 3.1-0-461, హార్దిక్ 4-0-33-1, శ్రేయాస్ 2-0-26-1, షెఫర్డ్ 2-0-20-0.

ఒలింపిక్స్‌కు శ్రీశంకర్ దూరం



న్యూఢిల్లీ: లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ ఒలింపిక్ కల చెదిరింది. శిక్షణ సందర్భంగా అతడి మోకాలికి తీవ్ర గాయమైంది. శస్త్రచికిత్స తప్పనిసరని డాక్టర్లు ధ్రువీకరించారు. దీంతో 2024 సీజన్ మొత్తానికి అతడు దూరమైనట్టే. ఆసియా, కామన్వెల్త్ క్రీడల్లో శ్రీశంకర్ రజతాలు సొంతం చేసుకొన్నాడు. గతేడాది జరిగిన ఆసియా అథ్లెటిక్ చాంపియన్‌షిప్స్‌లో 8.37 మీ. దూకిన మురళీ విశ్వక్రీడలకు అర్హత సాధించాడు. ఈ నెల 27, మే 10న షాంఘై, దోహాలో జరగనున్న డైమండ్ లీగ్‌లకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ గాయమైంది.

కాన్వే..ఐపీఎల్ నుంచి అవుట్

చెన్నై: చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న న్యూజిలాండ్ ఓపెనర్ డెవాన్ కాన్వే గాయంతో ఈసారి ఐపీఎల్‌కు పూర్తిగా దూరమయ్యాడు. వాస్తవంగా..గత ఫిబ్రవరిలో ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ సందర్భంగా కాన్వే ఎడమచేతి చూపుడు వేలు విరగడంతో ఆపరేషన్ చేయించుకున్నాడు. ఫలితంగా ఐపీఎల్‌కు అందుబాటులో ఉండడని గతంలో భావించారు. ఇప్పుడు దానిని అధికారికంగా ప్రకటించారు. గతేడాది ఫైనల్లో అతడు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఇక..కాన్వే స్థానంలో ఇంగ్లిష్ పేసర్ రిచర్డ్ గ్లీసన్ (రూ. 50 లక్షలు) ను తీసుకున్నారు.

ఫేవరెట్లు మను, ఇషా

నేటినుంచి ఒలింపిక్ షూటింగ్ ట్రయల్స్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌కు భారత పిస్టల్, రైఫిల్ జట్ల ఎంపిక ప్రక్రియ శుక్రవారం ఇక్కడ ప్రారంభం కానుంది. మహిళల 25 మీ. పిస్టల్ విభాగంలో ఒలింపియన్ మనూ భాకర్, హైదరాబాద్ టీనేజ్ షూటర్ ఇషాసింగ్ తిరుగులేని ఫేవరెట్లుగా బరిలో దిగుతున్నారు. తొలిరోజు ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ కేటగిరిలో అనీష్ భన్వాలా, విజయ్ వీర్‌సింగ్ ఆధిపత్యం చెలాయించే అవకాశాలున్నాయి. మొత్తం 8 పిస్టల్, రైఫిల్ విభాగాలకు ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. ట్రయల్స్‌లో అగ్రస్థానంలో నిలిచే షూటర్లకు పారిస్ బెర్త్ ఖాయమవుతుంది.

ఇంపాక్ట్ రూల్ నచ్చలేదు



న్యూఢిల్లీ: గతేడాది నుంచి ఐపీఎల్‌లో అమలవుతున్న ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై భారత కెప్టెన్ రోహిత్ శర్మ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇది ఆల్‌రౌండర్ల పురోగతికి ఆటంకంగా ఉందని స్పష్టం చేశాడు. 'క్రికెట్ అనేది 11 మందితోనే ఆడాలి. 12 మందితో కాదు. నాకు ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన నచ్చలేదు. ఇది ఆల్‌రౌండర్ల నైపుణ్యాలను తగ్గించేస్తుంది. ప్రేక్షకులకు మరింత మజాను అందించేందుకు దీన్ని ప్రయోగిస్తున్నారు. కానీ క్రికెట్ కోణంలో చూసుకుంటే దూబే, సుందర్‌లాంటి ఆల్‌రౌండర్లు బౌలింగ్‌కు దూరమవుతున్నారు. వారిని బ్యాటింగ్‌కు ఉపయోగించుకుని ఆ తర్వాత పెవిలియన్‌కు పరిమితం చేస్తున్నారు. ఇది భారత క్రికెట్‌కు మంచిది కాదు' అని ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో రోహిత్ తెలిపాడు.

వినేష్‌పైనే అందరి దృష్టి

ఆసియా రెజ్లింగ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్ నేటి నుంచి



బిష్కెక్ (కిర్గిస్థాన్): సాధ్యమైనన్ని పారిస్ ఒలింపిక్ బెర్త్‌లు దక్కించుకోవడమే లక్ష్యంగా.. భారత రెజ్లర్లు ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ బరిలోకి దిగనున్నారు. శుక్రవారం నుంచి జరిగే టోర్నీలో ఫ్రీ స్టైల్, గ్రీకో-రోమన్ విభాగాల్లోని 18 వెయిట్ కేటగిరీల్లో 36 విశ్వక్రీడల బెర్త్‌లు అందుబాటులో ఉన్నాయి. అయితే, సుజీత్ కలాకర్ (65కి), దీపక్ పూనియా (86 కి) వినహా మిగతా 17 మంది భారత రెజ్లర్లు ఈపాటికే బిష్కెక్ చేరుకొన్నారు. భారీ వర్షాలు కురుస్తుండడంతో దీపక్, సుజీత్‌లు దుబాయ్‌లోనే ఆగిపోయారు. దీంతో టోర్నీలో వీరు బరిలోకి దిగడంపై ఉత్కంఠ నెలకొంది. కాగా, ఇప్పటి వరకు 53 కిలోల విభాగంలో అంతిమ్ మాత్రమే ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఇటీవలి కాలంలో వివాదాలతోనే హైలైట్ అయిన వినేష్‌పై అందరి దృష్టి నెలకొంది. 50 కిలోల్లో బరిలోకి దిగుతున్న ఫొగట్.. ట్రయల్స్ సందర్భంగా చేసిన రచ్చ ఇప్పటికీ చర్చనీయాంశంగానే ఉంది.

రెండు బంతులకే రద్దు..

పాక్-కివీస్ తొలి టీ20 వర్షార్పణం

రావల్పిండి: పాకిస్థాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య గురువారం ఇక్కడ జరగాల్సిన తొలి టీ20ని వరుణుడు అడ్డుకోవడంతో రద్దయింది. భారీ వర్షం వల్ల మ్యాచ్‌ని ఐదేసి ఓవర్లకు కుదించారు. మొదటి ఓవర్ రెండో బంతి తర్వాత మళ్లీ వర్షం మొదలవడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. రెండో మ్యాచ్ శనివారం జరుగుతుంది.

ప్రజ్ఞానంద ఓటమి

క్యాండిడేట్స్ చెస్

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో ప్రజ్ఞానందకు చుక్కెదురైంది. 11వ రౌండ్‌లో నకమురా (అమెరికా) చేతిలో ప్రజ్ఞానంద ఓటమి పాలయ్యాడు. తెల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద 54 ఎత్తుల్లో ప్రత్యర్థికి తలవంచాడు. కాగా, కరువానా (అమెరికా)తో గుకేష్ పాయింట్ పంచుకొన్నాడు. తెల్లపావులతో ఆడిన గుకేష్ 40 ఎత్తుల అనంతరం కరువానాతో డ్రాకు అంగీకరించాడు. రష్యన్ జీఎం ఇయాన్ నెపోమ్నియాచి చేతిలో విదిత్ గుజరాతీ కంగుతిన్నాడు. మొత్తంగా 11 రౌండ్‌ల నుంచి గుకేష్ 6.5 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా.. ప్రజ్ఞానంద (5.5), గుజరాతీ (5) ఆరు, ఏడు స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో సలీమోవా (బల్గేరియా)పై హంపి, జీఎం అలెగ్జాండ్రా గోర్యాంచ్‌కినా (రష్యా)పై ఐఎం వైశాలి గెలిచారు.

బిజినెస్

ఇన్ఫీ లాభం రూ.7,969 కోట్లు

క్యూ4లో 30 శాతం వృద్ధి నమోదు



రూ.37,923 కోట్లకు పెరిగిన ఆదాయం

2024-25 ఆదాయ వృద్ధి అంచనా 1-3%

ఒక్కో షేరుకు మొత్తం రూ.28 డివిడెండ్

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరపు నాలుగో త్రైమాసికానికి (క్యూ4) ఇన్ఫోసిస్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 30 శాతం వృద్ధితో రూ.7,969 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఇదే త్రైమాసికానికి కంపెనీ లాభం రూ.6,128 కోట్లుగా ఉంది. కాగా, 2023-24 క్యూ4లో ఇన్ఫీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 1.3 శాతం పెరిగి రూ.37,923 కోట్లుగా నమోదైంది. 2022-23లో ఇదే కాలానికి రూ.37,441 కోట్ల ఆదాయం గడించింది. కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ క్యూ4లో 20.1 శాతానికి తగ్గగా.. 2023-24 మొత్తానికి 20.7 శాతంగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఇన్ఫీ నికర లాభం 8.9 శాతం వృద్ధితో రూ.26,233 కోట్లకు చేరుకోగా.. ఆదాయం 4.7 శాతం పెరిగి రూ.1,53,670 కోట్లుగా నమోదైంది.

7.5 శాతం తగ్గిన ఉద్యోగులు

క్యూ3తో పోలిస్తే క్యూ4లో నికరంగా 5,423 మంది ఉద్యోగులు తగ్గారు. దాంతో 2023-24 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ ఉద్యోగుల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 7.5 శాతం (25,994 మంది) తగ్గి 3,17,240 మందికి పరిమితమైంది. ఇన్ఫోసిస్ వార్షిక ఉద్యోగుల సంఖ్య తగ్గడం గడిచిన 23 ఏళ్లలో ఇదే తొలిసారి. అంతేకాదు, వరుసగా ఐదు త్రైమాసికాలుగా కంపెనీ ఉద్యోగుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. కాగా, క్యూ4లో సంస్థ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 12.6 శాతానికి తగ్గింది.

1,770 కోట్ల డాలర్ల భారీ ఆర్డర్లు

క్యూ4లో కంపెనీకి 450 కోట్ల డాలర్ల భారీ కాంట్రాక్టులు దక్కగా.. 2023-24 మొత్తానికి ఈ విలువ ఆల్‌టైం రికార్డు స్థాయి 1,770 కోట్ల డాలర్లకు పెరిగిందని ఇన్ఫోసిస్ వెల్లడించింది. "క్లయింట్లకు తమపైన ఉన్న బలమైన నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తోందని ఇన్ఫీ ఎండీ, సీఈఓ సలీల్ పరేఖ్ అన్నారు.

డివిడెండ్ బొనాంజా

గత ఆర్థిక సంవత్సరానికి గాను ఇన్ఫీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.20 తుది డివిడెండ్‌తో పాటు రూ.8 ప్రత్యేక డివిడెండ్‌ను సైతం ప్రకటించింది. ఇందుకు అర్హులైన వాటాదారులను మే 1న ఎంపిక చేసి, జూలై 1న చెల్లింపులు జరుపనున్నట్లు కంపెనీ వెల్లడించింది. గతంలో ప్రకటించిన రూ.35.5 డివిడెండ్‌తో కలిపి 2023-24కు గాను కంపెనీ చెల్లించే డివిడెండ్ మొత్తం రూ.63.5కు చేరుకోనుంది.

రూ.4,000 కోట్లకు జర్మన్ కంపెనీ కొనుగోలు

జర్మనీకి చెందిన ఇన్-టెక్ కంపెనీలో 100 శాతం వాటాను 45 కోట్ల యూరోల (దాదాపు రూ.4,000 కోట్లు)కు కొనుగోలు చేయబోతున్నట్లు ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఈ డీల్ పూర్తిగా నగదు రూపంలో జరగనుంది. ఇన్-టెక్ కంపెనీ ఈ-మొబిలిటీ, కనెక్టెడ్ అండ్ అటానమస్ డ్రైవింగ్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఆఫ్ రోడ్ వెహికిల్స్, రైల్ రోడ్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో ఈ కొనుగోలు ప్రక్రియ పూర్తి కావచ్చని అంచనా. జర్మనీకి చెందిన దిగ్గజ వాహన కంపెనీలతో విస్తృత సంబంధాలు కలిగి ఉన్న ఇన్-టెక్ కొనుగోలు ఇన్ఫోసిస్‌కు ఆటోమోటివ్ రంగంలో భవిష్యత్ తరం టెక్నాలజీ సేవలందించేందుకు దోహదపడనుంది. ఇన్-టెక్‌లో 2,200 మంది పనిచేస్తున్నారు. జర్మనీతో పాటు ఆస్ట్రియా, చైనా, యూకే, చెక్ రిపబ్లిక్, రొమేనియా, స్పెయిన్, ఇండియాలో ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

ఏడీఆర్‌లు 8 శాతం డౌన్

ఈ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25) ప్రకటించిన ఆదాయ వృద్ధి అంచనా నిరాశాజనకంగా ఉండటంతో న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రీ-మార్కెట్ ట్రేడింగ్‌లో ఇన్ఫోసిస్ అమెరికన్ డిపాజిటరీ రిసీట్స్ (ఏడీఆర్) దాదాపు 8 శాతం వరకు క్షీణించాయి. 2024-25లో స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయ వృద్ధి 1-3 శాతంగా ఉండవచ్చని కంపెనీ అంచనా వేసింది. అయితే, ఈసారి కంపెనీ ఆదాయ వృద్ధిని 2-6 శాతం స్థాయిలో అంచనా వేయవచ్చని భావించిన మార్కెట్ వర్గాలకు నిరాశే ఎదురైంది. గత ఆర్థిక సంవత్సరానికి (2023-24) తొలుత అంచనా వేసిన 4-7 శాతం ఆదాయ వృద్ధితో పోలిస్తే కంపెనీ ఈసారి అంచనాలను చాలా తగ్గించింది. అయితే, 2023-24 ఆదాయ వృద్ధి అంచనాను ప్రతి త్రైమాసికంలోనూ తగ్గిస్తూ వచ్చిన కంపెనీ.. క్యూ3 ఫలితాల ప్రకటన సందర్భంగా 1.5-2 శాతానికి కుదించింది. "2023-24 ఆర్థిక సంవత్సరం ఆదాయ వృద్ధితో పోలిస్తే 2024-25 ఆదాయ వృద్ధి అంచనా అధికమే అయినప్పటికీ వ్యత్యాసం చాలా స్వల్పం. ఇండస్ట్రీల వారీగా చూస్తే, ఆర్థిక సేవల రంగం ముఖచిత్రం ఈ ఆర్థిక సంవత్సరంలో మెరుగ్గా కన్పిస్తోంద"ని ఇన్ఫోసిస్ సీఈఓ పరేఖ్ అన్నారు.

సాగర్ సెమీ.. హైవోల్టేజ్ సెమీకండక్టర్స్ ప్లాంట్

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సాగర్ సెమీకండక్టర్స్ కంపెనీ హైవోల్టేజ్ సెమీకండక్టర్ల తయారీకి సిద్ధమవుతోంది. జపాన్‌కు చెందిన హిటాచీ గ్రూప్ ఇందుకు అవసరమైన పూర్తి సాంకేతిక పరిజ్ఞానం అందిస్తుంది. దీనికి సంబంధించి సాగర్ సెమీ-హిటాచీ గ్రూప్ కంపెనీ హిటాచీ పవర్ సెమీకండక్టర్ డివైజెస్ లిమిటెడ్ (హెచ్‌పీఎస్‌డీఎల్) మధ్య ఒక అవగాహనా ఒప్పందం కుదిరింది. ఏటా 10 కోట్ల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేస్తారు. ఈ ప్లాంట్‌లో పని చేసే ఉద్యోగులకు అవసరమైన పూర్తి శిక్షణ హిటాచీ గ్రూప్.. భారత్, జపాన్‌లోని తన యూనిట్లలో ఇస్తుంది. అయితే ఈ ప్లాంట్‌ను ఎక్కడ? ఎంత పెట్టుబడితో ఏర్పాటు చేసేది సాగర్ సెమీ వెల్లడించలేదు. దీనికి తోడు ఇన్సులేటెడ్ గేట్ బైపోలార్ ట్రాన్సిస్టర్స్ (ఐజీబీటీ), సిలికాన్ కార్బైడ్ వంటి హైపవర్ డివైజెస్‌ను ఉమ్మడిగా మార్కెట్ చేసేందుకూ హెచ్‌పీఎస్‌డీఎల్-సాగర్ సెమీ మధ్య ఒక ఒప్పందం కుదిరింది.

నాట్కో ఫార్మా యూఎస్ఏపై ఫిర్యాదు

న్యూఢిల్లీ: అమెరికాలోని నాట్కో ఫార్మా అనుబంధ సంస్థ నాట్కో ఫార్మా యూఎస్ఏ ఎల్ఎల్‌సీపై డెలావర్ డిస్ట్రిక్ట్ కోర్టులో ఫిర్యాదు నమోదైంది. ఈ కంపెనీ డయాజపామ్ అనే ఇంజెక్షన్ ప్రీఫిల్డ్ సిరంజీలను మార్కెట్ చేయడంపై ఫ్రెషినియస్ కబీ యూఎస్ఏ ఎల్ఎల్‌సీ, ఫ్రెషినియస్ కబీ డచ్‌ల్యాండ్ జీఎంబీహెచ్ అనే సంస్థలు ఈ ఫిర్యాదు చేశాయి. డాష్ ఫార్మాస్యూటికల్స్ ఎల్ఎల్‌సీని నాట్కో ఫార్మా కొనుగోలు చేసి దాని పేరును నాట్కో ఫార్మా యూఎస్ఏ ఎల్ఎల్‌సీగా మార్చింది. డయాజపామ్ ఇంజెక్షన్లను మానసిక వ్యాకులత, కండరాల సంకోచం, మద్యం సేవించడం వల్ల వచ్చే వికారాల తొలగింపు కోసం ఉపయోగిస్తారు. కాగా ఈ విషయాన్ని కోర్టులో ఎదుర్కొంటామని నాట్కో ఫార్మా తెలిపింది.

రూ.22 కోట్లతో పోల్‌మోర్ స్టీల్ విస్తరణ

హైదరాబాద్: పోలెండ్‌కు చెందిన పోల్‌మోర్ స్టీల్ కంపెనీ మెదక్ జిల్లాలోని తన ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింతగా విస్తరిస్తోంది. రూ.22.27 కోట్లతో చేపడుతున్న ఈ విస్తరణతో అదనంగా మరో 100 మందికి ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని కంపెనీ ఎండీ కేవీఆర్ సుబ్బారావు వెల్లడించారు. మెదక్ జిల్లాలోని కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి ఇండస్ట్రియల్ ప్రాంతంలోని ఆటోమోటివ్ పార్కులో ప్రస్తుతం ఈ ప్లాంట్ ఉంది. ఈ ప్లాంట్ పక్కనే ఉన్న మూడు ఎకరాల్లో ఈ విస్తరణ చేపడతామని సుబ్బారావు చెప్పారు. భారత్‌లోని పోలెండ్ రాయబారి డాక్టర్ సెబాస్టియన్ డొమ్‌జాల్‌స్కీ నాయకత్వంలోని పోలెండ్ ప్రతినిధుల బృందం కంపెనీ ప్లాంట్‌ను సందర్శించిన సందర్భంగా సుబ్బారావు ఈ విషయాలు వెల్లడించారు.

పవర్‌మెక్‌కు యాదాద్రి థర్మల్ పవర్ ఆర్డర్

హైదరాబాద్: పవర్‌మెక్ ప్రాజెక్ట్స్‌కు రూ.232.03 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయి. వాటిలో రూ.52.74 కోట్ల విలువ గల యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రాజెక్టు కూడా ఉంది. ఈ ఆర్డర్ కింద యాదాద్రి ప్రాజెక్టు కోసం సూపర్ స్ట్రక్చర్ పవర్ హౌస్, బంకర్ ప్రాంతం నిర్మించడంతో పాటు ప్లాంట్ పరిధిలోని ఇతర పనులు కూడా చేపట్టాల్సి ఉంటుంది. అలాగే ప్రభుత్వ రంగ సంస్థ బీహెచ్ఈఎల్ నుంచి వేర్వేరు ప్రాజెక్టులకు సంబంధించి మూడు ప్యాకేజీలుగా రూ.122.89 కోట్ల ఆర్డర్లు లభించా యి. బీహెచ్ఈఎల్ నుంచి లభించిన ప్యాకేజీల్లో ఒడిశాలోని తాల్చేర్‌లో ఎన్‌టీపీసీ కోసం ఒక్కోటి రూ.660 మెగావాట్ల విలువ గల రెండు యూనిట్ల (1,2 యూనిట్లు) నిర్మాణం ఒకటి కాగా ఎన్‌టీపీసీ తాల్చేర్ ప్రాజెక్టులో యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ స్ట్రక్చర్, టాంక్ ఫ్యాబ్రికేషన్ మరొకటి. ఇవి కాకుండా ప్యాకేజీ-సీ కింద తాల్చేర్ ప్లాంట్‌లోనే కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నిర్మించాల్సి ఉంటుంది.

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు అవార్డు

జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్)కు మరో పురస్కారం లభించింది. ఈ ఏడాది గాను భారత్‌తో పాటు దక్షిణాసియాలో 'అత్యుత్తమ విమానాశ్రయ సిబ్బంది' అవార్డును దక్కించుకుంది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఈ నెల 17న నిర్వహించిన 'ప్యాసింజర్ టెర్మినల్ ఎక్స్‌పో 2024'లో గ్లోబల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ రేటింగ్ సంస్థ స్కైట్రాక్స్ ఈ అవార్డును ప్రకటించింది. విమానాశ్రయంలో ప్రయాణికులకు ఆయా సేవలందించే సిబ్బంది వైఖరి, స్నేహపూర్వకత, సమర్థత వంటి అంశాల పరిశీలన ఆధారంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఎంపిక చేసినట్లు స్కైట్రాక్స్ పేర్కొంది.

ఎయిర్‌పోర్ట్‌లో ఏఏఐ వాటా విక్రయం!?

లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) మూడో విడత విమానాశ్రయాల ప్రైవేటీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టనుందని సమాచారం. ఈసారి మరో 13 విమానాశ్రయాలను ప్రైవేటీకరించనున్నట్లు తెలిసింది. అంతేకాదు, బెంగళూరు, హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో తనకున్న స్వల్ప వాటానూ విక్రయించాలని ఏఏఐ భావిస్తోందని ఇద్దరు సీనియర్ అధికారుల తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో అభివృద్ధి చేసిన హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 74 శాతం వాటా జీఎంఆర్ చేతుల్లో ఉండగా.. తెలంగాణ ప్రభుత్వం, ఏఏఐ 13 శాతం చొప్పున వాటా కలిగి ఉన్నాయి.

బజాజ్ ఆటో.. మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.1,936 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం 29 శాతం వృద్ధితో రూ.11,485 కోట్లకు చేరుకుంది. ఆర్థిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ఒక్కో షేరుకు రూ.80 తుది డివిడెండ్‌ను కంపెనీ బోర్డు సిఫారసు చేసింది.

మార్కెట్లలో ఆగని పతనం

సెన్సెక్స్ 455 పాయింట్లు డౌన్

ముంబై: అమెరికాలో వడ్డీ రేట్లు సమీప భవిష్యత్తులో తగ్గుతాయన్న ఆశలు ఆవిరైపోవడంతో పాటు భౌగోళిక ఉద్రిక్తతలు తీవ్రతరం కావడంతో పెరిగిన అమ్మకాల కారణంగా ఈక్విటీ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగో రోజు కూడా భారీ నష్టాలకు గురయ్యాయి. ఇటీవల ర్యాలీని సొమ్ము చేసుకునేందుకు ఇన్వెస్టర్లు గత కొద్ది రోజులుగా భారీ విక్రయాలకు పాల్పడుతున్నారు. ఫలితంగా సెన్సెక్స్ గురువారం తీవ్ర ఆటుపోట్లకు లోనైంది. ఇంట్రాడేలో గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు నడుమ 1,107.38 పాయింట్ల మేరకు ఊగిసలాడింది. మిడ్‌సెషన్‌లో అయితే కేవలం మూడు నిమిషాల వ్యవధితో 319 పాయింట్లు నష్టపోయింది. చివరికి సెన్సెక్స్ 454.69 పాయింట్ల నష్టంతో 72,488.99 వద్ద క్లోజైంది. నిఫ్టీ 152.05 పాయింట్ల నష్టంతో 21,961.70 వద్ద ముగిసింది. నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 2,549.16 పాయింట్లు నష్టపోయింది. ఫలితంగా బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.9,30,304.76 పాయింట్లు దిగజారి రూ.3,92,89,048.31 కోట్లకు పడిపోయింది.

జెఎన్‌కే షేరు ధర శ్రేణి రూ.395-415: హీటింగ్ పరికరాలు తయారుచేసే జేఎన్‌కే ఇండియా లిమిటెడ్ రూ.650 కోట్ల పబ్లిక్ ఇష్యూలో షేరు ధర శ్రేణిని గురువారం ప్రకటించింది. షేరు కనిష్ఠ ధర రూ.395 కాగా గరిష్ఠ ధర రూ.415గా నిర్ణయించింది. వచ్చే మంగళవారం ఇష్యూ ప్రారంభమై గురువారం ముగుస్తుంది.

నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్‌పై డెరివేటివ్ కాంట్రాక్టులు

న్యూఢిల్లీ: ఈ నెల 24 నుంచి నిఫ్టీ నెక్ట్ 50 ఇండెక్స్‌పై డెరివేటివ్ కాంట్రాక్టులు ప్రవేశపెడుతున్నట్లు ఎన్ఎస్ఈ ప్రకటించింది. సెబీ నుంచి ఇందుకు అనుమతి లభించినట్లు తెలిపింది. ఈ కాంట్రాక్టుల ముగింపు ప్రతి నెలా చివరి శుక్రవారం ఉంటుంది. ఈ ఏడాది మార్చి 29 నాటికి నిఫ్టీ నెక్ట్ 50 ఇండెక్స్ కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.70 లక్షల కోట్లు. ఎన్ఎస్ఈలో నమోదైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్‌లో ఇది 18 శాతానికి సమానం. ఈ ఇండెక్స్ కంపెనీల్లో రోజూ సగటున రూ.9,560 కోట్ల టర్నోవర్ జరుగుతోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	415
చిత్తూరు	493	విశాఖపట్నం	430
గోదావరి	415	వరంగల్	412
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	గోదావరి	131
వరంగల్	118	విజయవాడ	131
కరీంనగర్	118	గుంటూరు	131
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	131
కర్నూలు	118	చిత్తూరు	134
విశాఖపట్నం	118		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,800 ▼	67,650 ▼	90,100 ▲
ముంబై	73,477 ▲	67,305 ▲	83,327 ▲

మీ కోసం మీ ఓటు హక్కును వినియోగించుకోండి: సీఈసీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: ఓటర్లు తమ విలువైన ఓటు హక్కును బాధ్యతతో వినియోగించుకోవాలని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు ప్రజల కోసమేనని గురువారం ఓ వీడియో సందేశంలో ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ కోసం, తమ పిల్లల కోసం, తమ ఊరు కోసం, తమ దేశం కోసం ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఒక్క ఓటు ఎన్నికల ఫలితాన్ని ప్రభావితం చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.

'ఆమ్' ఆద్మీ..!

» బెయిల్ కోసం కేజ్రీవాల్ మామిడి పండ్లు, మిఠాయిలు తింటున్నారు

» ఢిల్లీ సీఎంపై కోర్టులో ఈడీ ఆరోపణలు

» ఇన్సులిన్ ఇవ్వడం లేదు.. ఆయనను చంపే కుట్ర: ఆతిషి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్.. బెయిల్ పొందేందుకు ఉద్దేశపూర్వకంగా మామిడి పండ్లు, మిఠాయిలు తింటున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపించింది. ఆయనకు మధుమేహం ఉండడంతో మామిడి, అరటి పండ్లు, మిఠాయిలు తింటూ చక్కెర స్థాయిలను పెంచుకుని తద్వారా అనారోగ్యాన్ని సాకుగా చూపి బెయిల్ పొందేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపింది. టైప్2 మధుమేహ రోగి అయినందున తన వ్యక్తిగత వైద్యుడిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంప్రదించేందుకు అనుమతించాలని కేజ్రీవాల్.. రౌజ్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. గురువారం ఈ పిటిషన్ విచారణ సందర్భంగా కేజ్రీవాల్ అభ్యర్థనను ఈడీ వ్యతిరేకించింది. మధుమేహ రోగులు తినకూడని ఆహారాన్ని కేజ్రీవాల్ తింటున్నారని, ఆయన తెప్పించుకుంటున్న ఆహారంలో మామిడి పండ్లు, మిఠాయిలు ఉంటాయని.. చక్కెర వేసిన టీని తాగుతారని ఈడీ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. బెయిల్ కోసం అప్పీల్‌కు కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆయన తీసుకుంటున్నవన్నీ వైద్యుడు సూచించినవేనని కేజ్రీవాల్ తరపు న్యాయవాది వివేక్ జైన్ తెలిపారు. ఇంటి భోజనాన్ని నిలిపివేసేందుకు ఈడీ సాకులు చెబుతోందని ఆరోపించారు. కేజ్రీవాల్ భోజనంతోపాటు ఆయన ఆహార పట్టికపై పూర్తి నివేదిక శుక్రవారంలోపు ఇవ్వాలని తిహాడ్ జైలు అధికారులను ఆదేశించిన కోర్టు విచారణను ఇదేరోజుకు వాయిదా వేసింది. కాగా సీఎం కేజ్రీవాల్‌ను చంపేందుకు కుట్ర జరుగుతోందని ఆప్ మంత్రి ఆతిషి ఆరోపించారు. పలుమార్లు అభ్యర్థించినప్పటికీ ఇన్సులిన్‌ను ఇవ్వలేదన్నారు. కేజ్రీవాల్‌కు తీవ్రమైన మధుమేహం ఉందని అందరికీ తెలుసని, ఆయన చక్కెర స్థాయిలను నియంత్రించుకోవడానికి రోజూ 54 యూనిట్ల ఇన్సులిన్ తీసుకుంటారని చెప్పారు. కానీ ఈడీ ద్వారా బీజేపీ కేజ్రీవాల్ ఆరోగ్యాన్ని పాడుచేయాలనుకుంటోందని ఆరోపించారు.

జైలు అధికారుల నుంచి నివేదిక కోరిన ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్

తిహాడ్ జైల్లో కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ అందించడం లేదన్న ఆరోపణల నేపథ్యంలో వాస్తవాల నివేదికను 24 గంటల్లోగా సమర్పించాలని జైళ్ల డైరెక్టర్ జనరల్‌ను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా గురువారం ఆదేశించారు. సీఎం ఆరోగ్యం విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని లెఫ్టినెంట్ గవర్నర్ హామీ ఇస్తున్నట్టు రాజ్ నివాస్ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది.

తొలి అంకం నేడే

21 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 102 ఎంపీ సీట్లలో పోలింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమరంలో తొలి అంకానికి తెరలేవనుంది. మొత్తం ఏడు దశల పోలింగ్‌కు గాను శుక్రవారం మొదటి విడత జరుగనుంది. 21 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 102 ఎంపీ స్థానాలకు ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఓటింగ్ నిర్వహించనున్నారు. సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ శాసనసభలకు కూడా ఈ దశలోనే పోలింగ్ జరుగనుంది. రెండు రాష్ట్రాల్లో 92 సీట్లున్నాయి. 543 లోక్‌సభ స్థానాలకు ఏడు దశల్లో ఎన్నికలు చేపడుతుండగా.. అత్యధికంగా తొలి దశలోనే సీట్లున్నాయి. వీటిలో 73 జనరల్, 18 ఎస్సీ, 11 ఎస్టీ రిజర్వుడు స్థానాలు. పోలింగ్ సజావుగా సాగేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అందరికీ ఓటరు స్లిప్పులను అధికారులు ఇప్పటికే పంపిణీ చేశారు. ఓటరు ఐడీ లేకపోతే 12 ఇతర గుర్తింపు కార్డులలో దేనినైనా చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఈసీ తెలిపింది. 85 ఏళ్లకు పైబడిన 14.14 లక్షల మంది వృద్ధులు, 13.89 లక్షలమంది దివ్యాంగులు ఇంటి దగ్గరే ఓటు వేయనున్నారు. పోలింగ్ స్టేషన్‌కు వచ్చే వృద్ధులు, దివ్యాంగులకూ తగిన ఏర్పాట్లు చేసినట్లు ఈసీ పేర్కొంది. కాగా, 1.87 లక్షల పోలింగ్ స్టేషన్లను ఈసీ ఏర్పాటు చేసింది. ఐదు వేల స్టేషన్లలో భద్రతా సిబ్బంది సహా మొత్తం మహిళలే విధులు నిర్వర్తించనున్నారు. వెయ్యి కంటే ఎక్కువ స్టేషన్లల్లో దివ్యాంగులు ఈ బాధ్యతలు చూడనున్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో సూక్ష్మ పరిశీలకులను నియమించారు. 50శాతానికి పైగా స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. పోలింగ్, భద్రతా సిబ్బంది తరలింపునకు 41 హెలికాప్టర్లు, 84 ప్రత్యేక రైళ్లు, దాదాపు లక్ష వాహనాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. పరిశీలకులుగా 361 మందిని పంపించింది. వీరిలో 127 మంది సాధారణ, 67 మంది పోలీసు, 167 మంది వ్యయ పరిశీలకులు ఉన్నారు. ప్రత్యేక పరిశీలకులను సైతం నియమించింది. 4,627 ఫ్లయింగ్ స్క్వాడ్, 5,208 స్టాటిటిక్స్ సర్వేలైన్స్, 2,028 వీడియో సర్వేలైన్స్ బృందాలు, 1,255 వీడియో వ్యూయింగ్ టీంలను ఏర్పాటు చేసింది. మద్యం, మాదక ద్రవ్యాలు, నగదు, ఉచితాలను తరలించకుండా అడ్డుకునేందుకు 1,374 అంతర్రాష్ట్ర, 162 అంతర్జాతీయ చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఉంచింది. వాయు, సముద్ర మార్గాల్లోనూ నిఘా ఏర్పాట్లు చేసింది.



అసోంలోని డిబ్రూగఢ్‌కు ఎన్నికల విధుల కోసం వెళ్తున్న పోలీసు సిబ్బంది

తొలి దశ స్వరూపం ఇలా

బరిలో ఉన్న అభ్యర్థులు: 1,625 (1,491 మంది పురుషులు, 134 మంది మహిళలు)

ఓటు వేయనున్న ప్రజలు: 16.63 కోట్లు (పురుషులు 8.4 కోట్లు, మహిళలు 8.23 కోట్లు)

తొలిసారి ఓటు వేయనున్నవారు: 35.67 లక్షలు

20-29 ఏళ్ల మధ్య వయసు వారు: 3.51 కోట్లు

విధులు నిర్వర్తించనున్న సిబ్బంది: 18 లక్షలు

మొత్తం మహిళా సిబ్బంది ఉన్న కేంద్రాలు: 5,000

నక్సల్స్.. అమరవీరులు

» కాంగ్రెస్ నేత సుప్రియా శ్రినాటే వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రినాటే చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన 29 మంది నక్సలైట్లను ఆమె అమరవీరులుగా సంబోధించడంపై దుమారం చెలరేగింది. ఓ జర్నలిస్టు అడిగిన ప్రశ్నలకు ఆమె పైవిధంగా స్పందించారు. ఈ అంశంపై 'మీ పార్టీ రాజకీయాలు చేస్తోందా?' అని జర్నలిస్టు అడగగా, ఈ అంశంపై తమ పార్టీ రాజకీయాలు చేయాలనుకోవడం లేదని జవాబిచ్చిన ఆమె.. ఎన్‌కౌంటర్‌పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మృతులకు, గాయపడిన భద్రతా సిబ్బందికి ఆమె సానుభూతి ప్రకటించారు. ఆమె వ్యాఖ్యలు సిగ్గుచేటు అంటూ బీజేపీ ఖండించింది.

కొన్ని మీడియా సంస్థలు నన్ను దూషిస్తున్నాయి: రాహుల్

కన్నూర్, ఏప్రిల్ 18: బీజేపీ విధానాలను, సిద్ధాంతాలను విమర్శిస్తున్నందుకు కొన్ని మీడియా సంస్థలు తనపై దుమ్మెత్తిపోస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్రంలోని పాలక వ్యవస్థను ప్రశ్నిస్తున్నందుకే తన ప్రతిష్ఠను దిగజార్చుతున్నాయని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కేరళలోని కన్నూర్‌లో ఓ భారీ ర్యాలీలో రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ దేశంలో అశాంతిని వ్యాప్తి చేస్తోందని, లక్షలాది మందికి హాని చేస్తోందని ఆరోపించారు. బీజేపీ ఎక్కడికి వెళ్లినా అక్కడ ప్రజలను విభజిస్తుందని, సమస్యలు సృష్టిస్తుందని, ప్రజలు వారిలో వారే కొట్టుకునేలా చేస్తుందని ఆయన దుయ్యబట్టారు.

టార్గెట్ 100!

» లోక్‌సభలో బలం మూడంకెలకు చేరాలి

» మళ్లీ విపక్షంలో కూర్చున్నా సరే..!!

» కాంగ్రెస్ నాయకత్వం సంకల్పం?



లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా రెండు సార్లు పరాజయం పాలైన కాంగ్రెస్.. ఈసారి ఎలాగైనా పుంజుకోవాలని గట్టి పట్టుదలతో ఉంది. అందుకే విపక్షాలతో జట్టుకట్టి 'ఇండియా' కూటమిని ఏర్పాటు చేసుకుని.. వీలైనన్ని ఎక్కువ పార్టీలతో, ఎక్కువ రాష్ట్రాల్లో పొత్తు పెట్టుకుంది. అయితే శక్తిమంతమైన బీజేపీని ఎదుర్కొని అధికారంలోకి రాగల బలం సాధించడం కష్టసాధ్యమని దానికీ తెలుసు. అందుకే 100 సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతిపక్షంలో కూర్చున్నా.. బలం మూడంకెలకు చేరితే పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ద్విగుణీకృతమవుతుందని.. 2029 ఎన్నికలనాటికి పూర్తిగా పుంజుకోవడానికి, బీజేపీని ఓడించడానికి దోహదపడుతుందని ఏఐసీసీ పెద్దలు అంచనా వేస్తున్నారు. ఇప్పుడు తాను 100 సీట్లు.. మిత్రపక్షాలు 130-140 స్థానాలు సాధించగలిగితే బీజేపీ బలం గణనీయంగా తగ్గిపోతుందని.. అత్తెసరు మెజారిటీతోనే గద్దెనెక్కుతుందని.. అప్పుడు పార్లమెంటులో గట్టిగా నిలదీయడానికి అవకాశం ఉంటుందని భావిస్తోంది. అయితే కాంగ్రెస్ దక్షిణ భారతంలో.. అందునా కర్ణాటక(28), తెలంగాణ(17)ల్లో మాత్రమే అధిక సీట్లు సాధించడానికి అవకాశం ఉంది. గత ఎన్నికల్లో కర్ణాటకలో ఒక్క సీటు, తెలంగాణలో 3 స్థానాలు గెలుచుకుంది. ఇప్పుడీ రెండు రాష్ట్రాల్లో ఆ పార్టీయే అధికారంలో ఉంది. ఈసారి తెలంగాణలో 8-10, కర్ణాటకలో 13-15 స్థానాలను టార్గెట్ చేసింది. కేరళ, తమిళనాడుల్లో పెరిగే అవకాశమే లేదు. ఎందుకంటే గత ఎన్నికల్లో కేరళలో మిత్రపక్షాలతో కలిసి 20కి గరిష్ఠంగా 19 చోట్ల గెలిచింది. తమిళనాడులో కూడా డీఎంకే తనకు కేటాయించిన 9 స్థానాల్లో 8 గెలుచుకుంది. ఈసారి కూడా అంతే. ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కటీ రాకపోవచ్చని సర్వేలు చెబుతున్నాయి. ఇక హిందీ బెల్ట్ రాష్ట్రాల్లో గత ఎన్నికల్లో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయింది. అందుకే ఆ పార్టీ ఈసారి మరీ ఎక్కువ సీట్లను ఆశించడం లేదు. యూపీ (80), మధ్యప్రదేశ్(29), ఛత్తీస్‌గఢ్ (11), రాజస్థాన్(25), హరియాణా(10), హిమాచల్ ప్రదేశ్ (4), ఉత్తరాఖండ్ (5), ఢిల్లీ (7)లో కనీసం 15-20 సీట్లయినా దక్కించుకోవాలని, పంజాబ్(13)లో ఇప్పుడున్న 8 స్థానాలు నిలుపుకోవాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే తనకు బలమున్న కొన్ని స్థానాలపైనే శక్తియుక్తులన్నీ కేంద్రీకరిస్తోంది. యూపీలో సమాజ్‌వాదీతో జట్టుకట్టి 17 చోట్ల పోటీచేస్తోంది. గత ఎన్నికల్లో రాయ్‌బరేలీలో మాత్రమే.. అది కూడా కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ ఒక్కరే విజయం సాధించారు. కంచుకోట అమేఠీలో రాహుల్‌గాంధీ ఓడిపోయారు. ఈ దఫా సోనియా పోటీచేయడం లేదు. అమేఠీలో పోటీపై రాహుల్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. మహారాష్ట్ర (48)లో గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటే వచ్చింది. ఈసారి ఉద్ధవ్ శివసేన, శరద్ పవార్ ఎన్సీపీతో జట్టుకట్టి 17 స్థానాల్లో పోటీచేస్తోంది. కనీసం పదైనా వస్తాయని ఆశిస్తోంది. గుజరాత్(25)లో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)తో చేతులు కలపడం వల్ల 5 స్థానాల వరకు గెలుస్తామని అంచనా వేస్తోంది. ఢిల్లీలోనూ ఈ రెండు పార్టీలు కలిసి పోటీచేస్తున్న సంగతి తెలిసిందే. ఈశాన్య భారతం, ఒడిసాలో కాంగ్రెస్‌కు పెద్దగా ఆశల్లేవు. పశ్చిమ బెంగాల్(42)లో ఇప్పుడున్న రెండు సీట్లకు మించి రాకపోవచ్చని ఏఐసీసీ వర్గాలే భావిస్తున్నాయి. బిహార్(40)లో గత ఎన్నికల్లో ఆర్జేడీతో పొత్తుతో కాంగ్రెస్ ఒక్క స్థానంలోనే గెలిచింది. ఈ రెండూ ఈసారి లెఫ్ట్ పార్టీలతో జట్టుకట్టి బరిలోకి దిగుతున్నాయి. ఇక్కడ కాంగ్రెస్‌కు 3-5 సీట్లు రావచ్చని సర్వేలు చెబుతున్నాయి.

- సెంట్రల్ డెస్క్

శిల్పాశెట్టి దంపతుల ఆస్తుల అటాచ్

» బిట్‌కాయిన్స్ మోసం కేసులో ఈడీ చర్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: బిట్‌కాయిన్స్ పేరుతో జరిగిన మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు బాలీవుడ్ నటి శిల్పాశెట్టి దంపతులకు చెందిన రూ.97.79 కోట్ల విలువైన ఆస్తులను గురువారం అటాచ్ చేశారు. అటాచ్ అయిన స్థిర, చరాస్తుల్లో ముంబైలోని జుహూలో శిల్పాశెట్టి పేరిట ఉన్న ఓ ఫ్లాట్, పుణెలోని ఓ బంగ్లా, శిల్పాశెట్టి భర్త రాజ్ కుంద్రా పేరిట ఉన్న ఈక్విటీ షేర్లు ఉన్నాయి. 2017లో ముంబైకి చెందిన 'వేరియబుల్ ప్రైవేట్ లిమిటెడ్' అనే సంస్థ బిట్‌కాయిన్స్ స్కామ్‌ను ప్రారంభించింది. బిట్‌కాయిన్లలో పెట్టుబడి పెడితే.. నెలకు 10% లాభాలుంటాయని ఆశ చూపింది. మల్టీలెవల్ మార్కెటింగ్(ఎంఎల్ఎం- చైన్ స్కీమ్) పద్ధతిలో ముంబై, ఢిల్లీల్లో ఏజెంట్లను నియమించుకుని, రూ.6,600 కోట్లను వసూలు చేసింది. గత ఏడాది ఈ కేసులో ఆ సంస్థకు చెందిన పలువురు వ్యక్తులను ఈడీ అరెస్టు చేసింది. ప్రధాన నిందితులు అజయ్ భరద్వాజ్, మహేందర్ భరద్వాజ్ పరారీలో ఉండగా.. వారికి చెందిన రూ.69 కోట్ల ఆస్తులను ఈడీ ఇప్పటికే అటాచ్ చేసింది. ఈ కేసులో రాజ్‌కుంద్రా 285 బిట్‌కాయిన్లను కలిగి ఉన్నారని.. వాటి విలువ రూ.150 కోట్లుగా ఉంటుందని ఈడీ తెలిపింది.

నేవీ చీఫ్‌గా దినేశ్ త్రిపాఠి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: భారత నౌకాదళానికి తదుపరి చీఫ్‌గా దినేశ్‌కుమార్ త్రిపాఠిని కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన నౌకాదళం వైస్ చీఫ్‌గా ఉన్నారు. ప్రస్తుత నేవీ చీఫ్ ఆర్.హరికుమార్ ఈ నెల 30న పదవీ విరమణ పొందనున్నారు. అదే రోజు మధ్యాహ్నం నుంచి త్రిపాఠి నేవీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. కాగా.. 1964 మే 15న జన్మించిన త్రిపాఠి తన 21వ ఏట.. అంటే 1964 జూలై 1న కమ్యూనికేషన్ అండ్ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ స్పెషలిస్టుగా భారత నౌకాదళంలో చేరారు. ఆ తర్వాత తన 39 ఏళ్ల సర్వీసులో అంచెలంచెలుగా ఎదిగారు. వేర్వేరు నేవీ కమాండ్‌లలో తన సేవలను అందించారు. ముఖ్యంగా ఐఎన్ఎస్-వినాశ్, ఐఎన్ఎస్-కిర్చ్, ఐఎన్ఎస్-త్రిశూల్‌కు కమాండింగ్ ఆఫీసర్‌గా సేవలందించారు. పలు దేశాలతో జరిగిన ద్వైపాక్షిక ఆపరేషన్లకు నేతృత్వం వహించారు. ఆయన నౌకాదళానికి అందించిన విశేష సేవలకు గాను.. అతి విశిష్ట సేవా పతకం, నావ్ సేనాపతకాలను అందుకున్నారు.

ఎన్నికలపై విశ్వసనీయత ఉండాలి

» ప్రజలకు ఎటువంటి సందేహం ఉండొద్దు

» ప్రస్తుతం ఓ అగాధం నెలకొని ఉంది

» దానిని పూరించే బాధ్యత ఈసీదే: సుప్రీంకోర్టు

» వందశాతం వీవీప్యాట్ల లెక్కింపుపై తీర్పు రిజర్వు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియలో విశ్వసనీయత ఉండాలని, ప్రజలకు సందేహం లేకుండా చూడాలని సుప్రీంకోర్టు గురువారం ఎన్నికల సంఘానికి (ఈసీకి) సూచించింది. ఈసీ చెబుతున్నదానికీ, ప్రజలకు ఇచ్చిన సమాచారానికీ మధ్య అగాధం ఉన్నదని, అదే విశ్వసనీయతను శంకించేలా చేస్తోందని తెలిపింది. ఈ అగాధాన్ని పూరించాలని హితవు పలికింది. ఓట్ల లెక్కింపు సమయంలో.. ఈవీఎంలలో నమోదైన ఓట్లతోపాటు వీవీప్యాట్ స్లిప్పులను కూడా పూర్తిగా లెక్కించాలని దాఖలైన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు గురువారం కొనసాగించింది. న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. ఈ పిటిషన్లను అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) సంస్థతోపాటు ఇతరులు దాఖలు చేశారు. ఈవీఎంలలో నమోదైన ప్రతి ఓటును వీవీప్యాట్ స్లిప్పుతో సరిపోల్చి చూడాలని ఏడీఆర్ తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. పిటిషనుదారుల్లో ఒకరైన న్యాయవాది నిజాం పాషా వాదిస్తూ.. ఈవీఎంలో ఓటు వేసిన తర్వాత వచ్చే వీవీప్యాట్ స్లిప్పును ఓటరు స్వయంగా తీసుకొని, అక్కడ బ్యాలెట్ బాక్సులో వేసేలా అవకాశం కల్పించాలని, అప్పుడు ఓటింగ్ ప్రక్రియపై ఎటువంటి అనుమానం ఉండదని తెలిపారు. ఫలితాల రోజున వీవీప్యాట్ స్లిప్పులన్నింటినీ లెక్కించాలన్నారు. ఈవీఎంలు, పేపర్‌స్లిప్‌లకు సంబంధించి సుప్రీంకోర్టు ఈసీని పలు ప్రశ్నలు వేసింది. వీటికి ఈసీ సీనియర్ డిప్యూటీ కమిషనర్ నితీశ్‌కుమార్‌వ్యాస్, ఈసీ తరపు న్యాయవాది మణిందర్‌సింగ్ సమాధానాలు ఇచ్చారు.

తమిళనాట పోటాపోటీ

39 నియోజకవర్గాలు.. 3 కూటములు.. 950 మంది అభ్యర్థులు.. 6.23 కోట్ల ఓటర్లు

» డీఎంకే, బీజేపీ నేతృత్వ కూటముల మధ్యే హోరాహోరీ?

» దక్షిణాది రాష్ట్రంపై దృష్టి కేంద్రీకరించిన కాషాయపార్టీ

(చెన్నై-ఆంధ్రజ్యోతి)

తమిళనాడులోని 39 లోక్‌సభ నియోజకవర్గాలకు శుక్రవారం ఒకే విడతలో పోలింగ్ జరుగనుంది. రాష్ట్రంలో 6.23 కోట్ల మంది ఓటర్లుండగా, వారి కోసం 68,321 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. 77 మంది మహిళా అభ్యర్థులు, 873 మంది పురుష అభ్యర్థులు కలిపి మొత్తం 950 మంది బరిలో నిలిచారు. ఇందులో డీఎంకే నేతృత్వంలోని 'ఇండియా' కూటమి, అన్నాడీఎంకే నేతృత్వంలోని కూటమి, బీజేపీ నేతృత్వంలోని 'ఎన్డీయే' కూటమి మధ్య త్రిముఖ పోటీ కనిపిస్తున్నప్పటికీ, అన్నాడీఎంకే బాగా బలహీనపడటంతో డీఎంకే, బీజేపీ నేతృత్వంలోని కూటముల మధ్యే హోరాహోరీ నెలకొనే అవకాశం ఉంది. ఎన్డీయే కూటమి తరఫున ప్రధాని మోదీ గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రంలో 9 సార్లు పర్యటించి ప్రచారం చేయడం గమనార్హం. పలువురు కేంద్రమంత్రులు కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలూ తమకు కలిసి వస్తాయని బీజేపీ నేతలు ఆశాభావంతో ఉన్నారు. ఇక ఇండియా కూటమి తరఫున కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి స్టాలిన్, అన్నాడీఎంకే కూటమి తరఫున మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, డీఎండీకే వ్యవస్థాపకుడు, దివంగత నటుడు విజయకాంత్ సతీమణి ప్రేమలత తదితరులు ప్రచారం చేశారు. కాగా, బీఎస్పీ, నామ్ తమిళర్ కట్చి పార్టీలు ఈ ఎన్నికల్లో ఏ కూటమిలోనూ చేరకుండా విడివిడిగానే 39 స్థానాల్లోనూ పోటీ చేస్తున్నాయి.

ఇండియా కూటమి	
పార్టీ	స్థానాలు
డీఎంకే	22
కాంగ్రెస్	9
సీపీఐ	2
సీపీఎం	2
వీసీకే	2
ఐయూఎంఎల్	1
ఎండీఎంకే	1

ఎన్డీయే కూటమి	
పార్టీ	స్థానాలు
బీజేపీ	23
పీఎంకే	10
టీఎంసీ	3
ఏఎంఎంకే	2
పన్నీర్‌సెల్వం	1

అన్నాడీఎంకే కూటమి	
అన్నాడీఎంకే	34
డీఎండీకే	5



బీజేపీ నుంచి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైను కోయంబత్తూరు నియోజకవర్గంలో, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను చెన్నై-దక్షిణ నియోజకవర్గంలో ఆ పార్టీ బరిలోకి దింపింది. అలాగే, కేంద్ర మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్‌ను నీలగిరిలో, కేంద్ర మాజీ మంత్రి పొన్ రాధాకృష్ణన్‌ను కన్నియాకుమారిలో, ప్రముఖ సీనియర్ నటి రాధికను విరుదునగర్‌లో, ప్రముఖ పారిశ్రామికవేత్త వినోజ్ పి.సెల్వంను చెన్నై-సెంట్రల్ నుంచి బీజేపీ బరిలోకి దింపింది. మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం(రామనాథపురం), దివంగత సీఎం జయలలిత నెచ్చెలి శశికళ సమీప బంధువు టీటీవీ దినకరన్, ఎస్ఆర్ఎం సంస్థల అధినేత టీఆర్ పారివేందర్ కూడా ఎన్డీయే తరఫున పోటీ చేస్తుండడం గమనార్హం.

డీఎంకే నుంచి హేమాహేమీలు..

ఇండియా కూటమిలో డీఎంకే తరఫున కనిమొళి తూత్తుకుడి నియోజకవర్గం నుంచి, స్టాలిన్ మేనల్లుడు దయానిధి మారన్ చెన్నై-సెంట్రల్ నుంచి, కేంద్ర మాజీ మంత్రులు టీఆర్ బాలు శ్రీపెరుంబుదూర్ నుంచి, ఎ.రాజా నీలగిరి నుంచి ఎస్.జగద్రక్షకన్ అరక్కోణం నుంచి బరిలో దిగారు.

కాంగ్రెస్ తరఫున

ఇండియా కూటమిలోనే కాంగ్రెస్ తరఫున కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం తనయుడు కార్తీ చిదంబరం శివగంగ నియోజకవర్గం నుంచి, తెలుగువారైన సీనియర్ నేత కె.గోపీనాథ్ కృష్ణగిరి నుంచి, సీనియర్ నేత మాణిక్కం ఠాగూర్ విరుదునగర్ నుంచి, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు ఎం.కృష్ణస్వామి తనయుడు ఎంకే విష్ణు ప్రసాద్ కడలూరు నుంచి పోటీ చేస్తున్నారు. ఇదే కూటమిలో ఎండీఎంకే అధినేత వైగో కుమారుడు దురై వైగో తిరుచ్చి నుంచి బరిలో నిలిచారు. ఇక అన్నాడీఎంకే కూటమిలో సీనియర్ నేతలు, మాజీ ఎంపీలు బరిలో ఉన్నప్పటికీ చరిష్మా ఉన్న నేతలు అంతంత మాత్రంగానే కనిపిస్తున్నారు. ఈ కూటమిలో దివంగత నటుడు విజయకాంత్ స్థాపించిన డీఎండీకే తరఫున ఆయన తనయుడు విజయ ప్రభాకరన్ విరుదునగర్ నుంచి పోటీ చేస్తున్నారు. కాగా, తమిళనాడుల డీఎంకే నేతృత్వంలోని 'ఇండియా' కూటమిదే పైచేయి అని పలు ముందస్తు సర్వేలు తేల్చాయి.

యూపీ నుంచి లోక్‌సభ బరిలో తెలంగాణ ఆడపడుచు

» బీఎస్పీ తరఫున జౌన్‌పూర్ ఎంపీ అభ్యర్థిగా శ్రీకళారెడ్డి

» జడ్పీ చైర్‌పర్సన్‌గా అనుభవం.. తండ్రి మాజీ ఎమ్మెల్యే

» విజయం సాధిస్తా.. 'ఆంధ్రజ్యోతి'తో శ్రీకళారెడ్డి



నడిగూడెం, ఏప్రిల్ 18: తెలంగాణకు చెందిన ఆడపడుచు ఉత్తర్‌ప్రదేశ్ (యూపీ) నుంచి లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి నిలిచింది. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రత్నవరం గ్రామానికి చెందిన కీసర శ్రీకళారెడ్డి, యూపీ రాష్ట్రంలోని జౌన్‌పూర్ లోక్‌సభ నియోజవర్గం నుంచి బీఎస్పీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. భర్త ధనుంజయ్ సింగ్ 2009లో ఎంపీ. అంతకుముందు ఎమ్మెల్యేగా కూడా గెలిచారు. 2019లో బీఎస్పీ తరఫున శ్యామ్‌సింగ్ యాదవ్ ఎంపీగా గెలిచారు. తాజా ఎన్నికల్లో శ్యామ్‌సింగ్‌ను కాదని బీఎస్పీ అధినేత్రి మాయావతి, శ్రీకళారెడ్డికి అవకాశమిచ్చారు. 2021లో జౌన్‌పూర్ నుంచి శ్రీకళారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీకళారెడ్డి తండ్రి కీసర జితేందర్‌రెడ్డి 1968లో హుజూర్‌నగర్ తాలుకా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా గెలుపొందారు. నల్లగొండ సహకార బ్యాంక్ చైర్మన్‌గానూ పనిచేశారు. తల్లి లలితమ్మ సర్పంచ్‌గా రత్నవరం గ్రామానికి సేవలందించారు. రాజకీయంతో పాటు సామాజిక సేవకు శ్రీకళారెడ్డి కుటుంబం పేరొందింది. గ్రామంలో రూ.2కోట్లతో నిర్మించిన ఆలయానికి భూమితో పాటు సుమారు రూ.కోటి వరకు ఆర్థికసాయాన్ని అందజేశారు. శ్రీకళారెడ్డి సోదరుడు విష్ణువర్ధన్‌రెడ్డి చెన్నైలో నిప్పో బ్యాటరీ కంపెనీ అధినేతగా ఉండటంతో ఆమె ఇంటర్ వరకు అక్కడే చదివారు. హైదరాబాద్‌లో బీకాం చేశారు. అమెరికాలో ఇంటీరియర్ డిజైనింగ్, ఆర్కిటెక్చర్ కోర్సులు చేశారు. పలు రాష్ట్రాల్లో వ్యాపారాలు చేశారు. 2017లో ధనుంజయ్ సింగ్‌ను వివాహం చేసుకున్నారు. ఇది ఆయనకు మూడో వివాహం. కాగా జౌన్‌పూర్ నుంచి తాను ఎంపీగా గెలుస్తానని శ్రీకళారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో లక్షన్నర ఓటర్ల బలగం తమకు ఉందని తెలిపారు. జౌన్‌పూర్ పరిధిలో 20లక్షల మంది ఓటర్లు ఉండగా భర్త ధనుంజయ్ సింగ్‌కు లక్షన్నర ఓటర్ల బలగం ఉందని చెప్పారు. ధనుంజయ్ సింగ్‌పై రాజకీయ కక్షతో కేసులు పెట్టి జైలుకు పంపారని, ప్రజాసేవ చేస్తూ ఇలాంటివి ఎదుర్కోవడం తమ కుటుంబానికి కొత్తేమీ కాదని పేర్కొన్నారు. సిటింగ్‌ను కాదని బీఎస్పీ అధినేత్రి మాయావతి టికెట్ ఇవ్వడానికి భర్త ధనుంజయ్‌సింగ్ బలం, బలగమే కారణమని చెప్పారు. ఆయన సహకారంతో జడ్పీ చైర్‌పర్సన్‌గా గెలిచిన తాను జౌన్‌పూర్ స్థానం నుంచి ఎంపీగానూ విజయం సాధిస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు.

'నెస్లే'కి పిల్లలందరూ ఒకటి కాదు!

» యూరప్ దేశాల్లో యాడెడ్ సుగర్స్ లేకుండా పిల్లల ఆహారం

» భారత్‌లో అమ్మే సెరిలాక్‌లో సర్వింగ్‌కు 2.7 గ్రాముల చక్కెర

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: పసిపిల్లల ఆహార ఉత్పత్తులు అనగానే గుర్తొచ్చే కంపెనీ.. నెస్లే. కానీ ఆ సంస్థ దృష్టిలో పిల్లలందరూ ఒకటి కాదు! యూరప్ దేశాల పిల్లల విషయంలో ఒకలా.. దక్షిణాసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల పిల్లల విషయంలో మరోలా వ్యవహరిస్తోంది. తన ఉత్పత్తుల తయారీలో ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోంది. నెస్లే.. యూరప్ దేశాల్లో అమ్మే ఉత్పత్తుల్లో ఎలాంటి యాడెడ్ సుగర్స్ (కృత్రిమంగా తీపిని పెంచే ఉత్పత్తులు)ను జోడించట్లేదు. పేద, మధ్యతరగతి దేశాల పిల్లలకు అమ్మే ఉత్పత్తుల్లో మాత్రం వాటిని జోడిస్తోంది. ప్రాసెస్డ్ ఆహారపదార్థాలు, శీతలపానీయాల్లో యాడెడ్ సుగర్స్ వాడతారు. ఇవి ఎక్కువుండే ఉత్పత్తులను వాడే పిల్లలు వాటికి ఎక్కువగా అలవాటుపడే ప్రమాదం ఉంది. పిల్లలకు నచ్చడంతో తల్లిదండ్రులు వాటినే కొనడంవల్ల ఆ ఉత్పత్తికి మార్కెట్ పెరుగుతుంది. నెస్లే కంపెనీ పుట్టినిల్లయిన స్విట్జర్లాండ్‌కు చెందిన పబ్లిక్ ఐ అనే స్వచ్ఛంద సంస్థ ఈ గుట్టును రట్టు చేసింది. ఇంటర్నేషనల్ బేబీ ఫుడ్ యాక్షన్ నెట్‌వర్క్‌తో కలిసి పబ్లిక్ ఐ ఈమేరకు ఓ నివేదిక విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా పసిపిల్లల ఆహార ఉత్పత్తుల మార్కెట్ విలువ దాదాపు రూ.5.8 లక్షల కోట్లని అంచనా. అందులో దాదాపు 20% మార్కెట్ నెస్లేదే. ఆ సంస్థ పలు దేశాల్లో దాదాపు 150 ఆహార ఉత్పత్తులు విక్రయిస్తుంది. సెరిలాక్, నిడో వంటివి వాటిలో ముఖ్యమైనవి. పబ్లిక్ ఐ నివేదిక ప్రకారం.. 6 నెలల పిల్లలకు పెట్టే సెరిలాక్‌ను యూకే, జర్మనీలో ఎలాంటి అదనపు చక్కెరలూ లేకుండా నెస్లే విక్రయిస్తోంది. ఇండియాలో అమ్మే అదే సెరిలాక్‌లో ఒక సర్వింగ్‌కు 2.7 గ్రాముల చక్కెర, థాయ్‌లాండ్‌లో 6గ్రాముల చక్కెర (ఒక సర్వింగ్‌కు)ను జోడిస్తోంది. భారత్‌లో విక్రయించే 15 సెరిలాక్ ఉత్పత్తుల్లో సగటున2.7 గ్రాముల చక్కెర ఉన్నట్టు పరీక్షల్లో తేలింది. దీన్ని ప్యాకేజింగ్‌పైనే నెస్లే ముద్రిస్తోంది. ఫిలిప్పీన్స్‌లో నెస్లే విక్రయించే ఉత్పత్తుల్లో ఎనిమిదింటి నమూనాలను పరీక్షించగా.. ఐదు నమూనాల్లో ఒక సర్వింగ్‌కు 7.3గ్రాముల చక్కెర ఉన్నట్టు వెల్లడైంది. ఈ నివేదికపై భారత్‌లోని నెస్లే అధికార ప్రతినిధిని ప్రశ్నించగా.. గత ఐదేళ్లుగా తాము తమ ఉత్పత్తుల్లో పంచదార స్థాయిలను దాదాపు 30%తగ్గించామని, ఇంకా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. నెస్లే ఉత్పత్తుల్లో చక్కెర స్థాయిలు భారత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా అని అడగ్గా.. నిబంధనలు పాటిస్తున్నట్టు చెప్పారు. కాగా రెండేళ్లలోపు పిల్లలకు యాడెడ్ సుగర్స్ ఉన్న ఉత్పత్తులు పెట్టకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలున్నాయి. భారతదేశంలో నిబంధనల ప్రకారం యాడెడ్ షుగర్స్‌కు గరిష్ఠ పరిమితి లేదు. పసిపిల్లల ఆహార ఉత్పత్తుల్లో కార్న్‌సిరప్, మాల్ట్, సుక్రోజ్, ఫ్రక్టోజ్ (ఆ ఉత్పత్తిలోని మొత్తం పిండి పదార్థాల్లో 20%లోపు) ఉండొచ్చు.





అబ్ కీ బార్?



వారం రోజులు గడువు ఇవ్వండి

ఈసీకి కేసీఆర్ లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఇటీవల నోటీసులు జారీచేసిన విషయం విదితమే. దీనిపై గురువారం ఉదయం 11 లోపు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో తాను వివరణ ఇచ్చేందుకు వారం గడువు ఇవ్వాలని కోరుతూ కేసీఆర్.. సీఈవో వికాస్‌రాజ్‌కు లేఖ పంపారు. ఈ సమాచారాన్ని ఈసీఐకి పంపానని, గడువు ఇవ్వాలా.. వద్దా అన్న దానిపై ఈసీఐ నిర్ణయం తీసుకుంటుందని ఆయన తెలిపారు.



త్వరలో బీఆర్ఎస్ దుకాణం బంద్

» లోక్‌సభ ఎన్నికల్లో ఖాతా కూడా తెరవదు

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బయ్యారం, ఏప్రిల్ 18: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని మాజీ సీఎం కేసీఆర్ పగటి కలలు కంటున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణలో త్వరలోనే బీఆర్ఎస్ దుకాణం బంద్ కానుందని చెప్పారు. గురవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో కాంగ్రెస్ బూత్ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఖాతా కూడా తెరవదన్నారు. లోక్‌సభ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థుల విజయంతో రాష్ట్రంలో ఎలాగైతే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందో.. ఎంపీ అభ్యర్థుల గెలుపుతో కేంద్రంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. బయ్యారం పెద్దచెరువు అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.



వివాదంలో బీజేపీ అభ్యర్థి మాధవీ లత!

» మసీదు వైపు బాణం వేస్తున్నట్లు పోజు

» ఇది రెచ్చగొట్టే చర్య: ఒవైసీ

హైదరాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత వివాదంలో చిక్కుకున్నారు. శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా ఆమె వ్యవహరించిన తీరు చర్చనీయాంశం అవుతోంది. గురువారం హైదరాబాద్ పాతబస్తీ సిద్ధి అంబర్ బజార్ మీదుగా యాత్ర సాగుతున్న సమయంలో మాధవీలత.. విల్లు ఎక్కుపెట్టి బాణం వదులుతున్నట్లుగా అభినయించారు. అయితే, బాణం వదిలిన దిశగానే మసీదు ఉన్నట్లుగా వీడియోలు సోషల్ మీడియా ద్వారా బయటకు రావడం విమర్శలకు దారితీసింది. ఈ వీడియో వైరల్ కావడంతో ఆమె తీరు విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉందంటూ కొందరు తప్పుబట్టారు. మాధవీలత కెమెరాకు పోజిచ్చే క్రమంలోనే ఇలా చేశారంటూ ఇంకొందరు సమర్థించారు. దీనిపై హైదరాబాద్ ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. ప్రజలు అంతా చూస్తున్నారని.. రెచ్చగొట్టే చర్యలను తిప్పికొడతారని వ్యాఖ్యానించారు. ఎన్నికల కంటే హైదరాబాద్‌లో శాంతిభద్రతలు ముఖ్యమని.. విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్న బీజేపీ నేతలను ఎందుకు ఉపేక్షిస్తున్నారని ఎన్నికల సంఘం, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ప్రశ్నించారు. కాగా, తనపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని.. సోషల్ మీడియాలో ఉన్నది అసంపూర్ణ వీడియో అని మాధవీలత తెలిపారు. ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే క్షమించాలని కోరారు.

పదేళ్లలో దేశానికి ఏం చేశారు?

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. దేశానికి సంబంధించి ఇవి అత్యంత కీలకమైన అంశాలని, ప్రజలు వీటిని పరిగణనలోకి తీసుకుంటారని చెప్పారు. కేరళలో స్టార్ క్యాంపెయినర్‌గా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న రేవంత్‌రెడ్డి గురువారం అక్కడ మీడియాతో మాట్లాడారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకే 400 సీట్లు గెలుస్తామంటూ బీజేపీ ప్రచారం చేసుకుంటోందని, ప్రజలు వారిని తిరస్కరించడం ఖాయమని అన్నారు. తెలంగాణలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి సీఎం కేసీఆర్ సైతం ఇలాంటి ప్రచారమే చేశారని, మూడోసారి 100కు పైగా స్థానాలను గెలుస్తామని చెప్పుకొన్నారని, కానీ.. అతి కష్టమ్మీద 39 స్థానాల్లోనే గెలవగలిగారని గుర్తుచేశారు. ప్రధాని మోదీని గతంలో పొగిడారన్న ప్రశ్నకు రేవంత్ స్పందిస్తూ.. ఒక ముఖ్యమంత్రిగా దేశ ప్రధానితో మాట్లాడానే తప్ప.. పొగడలేదని అన్నారు. ప్రధానికి సంబంధించి తన మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు. కేరళలోని మొత్తం 20 ఎంపీ స్థానాలను ఇండియా కూటమి గెలుచుకోబోతోందని, బీజేపీకి ఎక్కడా డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు.

పాఠశాలను ధ్వంసం చేసినవారిపై కఠిన చర్యలు

మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో మదర్ థెరీసా హైస్కూల్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 16న శ్రీరామనవమి సందర్భంగా కొందరు స్థానికులు పాఠశాల కిటికీలు, తలుపులను ధ్వంసం చేసి, పాఠశాల ఆవరణలోని మదర్ థెరీసా విగ్రహంపై రాళ్లు రువ్వారు. దీనిపై పాఠశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ పాఠశాలను కేరళలోని ఎర్నాకులం చర్చి నిర్వహిస్తోంది. పాఠశాలపై దాడి అంశాన్ని కేరళ శాసనసభలోని ప్రతిపక్ష నాయకుడు వీడీ సతీషన్ రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఈ విషయంలో పాఠశాల యాజమాన్యంపైనా కేసు నమోదైంది. పాఠశాలకు కాషాయ వస్త్రాలు ధరించి వచ్చినందుకు యాజమాన్యం అభ్యంతరం తెలపడంపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తమ తల్లిదండ్రులను తీసుకురావాలని చదువులో వెనకబడ్డ విద్యార్థులను తాము కోరగా.. వారు మరుసటి రోజు హనుమాన్ దీక్ష తీసుకుని, కాషాయ వస్త్రాలు ధరించి వచ్చారని ప్రిన్సిపాల్ చెప్పారు. కాషాయ వస్త్రాలు ధరించారంటూ తామెవరినీ అడ్డుకోలేదని, క్రైస్తవ పాఠశాల కావడంతో కొన్ని హిందూ సంస్థలు ఉద్దేశపూర్వకంగా దాడి చేశాయని తెలిపారు. కాగా, ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తున్న అంశమని ఈ పాఠశాలను నిర్వహిస్తున్న ఎర్నాకుళం చర్చి గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది.



వయనాడ్‌లో సీఎం రేవంత్, కేసీ వేణుగోపాల్ ప్రచారం

నామినేషన్ నుంచే అభ్యర్థులకు తోడుగా..

రాష్ట్రంలో నేటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రచారం

హైదరాబాద్/మహబూబ్‌నగర్/మహబూబాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెజారిటీ ఎంపీ సీట్లలో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలనే లక్ష్యంతో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి.. అందుకోసం పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారంలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. అభ్యర్థులు నామినేషన్ వేసే సమయం నుంచే వారికి అండగా ఉండేందుకుగాను నామినేషన్ దాఖలు కార్యక్రమాలకు కూడా హాజరు కావాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా.. శుక్రవారం మహబూబ్‌నగర్, మహబూబాబాద్ అభ్యర్థులు వంశీచంద్‌రెడ్డి, బలరాం నాయక్‌ల నామినేషన్ దాఖలు కార్యక్రమంలో రేవంత్ పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు రోడ్డు మార్గం ద్వారా తొలుత మహబూబ్‌నగర్‌కు చేరుకుంటారు. అభ్యర్థి వంశీచంద్ రెడ్డి నామినేషన్ దాఖలు చేసేందుకు ఆయనతో కలిసి సీఎం ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళతారు. అనంతరం మహబూబ్‌నగర్ క్లాక్‌టవర్ చౌరస్తాలో నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో పాల్గొని ప్రసంగిస్తారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మహబూబాబాద్‌కు వెళ్లి.. అక్కడి అభ్యర్థి బలరాంనాయక్ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ములుగులో ఏర్పాటు చేసే ప్రచార సభలో పాల్గొంటారు. శనివారం మెదక్‌లో పార్టీ అభ్యర్థి నీలం మధు నామినేషన్ దాఖలు కార్యక్రమానికి సీఎం రేవంత్ హాజరవుతారు. అక్కడ ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తారు. అక్కడినుంచి బెంగుళూరుకు వెళ్లి కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచార సభల్లో పాల్గొంటారు. అనంతరం తిరిగి తెలంగాణకు చేరుకొని.. 21న భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఈ నియోజకవర్గం పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లలో బహిరంగ సభల్లో పాల్గొంటారు.



మానుకోటలో జనజాతర సభా వేదిక ఏర్పాటు

అధికార ప్రతినిధుల నియామకం...

పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఎన్నికల ప్రచార కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు స్థానికంగా మీడియాకు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులను నియమించింది. రాష్ట్ర స్థాయిలో రియాజ్, రామిశెట్టి నరేందర్, లింగంయాదవ్‌తోపాటు మీడియా కో-ఆర్డినేటర్‌లుగా వచన్‌కుమార్, శ్రీకాంత్ యాదవ్, మామిడి గోపి, కమలాకర్ మెడగోని, తుమ్మల పద్మ, అజ్మీర గణేష్ నాయక్‌లను నియమించినట్లు టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

తొలిరోజు జాతర!

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ పార్టీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు, మహబూబ్‌నగర్ అభ్యర్థి డీ కే అరుణ, నల్లగొండ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, నాగర్ కర్నూలు అభ్యర్థి భరత్ ప్రసాద్ కూడా నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ సమయంలో అరుణ వెంట ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఉన్నారు. ఇక, నాగర్ కర్నూలు ఎంపీ స్థానంలో కాంగ్రెస్ నుంచి డాక్టర్ మల్లు రవి నామినేషన్‌ను దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున మెదక్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న నీలం మధు నామినేషన్‌ను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఎన్నికల అధికారికి అందించగా.. జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరఫున ఆయన వర్గీయులు ఒక సెట్‌ను దాఖలు చేశారు. పార్లమెంటు స్థానాల వారీగా పరిశీలిస్తే.. పెద్దపల్లి (ఎస్సీ) పరిధిలో నలుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. మహబూబాబాద్‌లో స్వతంత్ర అభ్యర్థి ఒక్కరే నామినేషన్ సమర్పించారు. చేవెళ్లలో మూడు; మెదక్‌లో బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు మరో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. నల్లగొండలో నాలుగు; భువనగిరిలో మూడు; ఖమ్మం నుంచి ఒకటి; నిజామాబాద్ పరిధిలో రెండు; మల్కాజ్‌గిరి ఎంపీ స్థానానికి 8 నామినేషన్లు దాఖలయ్యాయి. అలాగే, మహబూబ్‌నగర్ స్థానానికి రెండు; వరంగల్‌లో మూడు, కరీంనగర్‌లో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. సికింద్రాబాద్, హైదరాబాద్‌లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

ఆన్‌లైన్‌లోనూ నామినేషన్ల స్వీకరణ

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో తొలిరోజు 17 పార్లమెంటు స్థానాల పరిధిలో 42 మంది అభ్యర్థులు 48 నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. బీఆర్‌కేఆర్ భవన్‌లోని సీఈవో కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, అభ్యర్థులు నామినేషన్లను ఆన్‌లైన్‌లో కూడా వేయొచ్చని, అయితే.. ఆ నామినేషన్ పత్రాలను ప్రింట్ తీసి.. ఏప్రిల్ 24లోపు రిటర్నింగ్ అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. అభ్యర్థులు ఫొటోలను పరిశీలించుకొని ఇవ్వాలని చెప్పారు.



కాంగ్రెస్ విజయంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

» బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చే ముప్పు

» ఇండియా కూటమి అధికారం చేపట్టాక 30 లక్షల ఉద్యోగాల భర్తీ: మంత్రి ఉత్తమ్

కోదాడ, ఏప్రిల్ 18: ప్రమాదంలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోరారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సూర్యాపేట జిల్లా కోదాడలో గురువారం నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల ప్రచార ప్రారంభ సభలో ఉత్తమ్ మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు బీజేపీని ఓడించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. మతతత్వ పార్టీ బీజేపీని ఓడించేందుకు సీపీఐ, సీపీఎం మద్దతు తెలపడం అభినందనీయమన్నారు. అహంకార బీఆర్ఎస్ పనైపోయిందని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఆ పార్టీ కనుమరుగు అవుతుందని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దేశంలో, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి మైక్రోస్కోప్ పెట్టి చూసినా కనపడదని ఆరోపించారు. పదేళ్లకు ముందు ఖాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్‌ప్లాంట్, ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో రెండున్నర లక్షల కోట్లతో ఐటీ పరిశ్రమలు నెలకొల్పి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీలు ఎందుకు నిలబెట్టుకోలేదో చెప్పాలని నిలదీశారు. 2022లో రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని చెప్పిన బీజేపీ రెట్టింపు చేయకపోగా, తగ్గేందుకు కారణం కాలేదా ? అని ప్రశ్నించారు. రైతులు ఢిల్లీలో ధర్నా చేస్తే కనీస మద్దతు ధర ఇస్తామని, మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. దేశంలో 30లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే వాటిని ఎందుకు భర్తీ చేయడంలేదని అడిగారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే 30లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించారు. బీజేపీ న్యాయవ్యవస్థపై ఒత్తిడి తీసుకువస్తుందని, ఈడీ కేసులు పెడుతూ విపక్ష సీఎంలను తమ చెప్పుచేతుల్లోకి తెచ్చుకుంటోందని ఆరోపించారు. మతతత్వంతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీని గద్దె దించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు నడుంబిగించాలని కోరారు. నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తోన్న కుందూరు రఘువీర్‌రెడ్డిని దేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తానని ఉత్తమ్ ఈ సందర్భంగా అన్నారు. ఈ సభలో కుందూరు రఘువీర్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పాల్గొన్నారు.



కేంద్రం ఇచ్చింది 10 లక్షల కోట్లు!

(మొదటిపేజీ తరువాయి)

పింగళి వెంకట్రామిరెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో ఆయన 'రిపోర్ట్ టు పీపుల్ (ప్రజలకు నివేదన) అనే పేరుతో ప్రజెంటేషన్ ఇచ్చారు. పదేళ్ల మోదీ పాలనలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి గురించి.. ఎంపీగా, కేంద్రమంత్రిగా తాను సికింద్రాబాద్, తెలంగాణలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. అయితే.. అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ఇవ్వకపోవడంతో పలు కార్యక్రమాలు వాయిదా పడ్డాయని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే.. అభివృద్ధికి అవసరమైన స్థలాలను కేటాయించకపోవడంతో అనేక పనులు కుంటుపడ్డాయన్నారు. ఒక కేంద్రమంత్రిగా లభించాల్సిన గౌరవం తనకు దక్కలేదని.. గత సీఎం తనను అనరాని మాటలన్నారని, దుర్భాషలాడారని.. చాలా బాధతో ఈ మాటలు చెబుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ కేసీఆర్ విజ్ఞతకే వదిలేస్తున్నానని వ్యాఖ్యానించారు.

ఇదీ లెక్క

కేంద్రం 2014 నుంచి తెలంగాణకు పన్నుల రూపేణా రూ.2.3 లక్షల కోట్లు, వివిధ పథకాల కింద రూ. 6.2 లక్షల కోట్లు.. ఇలా మొత్తంగా 9 ఏళ్లలో రూ.10 లక్షల కోట్లు ఇచ్చిందని కిషన్‌రెడ్డి తన నివేదికలో వివరించారు. తొమ్మిదేళ్ల మోదీ పాలనలో తెలంగాణలో 2,500 కి.మీ. జాతీయ రహదారులు వేశామని.. మరిన్ని జాతీయ రహదారులు నిర్మాణంలో ఉన్నాయని గుర్తుచేశారు. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) నిర్మిస్తున్నామని.. దానికి రూ.26,000 కోట్లు కేటాయించామని, అది పూర్తయితే అనేక పరిశ్రమలు వస్తాయని, ఆర్ఆర్ఆర్ తెలంగాణ గేమ్ చేంజర్‌గా మారుతుందన్నారు. యూపీఏ హయాంలో తెలంగాణలో ఏడాదికి 17 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ల నిర్మాణం జరిగితే, తమ హయాంలో రూ.31,221 కోట్ల ఖర్చుతో 1,645 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ల నిర్మాణం చేపట్టామని, కాజీపేటలో ఆర్ఎంయు యూనిట్‌ను ప్రధాని ప్రారంభించారని గుర్తు చేశారు. వరంగల్‌లో మెగా టెక్స్‌టైల్ పార్కు నిర్మిస్తామని తెలిపారు. రామగుండంలో 1600 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభించామని.. హైదరాబాద్ మెట్రోకు రూ.1204 కోట్ల నిధులు కేటాయించామని.. సిద్దిపేట జిల్లా ములుగులో కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ నిర్మించామని.. రామగుండంలో యూరియా పరిశ్రమ ఏర్పాటు చేశామని.. ఎరువుల మీద 27 వేల కోట్ల రూపాయల సబ్సిడీ తెలంగాణ రైతులకు కేంద్రం అందజేసిందని.. ఒక్క యూరియా బస్తా మీదే 2236 సబ్సిడీ ఇస్తున్నామని గుర్తుచేశారు. తెలంగాణలో 39లక్షల మంది రైతులకు పీఎం కిసాన్ ద్వారా ఏటా 6వేలు అందజేశామని తెలిపారు. హైదరాబాద్ బయో మెడికల్ రీసెర్చ్ సెంటర్, ములుగులో గిరిజన వర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు.



'ప్రజల నివేదిక'ను విడుదల చేస్తున్న కిషన్‌రెడ్డి, జయప్రకాశ్ తదితరులు

ఎయిర్‌పోర్టు మాదిరిగా..

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను కేంద్రం వచ్చే ఏడాది నాటికి శంషాబాద్ విమానాశ్రాయం మాదిరిగా తీర్చిదిద్దుతుందని.. రూ.715 కోట్లతో అభివృద్ధి చేస్తుందని కిషన్ రెడ్డి వెల్లడించారు. చర్లపల్లి టెర్మినల్ ఆధునిక వసతులతో సిద్ధమవుతోందని.. దక్షిణ మధ్య రైల్వే దీన్ని సుమారు రూ.221 కోట్ల వ్యయంతో శాటిలైట్ రైల్వే టెర్మినల్‌గా అప్‌గ్రేడ్ చేస్తోందన్నారు. లింగంపల్లి-ఘట్‌కేసర్ మధ్య ఎంఎంటీఎస్‌ను ప్రారంభించామని, 343 కోట్ల వ్యయంతో 22 కి.మీ. మేర విస్తరించిన లైనుతో పాటు ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థనూ ప్రధాని ప్రారంభించారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో 1000 లీటర్ల సామర్థ్యం గల ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ ఐఐటీలో రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ కింద మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశామని.. మహిళల కోసం రూ.22 కోట్లతో నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, రూ.6 కోట్లతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 55 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, హెల్దీ బేబీ షో కార్యక్రమం ద్వారా 7000 పోషణ కిట్లను పంపిణీ చేశామని.. ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీలో డైనమిక్ లేజర్ షో, సైఫాబాద్‌లో మింట్ మ్యూజియం ఏర్పాటు చేశామని చెప్పారు. రామప్ప ఆలయానికి ప్రపంచవారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు తేవడంలో ఎంతగానో కృషి చేసినట్లు తెలిపారు. దశాబ్దకాలంగా కొనసాగుతున్న ఎంఎంటీఎస్ ఫేజ్-11 పనులను పూర్తిచేసి, సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈప్రాజెక్టును యాదాద్రి వరకూ పొడిగించి వంద శాతం కేంద్ర నిధులతో చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంఎంటీఎస్‌కు తన వాటాను ఇవ్వకపోవడంతో కేంద్రమే ఖర్చును భరించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రసాద్ పథకం కింద బల్కంపేట, భద్రాచలం, రామప్ప, అలంపూర్ జోగులాంబ అమ్మవారి ఆలయాల అభివృద్ధి, వేయి స్తంభాల గుడి పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు చెప్పారు.

లోపాలు లేని ప్రజాస్వామ్యం ఎక్కడా లేదు

» జయప్రకాశ్ నారాయణ

"చాలా మంది దేశంలో ప్రజాస్వామ్యం లేదు, ప్రజాస్వామ్యం నాశనమైందని అతియోశక్తులు పలుకుతున్నారు. కానీ, లోపాలు లేని ప్రజాస్వామ్యం ఎక్కడా లేదు" అని లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు. కిషన్‌రెడ్డి నిర్వహించిన రిపోర్ట్ టు ద పీపుల్ ప్రజెంటేషన్‌లో పాల్గొన్న జేపీ.. ఈ కార్యక్రమానికి తాను ఆయన స్నేహితుడిగా రాలేదని, ఓటర్ గా వచ్చానని చెప్పారు. కిషన్‌రెడ్డి సంస్కారి, స్నేహశీలి అని.. చిత్తశుద్ధి, నిజాయితీతో నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. కేంద్రమంత్రి అనే భావన లేకుండా.. చిరునవ్వుతో, విసుగు అనుకోకుండా ఏ విషయంలోనైనా త్వరగా స్పందిస్తారన్నారు. దేశ అభ్యున్నతి కోసం కేంద్రం చాలా ప్రయత్నాలు చేస్తోందన్నారు. ప్రజలు విచక్షణతో ఆలోచించి తమ మంచిని తాము తెలుసుకుని ఓట్లు వేస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.

మోదీవి విప్లవాత్మక నిర్ణయాలు

» విష ప్రచారం సాగిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్

» బీఆర్ఎస్ నిన్నటి పార్టీ, దానికి రేపు అనేది లేదు

» అసలు తెలంగాణకు బీఆర్ఎస్ అవసరం లేదు

» రాష్ట్రంలో బీజేపీకి 12కు పైగా స్థానాలు వస్తాయి

» కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, హర్దీప్ సింగ్ పూరీ

» బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు డిపాజిట్లు రావు: ఈటల

» మల్కాజిగిరిలో అట్టహాసంగా ఈటల నామినేషన్



మేడ్చల్ ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశాభివృద్ధి, శాంతి భద్రతల కోసం, ఉగ్రవాదం అణచివేతకు ప్రధాని మోదీ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని, ఆయన నిర్ణయాలు 'న భూతో న భవిష్యత్' అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ అన్నారు. మల్కాజిగిరి లోకసభ స్థానం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఈటల నివాసం వద్ద ఇద్దరు కేంద్రమంత్రులు మీడియాతో మాట్లాడారు. దేశ ప్రధానిగా మోదీ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమన్నారు. తెలంగాణలో 12కు పైగా లోక్‌సభ స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీజేపీపై విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు రేపు అనేది లేదని, అది నిన్నటి పార్టీ మాత్రమేనని ఎద్దేవా చేశారు. అసలు ఆ పార్టీ తెలంగాణకు అవసరం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు యాక్సిడెంటల్‌గా కాంగ్రెస్‌కు ఓటు వేశారని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిరాశ, నిస్పృహలో ఉన్నారని, రాహుల్‌గాంధీ అర్థం కాని మనిషి అని విమర్శించారు. రాహుల్ ఉంటేనే తాము అధికారంలోకి వస్తామన్నారు. ఈటల మాట్లాడుతూ బీజేపీని ఆపగలిగే దమ్ము, ధైర్యం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు లేదన్నారు. మల్కాజిగిరిపై కాషాయ జెండా ఎగరడం ఖాయమని, గెలుపు ఏకపక్షంగా ఉంటుందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు డిపాజిట్లు కూడా రావన్నారు. ఈటల నామినేషన్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. వేలాది మంది ఆయన నివాసానికి తరలివచ్చారు. బైక్ ర్యాలీగా తరలివెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. కాగా, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి తన అనుచరులతో కేంద్రమంత్రుల సమక్షంలో బీజేపీలో చేరారు. మాజీ ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డితో పాటు పలువురు నేతలు బీజేపీలో చేరారు.

నేడు కిషన్‌రెడ్డి నామినేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థిగా కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. ఉదయం 11.45 గంటలకు జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనుండగా, ముఖ్య అతిథిగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరుకానున్నారు. కిషన్ రెడ్డి తొలుత 9.45 గంటలకు సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. అక్కడ నుంచి పాదయాత్రగా మెహబూబ్ కళాశాలకు చేరుకుని.. సభలో పాల్గొంటారు.

తెలంగాణను దోచుకున్నారు..

మెదక్: తెలంగాణను పదేళ్లపాటు కేసీఆర్ కుటుంబం దోచుకుందని గోవా సీఎం ప్రమోద్ సావంత్ మండిపడ్డారు. మెదక్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు నామినేషన్ సందర్భంగా స్థానికంగా రోడ్ షో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సావంత్ మాట్లాడుతూ మోదీతోనే తెలంగాణ వికాసం సాధ్యమన్నారు.

ఆంధ్రజ్యోతి

మంత్రి తుమ్మలపై దాడికి కుట్ర..!

(మొదటిపేజీ తరువాయి)

కొందరు హోంగార్డులను ఉపయోగించుకునేలా స్కెచ్ వేశారని తెలిసింది. దాడికి ఖమ్మం మార్కెట్ ఏరియాను ఎంచుకుని, రెండుమూడు సార్లు రెక్కీ నిర్వహించారని సమాచారం. అయితే.. తుమ్మలపై దాడికి పరిస్థితులు ప్రతికూలంగా ఉండడంతో.. వెనక్కి తగ్గారని తెలుస్తోంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ విషయంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కుట్రకు అసలు సూత్రధారులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. కాగా.. ఇటీవల సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ.. నేలకొండపల్లి మండలంలోని సదరు వైద్యుడి మామిడితోటలోనే ప్రణీత్‌రావు అండ్ కో వార్‌రూమ్‌ను ఏర్పాటు చేసిన విషయం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే.!

హైదరాబాద్ - దుబాయ్ విమానాలు రద్దు

» అక్కడ వరదల బీభత్సంతో నిర్ణయం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : దుబాయ్‌లో వరదల బీభత్సం సృష్టిస్తుండడంతో హైదరాబాద్ నుంచి దుబాయ్ వెళ్లాల్సిన పలు విమాన సర్వీసులు గురువారం రద్దయ్యాయి. జీఎంఆర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ నుంచి దుబాయ్ వెళ్లాల్సిన నాలుగు విమానాలు గురువారం రద్దయ్యాయి. భారీ వర్షాల వల్ల దుబాయ్ విమానాశ్రయంలోకి వరద నీరు పోటెత్తడంతో విమానయాన సంస్థలు తమ సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేశాయని పేర్కొన్నారు. అలాగే, హైదరాబాద్ నుంచి షార్జా వెళ్లాల్సిన ఎయిర్ అరేబియా విమానం కూడా రద్దయిందని తెలిపారు. విమానాల రద్దుతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

అభిషేక్ బెయిల్ మే 8 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో నిందితుడు అభిషేక్ బోయినపల్లికి ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను సుప్రీంకోర్టు మే 8 వరకు పొడిగించింది. ఆయనను 2022 అక్టోబర్‌లో సీబీఐ అరెస్టు చేసింది. అదే ఏడాది నవంబర్‌లో ఈడీ కూడా అరెస్టు చేసింది. అప్పటి నుంచి సుమారు 19 నెలలు తిహాడ్ జైలులోనే ఉన్నారు. తన భార్య అనారోగ్యంతో బాధ పడుతున్నారని, మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ గతేడాది జులైలో ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను మార్చి 20న జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. వాదనల అనంతరం నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఆ బెయిల్ గడువు ముగియడంతో అదే ద్విసభ్య ధర్మాసనం ఎదుట గురువారం విచారణ జరిగింది. అభిషేక్ బోయినపల్లి భార్య ఆరోగ్య పరిస్థితి అలాగే ఉందని, మరికొంత సమయం ఆయన సేవలు ఆమెకు అవసరమని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ చెప్పారు.. దీనికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎటువంటి అభ్యంతరం తెలపలేదు. దీనితో అభిషేక్ బోయినపల్లి మధ్యంతర బెయిల్‌ను మే 8వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

జగన్ కేసుల విచారణ 30కి వాయిదా

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం జగన్ అక్రమాస్తులకు సంబంధించి సీబీఐ, ఈడీ దాఖలు చేసిన 20 ఛార్జిషీట్‌లపై విచారణ ఈ నెల 30కి వాయిదా పడింది. ఈ కేసులతో తమకు ఎలాంటి సంబంధం లేదని.. ఆయా ఛార్జిషీట్‌ల నుంచి తమను తప్పించాలని పేర్కొంటూ జగన్, విజయసాయిరెడ్డి సహా ఇతర నిందితులు దాఖలు చేసిన దాదాపు 129 డిశ్చార్జి పిటిషన్‌లపై తీర్పు వెలువడాల్సి ఉంది. దీనిని కూడా ఈనెల 30కి వాయిదా వేస్తున్నట్లు సీబీఐ కోర్టు గురువారం ప్రకటించింది. ఈ డిశ్చార్జి పిటిషన్‌ల పరిష్కారానికి హైకోర్టు ఇప్పటికే ఒకసారి గడువు పొడిగించింది. పొడిగించిన గడువు సైతం ఈనెల 30తో ముగుస్తోంది. ప్రజాప్రతినిధులపై నమోదైన కేసుల్లో విచారణ వేగవంతం చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలతో తెలంగాణ హైకోర్టు సుమోటోగా ఈ అంశాన్ని స్వీకరించింది. హైదరాబాద్ సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న డిశ్చార్జి పిటిషన్‌లను ఫిబ్రవరి 29లోగా పరిష్కరించాలని గతేడాది డిసెంబర్‌లో హైకోర్టు పేర్కొంది. అయితే భారీగా ఉన్న రికార్డులను పరిశీలించడంతోపాటు సాక్షుల వాంగ్మూలాలు రికార్డు చేయాల్సి ఉందని.. 13 వేల పేజీల డిక్టేషన్ ఇవ్వాల్సి ఉన్నందున గడువు కావాలని సీబీఐ కోర్టు కోరింది. దాంతో గడువును రెండునెలలు అంటే ఏప్రిల్ 30 వరకు హైకోర్టు పొడిగించింది.

ర్యాష్ డ్రైవింగ్ కేసులో స్టేకు హైకోర్టు నిరాకరణ

» క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన ప్రధాన నిందితుడు సాహిల్

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ర్యాష్ డ్రైవింగ్ చేసి ప్రజాభవన్ వద్ద బారికేడ్లను ఢీకొట్టిన కేసులో ప్రధాన నిందితుడు, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రాహిల్ అమీర్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసు దర్యాప్తుపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. దర్యాప్తుపై స్టే ఇవ్వడంతో పాటు ప్రజాఆస్తుల విధ్వంస నిరోధక చట్టం, మోటార్ వెహికిల్ చట్టం సహా పలు ఐపీసీ సెక్షన్‌ల కింద తనపై పంజాగుట్ట పోలీసులు పెట్టిన కేసును కొట్టేయాలని ఆయన క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది బొమ్మినేని వివేకానంద వాదనలు వినిపిస్తూ.. చిన్న ర్యాష్ డ్రైవింగ్ అంశంపై పెద్ద పెద్ద సెక్షన్‌లు పెట్టారని తెలిపారు. పిటిషనర్‌కు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవని చెప్పారు. సంచలనం కోసం పెట్టిన ఈ కేసును కొట్టేయాలని కోరారు. పోలీసుల తరఫున రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ విదేశాల నుంచి వచ్చిన పిటిషనర్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా ఇప్పటికే దిగువ కోర్టులో బెయిల్ వచ్చిందని తెలిపారు. ఈ దశలో ఎలాంటి ఉపశమనం ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పిటిషనర్‌కు బెయిల్ వచ్చినందున దర్యాప్తుపై స్టే ఇవ్వడానికి ధర్మాసనం నిరాకరించింది.

చెరువుల రక్షణపై వివరణ ఇవ్వండి

» ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల రక్షణకు ఏయే చర్యలు తీసుకుంటున్నారో వివరిస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి గురువారం హైకోర్టు నోటీసులు జారీచేసింది. హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల్లో చెరువులు, కుంటలు కబ్జాలతో అంతరించిపోతున్న తీరుపై పత్రికల్లో వచ్చిన కథనాలను ఉటంకిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ప్రధాన న్యాయమూర్తికి లేఖరాశారు. ఈ లేఖను సుమోటోగా స్వీకరించిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం.. చీఫ్ సెక్రటరీ, మున్సిపల్, రెవెన్యూ, హోం, నీటిపారుదలశాఖలతోపాటు హెచ్‌ఎండీఏ లేక్ ప్రొటెక్షన్ కమిటీ తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నాలుగువారాలకు వాయిదాపడింది. కాగా, ఈనెల 23న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన హనుమాన్ విజయయాత్ర ర్యాలీకి పలు షరతులతో అనుమతిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. తెలంగాణ బజరంగ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్ లక్ష్మణ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం ఈ ఆదేశాలు జారీచేసింది.

'ఓటుకు నోటు'పై సుప్రీం విచారణ జూలైకి వాయిదా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా పడింది. ఈ కేసులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును నిందితుడిగా చేర్చి.. దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్ గురువారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ కేసులో చట్ట సంబంధ అంశాలు అనేకం ముడిపడి ఉన్నాయని, ఆ వివరాలను అందించేందుకు సమయం కావాలని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది కోరారు. ఎంత సమయం కావాలని ధర్మాసనం ప్రశ్నించగా.. రెండు వారాల్లో అందించేందుకు సిద్ధంగా ఉన్నామని న్యాయవాది తెలిపారు. ఇది 2015లో జరిగిన వ్యవహారమని, అప్పుడు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌పై విచారణ పెండింగ్‌లో ఉందని ఆళ్ల రామకృష్ణారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది బసంత్ అన్నారు. వాదనలు వినిపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా కోర్టుకు తెలిపారు. 'వేసవి సెలవుల తర్వాత విచారణ చేపడతాం. జూలై చివరి వారంలో వాదనలు వినిపించడానికి సిద్ధంగా ఉండండి. జూలై 24 వరకు మీకు సమయం ఇస్తున్నాం. ఆ రోజు విచారణ చేపడతాం' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ తర్వాత మళ్లీ వాయిదాలు కోరవద్దని తెలంగాణ ప్రభుత్వం, చంద్రబాబు తరఫు న్యాయవాదులకు సూచించింది.

ఫాదరే.. గాడ్‌ఫాదర్

నాన్న గెలిపిస్తాడా?

పార్లమెంటు ఎన్నికల బరిలో సీనియర్ రాజకీయ నేతల వారసులు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో రాణించాలంటే.. ఓ గాడ్ ఫాదర్ ఉండాలంటారు. ఆ గాడ్ ఫాదర్.. సొంత తండ్రే అయితే? ఇక ఆ వారసులకు తిరుగుండదు. ఇందుకు గతంలో చాలా ఉదాహరణలున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల సమరంలో కొన్ని నియోజకవర్గాల్లో ఇదే సీన్ కనిపిస్తోంది. మూడు, నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో రాణిస్తున్న సీనియర్ నేతలు కొందరు.. ఈ ఎన్నికల్లో తమ వారసులను బరిలో దింపారు. పార్టీ అధిష్ఠానాన్ని ఒప్పించి, మెప్పించి ఎంపీ టికెట్ ఇప్పించడంతో సరిపెట్టకుండా.. వారి ఎన్నికల ప్రచారం, గెలుపు బాధ్యతలను కూడా తండ్రులే తమ భుజాలపై వేసుకున్నారు. ఆ బాధ్యతలు మోస్తున్నవారిలో.. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన కడియం శ్రీహరి, గడ్డం వివేకానంద లాంటివారు ఉన్నారు. అంతే కాదు.. వారసులు పోటీచేస్తున్న ఎంపీ స్థానాల పరిధిలోనే వీరి అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇక.. కుందూరు జానారెడ్డి, పోతుగంటి రాములు తాము పోటీచేయకుండా వారసులకు టికెట్లు ఇప్పించుకున్నారు. ఇలా తండ్రుల పరపతితో బరిలోకి దిగిన వారసులను.. 'నాన్న గెలిపిస్తాడా?' అనే చర్చ విస్తృతంగా జరుగుతోంది.

కూతురి కోసం




వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం(ఎస్సీ) నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా.. మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కడియం కావ్య బరిలో దిగారు. వైద్యసేవలతోపాటు సామాజిక సేవలోనూ కొంతకాలంగా నిమగ్నమైన కావ్య.. ఇటీవలే రాజకీయ రంగప్రవేశం చేశారు. కొంతకాలంగా ఆమెను క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకురావాలని భావించిన కడియం శ్రీహరి.. గత ఎన్నికల్లో వరంగల్ పార్లమెంటు, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే టికెట్ల కోసం కూడా ప్రయత్నాలు చేశారు. అయితే అప్పట్లో అవకాశాలు రాలేదు. ఈసారి వరంగల్ ఎంపీగా పోటీచేసే ఛాన్స్ తొలుత బీఆర్ఎస్ నుంచి వచ్చింది. అయితే అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తే... గెలుస్తామనే నమ్మకం లేకపోవడంతో కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారు. కాంగ్రెస్‌లో చేరిన వెంటనే అదే వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి ఎంపీ టికెట్ సాధించారు. ప్రచార పర్వంలో నిమగ్నమయ్యారు. కడియం శ్రీహరికి పలు ఎన్నికల్లో పోటీచేసిన అపార అనుభవం ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు కూడా! ఆ నియోజకవర్గంతోపాటు పాలకుర్తి, పరకాల, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు వరంగల్ పార్లమెంటు పరిధిలో ఉన్నాయి. వీటన్నింటిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. కావ్యకు ఎన్నికల్లో పోటీచేసిన అనుభవం లేకపోవటంతో.. శ్రీహరి అంతా తానై ఎన్నికల ప్రచారాన్ని నడిపిస్తున్నారు.

బ్రాండ్ జానారెడ్డి..




నల్లగొండ నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా.. సీనియర్ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి కుమారుడు రఘువీర్ రెడ్డి పోటీ చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయని జానారెడ్డి.. చిన్న కుమారుడు జయవీర్‌రెడ్డిని నాగార్జునసాగర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేయించి గెలిపించుకున్నారు. ఇప్పుడు పెద్దకుమారుణ్ని ఎంపీగా గెలిపించాలని కంకణం కట్టుకున్నారు. ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చిన జానారెడ్డి.. 1983, 1985, 1989, 1999, 2004, 2009, 2014 ఎన్నికల్లో గెలిచారు. ఇలా 7 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జానారెడ్డి.. ఉమ్మడి ఏపీలో దీర్ఘకాలం మంత్రిగా పనిచేసిన రికార్డును సొంతం చేసుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆయనకు మంచి పట్టుంది. నల్లగొండ పార్లమెంటు పరిధిలోని దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్క సూర్యాపేట మినహా మిగతా ఆరు చోట్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఉత్తమ్ సతీమణి పద్మావతి ప్రాతినిధ్యం వహిస్తున్న నల్లగొండ, హుజూర్‌నగర్, కోదాడ అసెంబ్లీ సెగ్మెంట్లతోపాటు... జానా మరో కుమారుడు జయవీర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సాగర్ సెగ్మెంటు కూడా నల్లగొండ పార్లమెంటు పరిధిలోనే ఉండటం గమనార్హం. దీంతో వారందరినీ సమన్వయం చేసుకుంటూ రఘువీర్ విజయం కోసం జానారెడ్డి కృషిచేస్తున్నారు.




నాన్న, పెదనాన్న తోడుగా..

పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి కాకా (గడ్డం వెంకటస్వామి) మనవడు వంశీ ఎన్నికల బరిలో దిగారు. కాకా వారసులుగా గడ్డం వినోద్, వివేక్ రాజకీయాల్లో రాణిస్తుండగా.. మూడోతరం రాజకీయ వారసుడిగా వివేక్ తనయుడు వంశీ క్రియాశీల రాజకీయాల్లో ప్రవేశించారు. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్, బీజేపీలకు వలసపోయి, తిరిగి సొంతగూటికి (కాంగ్రెస్) చేరిన వివేక్.. గత ఎన్నికల్లో చెన్నూరు అసెంబ్లీ సెగ్మెంటు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన సోదరుడు, వంశీకి పెద్దనాన్న అయిన గడ్డం వినోద్.. బెల్లంపల్లి నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ రెండు సీట్లూ పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోనే ఉండటం గమనార్హం. మిగతా ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ (పెద్దపల్లి, మంచిర్యాల, రామగుండం, ధర్మపురి, మంథని) కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పైపెచ్చు పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో కాకా కుటుంబానికి మంచి పట్టు ఉంది. గడ్డం వెంకటస్వామి 4 సార్లు పెద్దపల్లి ఎంపీగా గెలిచారు. కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. 2009లో వివేక్ కూడా పెద్దపల్లి ఎంపీగా గెలుపొందారు. వినోద్ 2004లో చెన్నూరు, 2023లో బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ క్రమంలోనే తన తనయుడు గడ్డం వంశీకి ఎంపీ టికెట్ ఇప్పించుకున్న వివేక్.. ఇప్పుడు ప్రచార బాధ్యతలను కూడా తానే నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేలతోపాటు పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.

తన స్థానాన్ని కుమారుడికి ఇప్పించి మరీ..




నాగర్‌కర్నూల్ పార్లమెంటు స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోతుగంటి భరత్ ప్రసాద్ బరిలో దిగారు. మాజీ ఎంపీ, మాజీ మంత్రి పోతుగంటి రాములు తనయుడైన భరత్.. వృత్తిరీత్యా న్యాయవాది. గత ప్రాదేశిక ఎన్నికల్లో కల్వకుర్తి జడ్పీటీసీ సభ్యునిగా పోటీచేసి గెలుపొందారు. నాగర్‌కర్నూల్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న రాములు ఇటీవలే బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. తాను ఎన్నికల్లో పోటీచేయకుండా... తనయుడు భరత్‌కు బీజేపీ నుంచి ఎంపీ టికెట్ ఇప్పించుకున్నారు. రాములుకు పాలమూరు జిల్లా రాజకీయాల్లో మంచి గుర్తింపు ఉంది. 1994లో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆయన.. 1994, 1999, 2009 ఎన్నికల్లో అచ్చంపేట నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. చంద్రబాబు క్యాబినెట్‌లో మంత్రిగా కూడా పనిచేశారు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరి 2019 ఎంపీగా గెలుపొందారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోవటంతో బీజేపీలో చేరి... తనయుడు భరత్‌ను తన సిట్టింగ్ స్థానం నుంచి ఎంపీగా బరిలోకి దింపారు. కాగా నాగర్ కర్నూల్ పార్లమెంటు పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల్లో... ఐదు చోట్ల కాంగ్రెస్, రెండు చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తన పరపతితో పాటు, మోదీ బ్రాండ్ ఫార్ములా కూడా కలిసొస్తుందనే ఆలోచనతో రాములు బీజేపీ నుంచి కుమారుడికి టికెట్ ఇప్పించి ప్రచార బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

ఎన్నికల శిక్షణ తరగతులకు గైర్హాజరు

» ప్రభుత్వ ఉద్యోగులపై క్రిమినల్ కేసు..

» పది మందిపై ఎఫ్ఐఆర్ : రోనాల్డ్‌రోస్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులకు గైర్హాజరయ్యే ఉద్యోగుల విషయంలో కఠినంగా ఉంటామని హెచ్చరించినట్టుగానే ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. శిక్షణ తరగతులకు గైర్హాజరైన సిబ్బందిపై ఆర్‌పీ యాక్ట్ 1951, సెక్షన్ 134 ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. పోలీసులు ఎఫ్ఐఆర్‌లను గైర్హాజరైన ఉద్యోగులకు అందజేస్తున్నారని చెప్పారు. హైదరాబాద్ జిల్లా పరిధిలోని రెండు లోక్‌సభ, ఒక అసెంబ్లీ స్థానంలో ఎన్నికల విధుల నిమిత్తం 23 వేల సిబ్బంది అవసరం. విధుల నిర్వహణకు సంబంధించి మొదటి దశ శిక్షణకు హాజరు కావాలని ఉద్యోగులకు జీహెచ్‌ఎంసీ సందేశం పంపింది. ఏపీఓ, ఓపీఓ, మైక్రో అబ్జర్వర్లు.. దాదాపు 3700 మంది శిక్షణ తరగతుల్లో పాల్గొనలేదు. దీంతో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కొందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ఎన్నికల సంఘానికి పంపినట్లు అధికారులు చెబుతున్నారు. గర్భిణులు, దివ్యాంగులు, అనారోగ్యం వంటి సహేతుక కారణాలున్న వారికి మాత్రమే మినహాయింపు ఉంటుందని, ఇతరులు తప్పనిసరిగా ఎన్నికల విధులకు హాజరు కావాల్సిందే అని రోనాల్డ్‌రోస్ ఇప్పటికే ప్రకటించారు.

కేసులు నమోదైన వారిలో పలువురి పేర్లు...

● సయ్యద్ ఇలాయాస్ అహ్మద్, జూనియర్ అసిస్టెంట్, సహకార, రిజిస్ట్రార్ కార్యాలయం, నాంపల్లి ● జీ రవిప్రసాద్, సీనియర్ అసిస్టెంట్, ఓయూ మెయిన్ క్యాంపస్ ● డాక్టర్ జే కృష్ణయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఓయూ క్యాంపస్ ● మాజిద్‌ఖాన్, జూనియర్ అసిస్టెంట్, పాఠశాల విద్యాశాఖ డీఈఓ కార్యాలయం ● మీర్జా నసీర్ బేగ్, స్కూల్ అసిస్టెంట్, పాఠశాల విద్యాశాఖ ● నాగరాజు, డీఎస్‌టీఓ, వాణిజ్య పన్నుల విభాగం, పంజాగుట్ట ● కే మధుసూదన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్, వాణిజ్య పన్నుల విభాగం, పంజాగుట్ట ● సయ్యద్ అబ్దుల్లా జుబేర్, టీచర్, బార్కస్ బాయ్స్ స్కూల్ ● కే మహేష్, జూనియర్ అసిస్టెంట్, హజ్ కమిటీ ● చిలివేరి శంతన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్, ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ కార్యాలయం, ఎర్రమంజిల్

ప్రధాని మోదీపై ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు

» టీపీసీసీ నేత నిరంజన్

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన ప్రధాని మోదీపై ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ తెలిపారు. నిబంధనల ప్రకారం మసీదులు, దేవాలయాలను ఎన్నికల ప్రచారానికి ఉపయోగించరాదన్నారు. అయోధ్య మందిరంలో శ్రీరామనవమి సందర్భంగా చోటు చేసుకున్న ఘట్టం గురించి ప్రధాని మోదీ ఎన్నికల సమావేశంలో మాట్లాడటం నిబంధనల అతిక్రమణగానే పరిగణించాలని గురువారం గాంధీభవన్‌లో నిరంజన్ చెప్పారు. అస్సాం సభలో ప్రధాని ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని, దీనిపై తాము ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కాగా జీహెచ్‌ఎంసీ పరిధిలో 5.41 లక్షల మంది ఓటర్లను తొలగించడం ఆశ్చర్యంగా ఉందని నిరంజన్ చెప్పారు. ఓటర్ల జాబితా తప్పులతడకగా మారిందని మండిపడ్డారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

జగ్గారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో సంగారెడ్డి రామ్ మందిర్‌లో వేడుక

సంగారెడ్డి, ఏప్రిల్ 18 : మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో సంగారెడ్డిలో బుధవారం రాత్రి శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. బుధవారం ఉదయమే తన నివాసం నుంచి జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మేళతాళాల నడుమ ఊరేగింపుగా శ్రీ సీతారాముల బంగారు ఆభరణాలను రామ్ మందిర్‌కు తీసుకువచ్చారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి పర్యవేక్షణలో జ్యోతిర్వాస్తు విద్యాపీఠం సిద్ధాంతి మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ క్రతువును నిర్వహించారు. సీతమ్మ కోసం తయారు చేయించిన మంగళసూత్రాన్ని ఈ సందర్భంగా జగ్గారెడ్డి భక్తులకు చూపించారు. కల్యాణంలో భాగంగా జగ్గారెడ్డి దంపతులు సీతారామచంద్రుల విగ్రహాలపై ముత్యాల తలంబ్రాలను పోశారు. అనంతరం వేడుకకు హాజరైన వారికి జగ్గారెడ్డి దంపతులు తలంబ్రాలను అందజేశారు.




భక్తులకు మంగళసూత్రాన్ని చూపిస్తున్న జగ్గారెడ్డి; సీతారాముల విగ్రహాలపై ముత్యాల తలంబ్రాలు పోస్తున్న జగ్గారెడ్డి దంపతులు

కాంగ్రెస్ మండల అధ్యక్షుడి ఆత్మహత్యాయత్నం

వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఇంటి దగ్గర ఉద్రిక్తత

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇతర పార్టీల నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై అసహనం చెందిన ఆ పార్టీ వనపర్తి మండల అధ్యక్షుడు ఆత్మహత్యాయత్నం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తమపై కేసులు పెట్టి, తమను జైలు పాలు చేసిన వారిని ఎలా పార్టీలోకి తీసుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. వనపర్తి నియోజకవర్గం గోపాల్‌పేట మండలం తాడిపర్తికి చెందిన మాజీ సర్పంచ్, ప్రస్తుత కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండ్రాతి గణేశ్ గౌడ్ సీనియర్ నాయకుడిగా కొనసాగుతున్నారు. తాడిపర్తి గ్రామానికి చెందిన లోకారెడ్డిని కాంగ్రెస్‌లోకి తీసుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చర్చలు జరుపుతుండటంతో గణేశ్ గౌడ్ అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఆయన తన అనుచరులతో కలిసి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ఇంటికి వెళ్లారు. లోకారెడ్డిని పార్టీలో చేర్చుకోవద్దని, ఆయన బీఆర్ఎస్‌లో ఉండి చాలా ఇబ్బందులకు గురిచేశారని వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో గణేశ్ గౌడ్ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని తనను అంటించాలని ఎమ్మెల్యేకు అగ్గిపెట్టె ఇవ్వడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. కొన్నాళ్లుగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి వర్గాల మధ్య వ్యవహారం ఉప్పునిప్పులా మారింది. తాజా ఘటనకూ ఇరువర్గాల మధ్య ఏర్పడిన వైరమే కారణమని తెలుస్తోంది.



నిరసన దీక్ష చేపట్టిన మోత్కుపల్లికి సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

మాదిగలకు రెండు టికెట్లు ఇవ్వాలి

» మాదిగల వల్లే కాంగ్రెస్‌కు అధికారం దక్కింది

» అయినా ఒక్క టికెట్టూ ఇవ్వకపోవడం బాధాకరం : మోత్కుపల్లి నర్సింహులు

అమీర్‌పేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జనాభాలో 80 లక్షలుగా ఉన్న మాదిగలకు కాంగ్రెస్ పార్టీ రెండు లోక్‌సభ టికెట్లు ఇవ్వాలని మాజీ మంత్రి, ఆ పార్టీ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత శాసనసభ ఎన్నికల్లో మాదిగలంతా ఏకమై ఓట్లేస్తేనే కాంగ్రెస్‌కు అధికారం దక్కిందని, మాదిగల చలువతోనే రేవంత్ రెడ్డి సీఎం, భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం అయ్యారని అన్నారు. అయినా మాదిగలకు లోక్‌సభ ఎన్నికల్లో ఒక టికెట్ కూడా ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ గురువారం తన నివాసంలో ఆయన ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మాదిగలకు టికెట్లు కేటాయించకపోవడం బాధాకరమని, ఈ విధానాన్ని చూస్తే రాజకీయంగా మాదిగలను బొందపెట్టాలని చూస్తున్నట్లుగా భావించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధిష్ఠానం పునరాలోచించి మాదిగలకు రెండు టికెట్లు కేటాయించాలని మోత్కుపల్లి డిమాండ్ చేశారు. కాగా, మోత్కుపల్లి నిరసన దీక్షను తెలుసుకున్న మల్కాజ్‌గిరి మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావుతో పాటు మాదిగ సంఘాల నిర్వాహకులు ఆయన నివాసానికి చేరుకొని సంఘీభావం ప్రకటించారు. అనంతరం వారు మోత్కుపల్లికి నిమ్మరసం అందజేసి, దీక్షను విరమింపజేశారు.

విపక్షాలవి విభజన రాజకీయాలు

» మోదీది వికసిత భారత్ నినాదం: ఎంపీ లక్ష్మణ్



హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రాంతాల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ విపక్షాలు విభజన రాజకీయాలు చేస్తున్నాయని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ మండిపడ్డారు. ప్రధాని మోదీ వికసిత భారత్ నినాదంతో వెళుతుంటే.. విపక్షాలు ఉత్తర భారత్, దక్షిణ భారత్ అంటూ విభజన మార్గంలో వెళ్తున్నాయని దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా మోదీ ప్రభంజనం కొనసాగుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజలూ మోదీ మరోసారి ప్రధాని కావాలని కోరుకుంటున్నాయని చెప్పారు. ఈవీఎంలపై కాంగ్రెస్ నేత రాహుల్‌వి చౌకబారు విమర్శలని లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఈవీఎంలతో గెలువలేదా? అని నిలదీశారు. రాహుల్‌కు వయసు పెరుగుతుండగా.. పరిణతి తగ్గుతోందని ఎద్దేవా చేశారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 2047కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. నల్లధనాన్ని అరికట్టేందుకు మోదీ పలు సంస్కరణలు చేపట్టారని చెప్పారు. గతంలో ఏ పార్టీకి ఎన్ని విరాళాలు వచ్చాయో కూడా తెలిసేది కాదన్నారు. ఎన్నికల బాండ్ల ద్వారా అన్ని పార్టీలకూ విరాళాలు అందాయని, వీటిని కూడా రాహుల్ వ్యతిరేకించడం సిగ్గుచేటని చెప్పారు. బాండ్లను వ్యతిరేకించడమంటే నల్లధనాన్ని ప్రోత్సహించడమేనన్నారు. 247 స్థానాల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్.. 200 పైచిలుకు స్థానాల్లో ఓడిపోతోందని చెప్పారు. తెలంగాణలో 14 సీట్లు గెలిచి, రాహుల్ ప్రధాని అయితే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని సీఎం రేవంత్ అంటున్నారని.. కాంగ్రెస్ 40 సీట్లు గెలవలేని పరిస్థితి ఉంటే రాహుల్ ప్రధాని ఎలా అవుతారని ప్రశ్నించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

నీట్ పీజీ నోటిఫికేషన్

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శుక్రవారం 19 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com



నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎంఎస్) - నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ (నీట్-పీజీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా ఎండీ, ఎంఎస్, పీజీ డిప్లొమా, పోస్ట్ ఎంబీబీఎస్ డీఎన్‌బీ, ఎన్‌బీఈ ఎంఎస్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: ఎంబీబీఎస్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 2024 ఆగస్టు 15 నాటికి ఏడాది వ్యవధిగల ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లేదా స్టేట్ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి.

నీట్ పీజీ 2024 వివరాలు: ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడున్నర గంటలు. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఇస్తారు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు; జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 45 శాతం మార్కులు రావాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు.

ముఖ్య సమాచారం

- **పరీక్ష ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.3,500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2,500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 6
- **ఎడిట్ విండో ఓపెన్:** మే 10 నుంచి మే 16 వరకు
- **ప్రీ ఫైనల్ ఎడిట్ విండో ఓపెన్:** మే 28 నుంచి జూన్ 3
- **ఫైనల్ ఎడిట్ విండో ఓపెన్:** జూన్ 7 నుంచి 10 వరకు
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 18 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, సత్తుపల్లి, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, సిద్దిపేట, సూర్యాపేట, కోదాడ, అనంతపురం, చీరాల, చిత్తూరు, ఏలూరు, గూడూరు, గుంటూరు, కావలి, కర్నూలు, ఎమ్మిగనూరు, మచిలీపట్నం, మదనపల్లి, నంద్యాల, నర్సరావుపేట, నెల్లూరు, నర్సాపురం, ఒంగోలు, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, తాడిపత్రి, తెనాలి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం.
- **నీట్ పీజీ 2024 తేదీ:** జూన్ 23
- **ఫలితాలు విడుదల:** జూలై 15
- **వెబ్‌సైట్:** nbe.edu.in, https://natboard.edu.in

నైసర్‌లో సమ్మర్ ఇంటర్న్‌షిప్

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్)కు చెందిన స్కూల్ ఆఫ్ మేథమెటికల్ సైన్సెస్(ఎస్ఎంఎస్)- సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి రెండు నెలలు. మే 13 నుంచి ప్రోగ్రామ్ ప్రారంభమౌతుంది. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. మేథమెటికల్ సైన్సెస్ విభాగాల్లో ఆసక్తిగల డిగ్రీ/పీజీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

మేథ్స్ విభాగాలు: డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, ఇన్సిడెన్స్ జామెట్రీ, నెంబర్ థియరీ, క్రిప్టోగ్రఫీ - డిస్క్రీట్ మేథమెటిక్స్, ఫంక్షనల్ అనాలిసిస్, ఆల్జీబ్రిక్ గ్రాఫ్ థియరీ-డిస్క్రీట్ మేథమెటిక్స్, డిస్క్రీట్ మేథమెటిక్స్, ఆల్జీబ్రిక్ జామెట్రీ, ప్రాబబులిటీ థియరీ, ఫంక్షనల్ అనాలిసిస్, హార్మోనిక్ అనాలిసిస్, డిఫరెన్షియల్ జామెట్రీ, ఆల్జీబ్రా.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 20
- **వెబ్‌సైట్:** www.niser.ac.in

బిట్ మెస్రాలో ఎమ్మెస్సీ యానిమేషన్



మెస్రా(రాంచీ)లోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బిట్)- ఎమ్మెస్సీ(యానిమేషన్ డిజైన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ క్రియేటివ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. జైపూర్ క్యాంపస్‌లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. మొత్తం పది సీట్లు ఉన్నాయి. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో బీఎస్సీ(యానిమేషన్ అండ్ మల్టీమీడియా)/బీఎఫ్ఏ/బీ డిజైన్/బ్యాచిలర్ ఆఫ్ విజువల్ ఆర్ట్/బ్యాచిలర్ ఇన్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు క్రియేటివ్ ఆర్ట్ రంగాల్లో కనీసం ఏడాది అనుభవం ఉన్నవారు కూడా అర్హులే. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసిన/రాసే వారూ అప్లయ్ చేసుకోవచ్చు. వీరు అడ్మిషన్ నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

క్రియేటివ్ ఆప్టిట్యూడ్ టెస్ట్: ఇది 90 మార్కులకు ఉంటుంది. ఇందులో ఐడియా క్రియేషన్, క్రియేటివ్ రైటింగ్, స్టోరీ టెల్లింగ్, కంటెంట్ డెవలప్‌మెంట్-విజువలైజేషన్‌కు 10 మార్కులు; స్టోరీ బోర్డింగ్, క్యారెక్టర్ డిజైనింగ్, యానిమేషన్ ఆప్టిట్యూడ్(బేసిక్ నాలెడ్జ్ ఆఫ్ సీక్వెన్షియల్ ఆర్ట్), బేసిక్స్ ఆఫ్ ఆర్ట్ అండ్ డిజైన్ ప్రిన్సిపల్స్-బేసిక్స్ ఆఫ్ కంపోజిషన్ అండ్ జనరల్ అవేర్‌నెస్ ఆఫ్ కంప్యూటర్ అండ్ గ్రాఫిక్స్ అంశాల్లో ఒక్కోదానికి 20 మార్కులు ప్రత్యేకించారు. ఇంటర్వ్యూకి 10 మార్కులు నిర్దేశించారు. ఇందులో అభ్యర్థులు పోర్ట్‌ఫోలియో, రీల్స్, స్కెచ్‌లు, డ్రాయింగ్స్ చూపించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 10
- **క్రియేటివ్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 14
- **క్రియేటివ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** జూన్ 19 నుంచి 20 వరకు
- **వెబ్‌సైట్:** www.bitmesra.ac.in

ఎంఏఎన్ఐటీలో పీజీ ప్రోగ్రామ్‌లు

భోపాల్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఏఎన్ఐటీ)- పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంఏ డెవలప్‌మెంట్ స్టడీస్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.



ఎంబీఏ

ఇది రెండేళ్ల వ్యవధి గల డ్యూయెల్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్. ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్, మార్కెటింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లో రెగ్యులర్, స్పాన్సర్డ్, పార్ట్ టైమ్ కేటగిరీలు ఉన్నాయి. రెగ్యులర్ అభ్యర్థులకు 66 సీట్లు, పార్ట్ టైమ్ అభ్యర్థులకు 66 సీట్లు, స్పాన్సర్డ్ అభ్యర్థులకు 2 సీట్లు ఉన్నాయి.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్/మ్యాట్/సీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. స్పాన్సర్డ్ అభ్యర్థులకు కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి.

ఎంఏ డెవలప్‌మెంట్ స్టడీస్

ఇది రెండేళ్ల వ్యవధి గల ప్రోగ్రామ్. ఇందులో రెగ్యులర్, పార్ట్ టైమ్ కేటగిరీలు ఉన్నాయి. ఒక్కో కేటగిరీలో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడు/నాలుగేళ్ల వ్యవధిగల బీఏ/బీఎస్సీ/బీటెక్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమశ్రేణి మార్కులు తప్పనిసరి.

ఎంసీఏ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇది పార్ట్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో 115 సీట్లు ఉన్నాయి.

అర్హత: మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ప్రధాన సబ్జెక్టుగా మూడేళ్ల డిగ్రీ లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎమ్మెస్సీ

ఇది పార్ట్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో ఫిజిక్స్ కెమిస్ట్రీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి ఫిజిక్స్/కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టుగా మూడేళ్ల డిగ్రీ పూర్తిచేసి ఉండాలి.

ముఖ్య సమాచారం

- పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లలో చేరే అభ్యర్థులకు సంబంధిత విభాగాల్లో కనీసం ఏడాది అనుభవం ఉండాలి. వీరికి గేట్/నెట్/క్యాట్/సీమ్యాట్/నిమ్‌సెట్/జామ్ అర్హత తప్పనిసరి కాదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 6
- **ఇంటర్వ్యూలు:** జూన్ 18 నుంచి 25 వరకు
- **ఫలితాలు విడుదల:** జూన్ 28
- **అడ్మిషన్ తేదీలు:** జూలై 11, 12
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** అసిస్టెంట్ రిజిస్ట్రార్(అకడమిక్స్), ఎంఏఎన్ఐటీ, లింక్ రోడ్ నెం. 3 వద్ద, భోపాల్-462003
- **వెబ్‌సైట్:** www.manit.ac.in

జాబ్ కార్నర్

వ్యాప్‌కోస్‌లో ఇంజనీర్లు

ఖాళీలు 275

న్యూఢిల్లీలోని వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్... ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన వ్యాప్‌కోస్ ప్రాజెక్టు పనుల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీల వివరాలు

1. టీమ్ లీడర్: **1 పోస్టు**
2. డిప్యూటీ టీమ్ లీడర్/రెసిడెంట్ ఇంజనీర్: **2 పోస్టులు**
3. సీనియర్ సివిల్ ఇంజనీర్: **2 పోస్టులు**
4. సీనియర్ మెకానికల్ ఇంజనీర్: **2 పోస్టులు**
5. సీనియర్ ఎలక్ట్రికల్ ఇంజనీర్: **2 పోస్టులు**
6. సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్: **2 పోస్టులు**
7. సివిల్ ఇంజనీర్: **16 పోస్టులు**
8. మెకానికల్ ఇంజనీర్: **8 పోస్టులు**
9. ఎలక్ట్రికల్ ఇంజనీర్: **4 పోస్టులు**
10. అకౌంటెంట్: **2 పోస్టులు**
11. టీమ్ లీడర్: **1 పోస్టు**
12. సీనియర్ సివిల్ ఇంజనీర్: **6 పోస్టులు**
13. క్యూసీ ఇంజనీర్: **8 పోస్టులు**
14. ఇంటర్మీడియెట్ లెవల్ సివిల్ ఇంజనీర్: **182 పోస్టులు**
15. జూనియర్ లెవెల్ సివిల్ ఇంజనీర్: **182 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి డిప్లొమా, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, బీకాం ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి 55 సంవత్సరాలు మించకూడదు

దరఖాస్తులు పంపాల్సిన ఈమెయిల్: wapcos1maf@yahoo.com

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 26

వెబ్‌సైట్: www.wapcos.co.in/careers.aspx

సెంట్రల్ మెడికల్ సర్వీసెస్‌లో మేనేజర్లు

ఖాళీలు 15

న్యూఢిల్లీలోని సెంట్రల్ మెడికల్ సర్వీసెస్ సొసైటీ... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్): **1 పోస్టు**
2. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ఫైనాన్స్): **1 పోస్టు**
3. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ప్రొక్యూర్‌మెంట్): **2 పోస్టులు**
4. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(క్వాలిటీ అస్యూరెన్స్): **1 పోస్టు**
5. మేనేజర్(ప్రొక్యూర్‌మెంట్): **2 పోస్టులు**
6. మేనేజర్(లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్): **2 పోస్టులు**
7. మేనేజర్(ఫైనాన్స్): **2 పోస్టులు**
8. మేనేజర్(క్వాలిటీ అస్యూరెన్స్): **2 పోస్టులు**
9. ఆఫీస్ అసిస్టెంట్: **1 పోస్టు**
10. వేర్ హౌస్ మేనేజర్(ఫార్మాసిస్ట్): **1 పోస్టు**

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, ఐసీడబ్ల్యూఏ, సీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: మేనేజర్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు 40 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, వేర్‌హౌస్ మేనేజర్ పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టులకు రూ.1,00,000; మేనేజర్, వేర్‌హౌస్ మేనేజర్ పోస్టులకు రూ.50,000; ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు రూ.30,000.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 20

వెబ్‌సైట్: https://cmss.gov.in



ఆర్‌సీబీలో కన్సల్టెంట్స్

ఖాళీలు 6

ఫరిదాబాద్(హరియాణా)లోని రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: కన్సల్టెంట్(టెక్నికల్ ఎక్స్‌పర్ట్ సర్వీస్ ప్రొవైడర్)

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో పీజీ, పీహెచ్‌డీ(లైఫ్ సైన్సెస్/కెమిస్ట్రీ) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 40 సంవత్సరాలు మించకూడదు

వేతనం: నెలకు రూ.60,000 - రూ.80,000

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30

వెబ్‌సైట్: www.rcb.res.in

సీఐబీఏలో యంగ్ ప్రొఫెషనల్స్

ఖాళీలు 2

ఐకార్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్ వాటర్ అక్వాకల్చర్, చెన్నై... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ(ఎంఎఫ్ఎస్సీ/ఏవీఎస్సీ)తోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: పురుషులకు 35 ఏళ్లు, మహిళలకు 40 ఏళ్లు మించరాదు.

ఫెలోషిప్: నెలకు రూ.42,000

దరఖాస్తులు పంపాల్సిన ఈమెయిల్: riteshicarciba@gmail.com

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 22

వెబ్‌సైట్: https://ciba.icar.gov.in

ఐఐటీ న్యూఢిల్లీలో కన్సల్టెంట్స్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, న్యూఢిల్లీ - తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. కన్సల్టెంట్(అడ్మినిస్ట్రేటివ్): **2 పోస్టులు**
2. కన్సల్టెంట్(టెక్నికల్ అడ్మినిస్ట్రేటివ్): **1 పోస్టు**

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్/ఎంబీఏ/ఎమ్మెస్సీతోపాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు రూ.1,25,000 - రూ.1,50,000

వయోపరిమితి: 45 సంవత్సరాల లోపు ఉండాలి

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 25

వెబ్‌సైట్: https://home.iitd.ac.in/

లిటిల్స్



మీకు తెలుసా?


- పాంగోలియన్ మీద పొలుసులుంటాయి. వీటిని బట్టి సులువుగా పాంగోలియన్లను గుర్తు పట్టొచ్చు.
- సహారా ఎడారిలో ఎక్కువ ఉంటాయివి. 30 సెం.మీ. నుంచి 100 సెం.మీ పొడవు ఉంటాయి. ఆడ పాంగోలియన్ల కంటే మగ పాంగోలియన్లు 40 శాతం పెద్దవిగా ఉంటాయి.
- దీనిమీద ఉండే పొలుసుల నిర్మాణం కెరోటిన్‌తో తయారవుతుంది. మన గోర్లు కూడా కెరోటిన్ నిర్మాణమే. పాంగోలియన్ల పొలుసులు గట్టిగా ఉంటాయి.
- దీని తోక పొడవుగా ఉంటుంది. యాక్టివ్‌గా ఉంటుందిది. చెట్టుమీద వేగంగా తిరుగుతుంది. ఇవి స్వతహాగానే నీళ్లలో అద్భుతంగా ఈదుతాయి.
- ఇవి రాత్రిపూట తిరుగుతాయి. పగలంతా నిద్రపోతాయి. అప్పుడే ఉండ చుట్టుకుని నిద్రపోతాయి.
- వీటి నోరు జిడ్డుగా ఉంటుంది. చీమలు, పురుగుల్ని తన పొడవైన



నాలుకతో తింటుంది. వాసన చూసే గుణం బావుంటుంది. అయితే వీటిని చూపు చాలా తక్కువగా ఉంటుంది.

- దీన్ని కొందరు తినటంతో పాటు ట్రెడిషనల్ మెడిసిన్‌లో ఉపయోగిస్తారు. అందుకే వీటిని దొంగతీసుకెళ్లటం, అమ్మటం చేస్తుంటారు.
- ఆఫ్రికా, ఆసియా ఖండాల్లో మాత్రమే ఇవి ఉంటాయి. వీటి సంఖ్య గణనీయంగా పెరుగటం విశేషం. శత్రువులు వస్తే ఉండలా చుట్టుకుని తనకు తాను రక్షించుకోగల సామర్థ్యం వీటికి ఉంది.


సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



12 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 285

	1	3			4	2		5
					2	4		
4					7			
	8			5				6
		5	7		3	9		
9				1			2	
			3					8
		4	8					
8		1	2			6	3	

సుడోకు - 284 సమాధానం

3	7	2	8	9	1	5	6	4
4	8	1	5	3	6	7	9	2
5	6	9	7	2	4	3	8	1
2	4	8	1	6	5	9	7	3
6	9	3	2	4	7	1	5	8
7	1	5	3	8	9	4	2	6
9	5	4	6	1	8	2	3	7
8	2	7	4	5	3	6	1	9
1	3	6	9	7	2	8	4	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.